ప్రభాతనవ
SINGIDI తెలుగు దినపత్రిక
# సింగిడి
ప్రతి రంగూ ఓ నిజం
singidinews.com
బుధవారం 19 ఆగస్టు 2026 సంపుటి: 1 సంచిక: 63 పేజీలు 12 వెల: 6.50
Published from: Hyderabad, Karimnagar, Warangal, Khammam, Nizamabad,Mahabubnagar

## పేదలకు భూమి పంపిణీ అత్యావశ్యకం

- టిఆర్ఎస్ అధికారంలోకి వస్తే భూలక్ష్మి కింద ఎకరం పంపిణీ
- పేదల భూములను లాక్కుంటూ పోతే చూస్తూ ఊరుకోం
- టిఆర్ఎస్ అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత హెచ్చరిక




2




## దిమాగీ నక్సల్స్.. మరో పార్టీ పుట్టుక

- ప్రధాని నోట మాటరావడం ఆలస్యం..
- సోషల్ మీడియాలో ఉత్పన్నం

2

భూమి కొంటే.. రిజిస్ట్రేషన్ చేయించుకోవడం సహజం. కానీ అదే భూమి 22-ఏ నిషేధిత జాబితాలో ఉంటే.. రిజిస్ట్రేషన్ ఆగిపోయే పరిస్థితి. దీంతో తెలంగాణలో 22-ఏ ఇప్పుడు రాజకీయంగానే కాదు.. ప్రజల భూ హక్కులకు సంబంధించిన కీలక అంశంగా మారింది. నిషేధిత జాబితాలో ప్రైవేట్ భూములు చేరుతున్నాయంటూ మాజీ మంత్రి హరీశ్‌రావు ప్రభుత్వాన్ని నిలదీస్తున్నారు. మరోవైపు 30 శాతం వరకు కమిషన్ డిమాండ్ చేస్తున్నారంటూ ఆయన ఆరోపణలు చేశారు. ఈ నేపథ్యంలో సీఎం రేవంత్‌రెడ్డి ఉన్నతాధికారులతో సమీక్ష నిర్వహించి.. ప్రైవేట్ భూముల రిజిస్ట్రేషన్లకు ఎలాంటి ఆటంకం ఉండదని స్పష్టం చేశారు. దీంతో అసలు 22-ఏ ఏంటి? సమస్య ఎక్కడుంది? ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలేంటి? అన్నదే ఇప్పుడు చర్చ.

- హైదరాబాద్ బ్యూరో (సింగిడి)

# తెలంగాణలో సెక్షన్ 22-ఏ సెగ

## 22-ఏపై ముదిరిన రాజకీయ రగడ

- హరీశ్‌రావు ఆరోపణలతో దుమారం
- శ్వేతపత్రానికి మాజీ మంత్రి డిమాండ్
- నిషేధిత భూములపై పెరిగిన గందరగోళం
- 30 శాతం కమిషన్‌పై సంచలన ఆరోపణ
- ప్రజల ఆస్తి హక్కులకు సీఎం భరోసా



**22-ఏ అసలు ఏంటి?**
ప్రభుత్వ, అసైన్డ్, వక్ఫ్, ఎండోమెంట్, సీలింగ్ తదితర చట్టపరమైన పరిమితులున్న భూములను 22-ఏ కింద నిషేధిత జాబితాలో ఉంచవచ్చు. అక్రమ బదలాయింపులను అడ్డుకోవడమే దీని ప్రధాన ఉద్దేశం. అయితే పొరపాటున ప్రైవేట్ ఆస్తులు కూడా ఈ జాబితాలో చేరితే.. యజమానులకు రిజిస్ట్రేషన్ సమయంలో ఇబ్బందులు ఎదురయ్యే అవకాశం ఉంటుంది.

**బీఆర్ఎస్ హయాంలోనూ ఉంది**
ఇక్కడే రాజకీయ ప్రశ్నలు మొదలవుతున్నాయి. 22-ఏ వ్యవస్థ కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చిన తర్వాత కొత్తగా ఏర్పడింది కాదు. బీఆర్ఎస్ పాలనలోనూ ఈ విధానం అమల్లో ఉంది. ధరణి సమయంలోనూ భూ రికార్డులు, నిషేధిత ఆస్తులపై వివాదాలు,

- మిగతా 2లో



## ఆత్మగౌరవం కోసం పోరాటం

- సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ గొప్ప యోధుడు
- హైదరాబాద్ ట్యాంక్ బండ్‌పై విగ్రహావిష్కరణ
- 2029లో మళ్లీ కాంగ్రెస్‌కే అధికారం ఖాయం
- బిఆర్ఎస్‌లా సొంతవాళ్లకు పదవులు ఇవ్వలేదు
- ఉద్యమకారులను గుర్తించి ఆదుకుంటున్నాం
- విగ్రహావిష్కరణ సభలో సిఎం రేవంత్ రెడ్డి

2

సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ పోరాటం అద్భుతం అని తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి అభివర్ణించారు. అమరవీరుల స్తూపానికి ఉన్న ప్రాధాన్యతే పాపన్న విగ్రహానికి ఉండాలని స్పష్టం చేశారు. మంగళవారం హైదరాబాద్‌లో సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ 376వ జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. హైదరాబాద్ ట్యాంకబేండ్‌పై ఆయన విగ్రహాన్ని మంగళవారం ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఆవిష్కరించారు.

- హైదరాబాద్,ఆగస్ట్18 (సింగిడి):

## పెట్టుబడిదారులకు స్వర్గధామం తెలంగాణ

### క్లీన్ ఎనర్జీ మ్యానుఫాక్చరింగ్ హబ్‌గా రాష్ట్రం




- పెట్టుబడిదారులు, ఆవిష్కర్తలు, శాస్త్రవేత్తలకు ఆహ్వానం
- 2035 నాటికి 26,000 మెగావాట్ల సోలార్, 8,000 మెగావాట్ల విద్యుత్ లక్ష్యం
- హైటెక్స్‌లో 'ఇండియా ఎనర్జీ సమ్మిట్ ప్రారంభించిన డిప్యూటీ సీఎం భట్టి

2



## నిషేధిత జాబితా భూ సమస్యలు పరిష్కారం

- ప్రక్రియను వేగవంతం చేస్తున్నాం... 24 గంటల్లోనే 34 రిజిస్ట్రేషన్లు పూర్తి
- తప్పును సరిదిద్దుకుంటున్నాం... మీడియాతో మంత్రి పొంగులేని వివరణ

2

22ఏ నిషేధిత భూముల జాబితాలోకి పొరపాటున చేరిన ప్రైవేట్ భూముల సమస్యను పరిష్కరించే పక్రియను వేగవంతం చేశామని రాష్ట్ర రెవెన్యూ, సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి తెలిపారు. 24 గంటల్లోనే మేడ్చల్–మల్కాజ్‌గిరి జిల్లాలో 30, రంగారెడ్డి జిల్లాలో 4.. మొత్తం 34 రిజిస్ట్రేషన్లు పూర్తయ్యాయని వెల్లడించారు. ప్రజలు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని, నిజమైన ప్రైవేట్ ఆస్తులకు పూర్తి రక్షణ కల్పిస్తామని స్పష్టం చేశారు. మంగళవారం సచివాలయంలోని తన కార్యాలయంలో మీడియాతో మాట్లాడిన మంత్రి.. 22ఏ జాబితా విషయంలో జరిగిన పొరపాట్లను ప్రభుత్వం గుర్తించిందని చెప్పారు.

- హైదరాబాద్,ఆగస్ట్18 (సింగిడి)

## పొంగులేటి వెంటనే రాజీనామా చేయాలి

- నిషేధిత జాబితా భూములకు నైతిక బాధ్యత వహించాలి
- సారీలు చెప్పి సరిపుచ్చుకోవడం కుదరదు
- బాధితుల కోసం జనతా గ్యారేజ్ తెరిచే ఉంటుంది
- బిఆర్ఎస్ నేత హరీశ్ రావు డిమాండ్

2

**హైదరాబాద్,ఆగస్ట్18 (సింగిడి):** మీ భూములను 22ఏ నిషేధిత జాబితా నుంచి విడిపించే వరకు బీఆర్ఎస్ పార్టీ అండగా ఉంటుందని మాజీ మంత్రి, పార్టీ సీనియర్ నేత హరీశ్‌రావు ప్రజలకు హామీ ఇచ్చారు. ప్రభుత్వ అనాలోచిత నిర్ణయాల వల్ల ప్రజలు రిజిస్ట్రార్ ఆఫీస్ చుట్టూ.. ప్రభుత్వ కార్యాలయాల చుట్టూ తిరగాల్సిన దుస్థితి నెలకొందని మండిపడ్డారు. పొంగులేటి నైతిక బాధ్యత వహిస్తూ వెంటనే మంత్రి పదవికి రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు.

## తాగునీటికే తొలి ప్రాధాన్యం

### పంటలకూ భరోసా కల్పించాలి

- ఎల్‌నినో వేళ ప్రతి నీటి చుక్కకూ లెక్క ఉండాలి
- అందుబాటులో ఉన్న నిల్వల ఆధారంగానే నిర్ణయాలు
- కృష్ణా బేసిన్‌లో 76.63... గోదావరి బేసిన్‌లో 68.1 శాతం నిల్వలు
- సాగర్‌లో 164 టీఎంసీల నీరు.. 47 శాతం వరద జలాలకు అవకాశం
- సింగూరు మరమ్మతులకు అత్యధిక ప్రాధాన్యం
- అంతర్రాష్ట్ర జల వివాదాలపై పటిష్ట వాదనకు సమగ్ర కార్యాచరణ
- నీటిపారుదల, పౌరసరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి

2



ఆకాశం వైపు ఆశగా చూడటం ఒక్కటే జల నిర్వహణ కాదు... ఆనకట్టలో ఎంత నీరుంది, అందులో నిజంగా వినియోగించ గలిగేది ఎంత, తాగునీటికి ఎంత కాపాడాలి, నిలువునా ఉన్న పంటకు ఎంత అందించగలం అన్న ప్రతి లెక్కలో శాస్త్రీయత, వాస్తవికత ఉండాలని రాష్ట్ర నీటిపారుదల, పౌరసరఫరాల శాఖ మంత్రి కెప్టెన్ ఎన్. ఉత్తమ్ కుమార్ రెడ్డి స్పష్టం చేశారు. ఎల్‌నినో పరిస్థితుల నేపథ్యంలో మిగిలిన వర్షాకాలంపై అనిశ్చితి కొనసాగుతున్నందున 'తాగునీటి భద్రతకు తొలి ప్రాధాన్యం... అదే సమయంలో అందుబాటులో ఉన్న నీటితో ఖరీఫ్ పంటలకు గరిష్ఠ రక్షణ' అనే సూత్రంతో ముందుకు సాగాలని అధికార యంత్రాంగాన్ని ఆదేశించారు.

- హైదరాబాద్,ఆగస్ట్18 (సింగిడి)

## స్థానిక ఎన్నికల్లో బీసీ రిజర్వేషన్లు 34%

### బీసీల జీవితాల్లో మార్పు తెచ్చే అతిపెద్ద నిర్ణయం

- ఎన్నికల హామీ మాత్రమే కాదు.... తమ రాజకీయ సిద్ధాంతం
- ప్రతి బీసీ కుటుంబం గర్వంగా చెప్పకొనే రోజు ఇది
- టిడిపి వచ్చిన తరవాతనే ఎందరో బిసి నేతలుగా ఎదిగారు
- అసెంబ్లీ చర్చలో సిఎం చంద్రబాబు నాయుడు



బీసీలకు అండగా ఉంటామని తమ ప్రభుత్వం మరోసారి రుజువు చేసిందని ఏపీ సీఎం చంద్రబాబు అన్నారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీ రిజర్వేషన్లు 34 శాతానికి పెంపు అంశంపై శాసనసభలో జరిగిన చర్చలో సీఎం మాట్లాడారు. బీసీల జీవితాల్లో మార్పు తెచ్చే అతిపెద్ద నిర్ణయం ఇది అని చెప్పారు. ఇది ఎన్నికల హామీ మాత్రమే కాదని.. తమ రాజకీయ సిద్ధాంతమన్నారు. హామీ ఇవ్వడమే కాకుండా అమలు చేస్తున్నామని తెలిపారు. స్థానిక సంస్థల్లో 34 శాతం రిజర్వేషన్లు చారిత్రక నిర్ణయమని.. ప్రతి బీసీ కుటుంబం గర్వంగా చెప్పుకొనే రోజు ఇది అని చెప్పారు.

- అమరావతి,ఆగస్ట్18 (సింగిడి)

2



## 20 నుంచి సిఎం రేవంత్ విదేశీ పర్యటన

### పది రోజుల పాటు యూకె, అమెరికా సందర్శన

2

**హైదరాబాద్,ఆగస్ట్18 (సింగిడి):** తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి విదేశీ పర్యటనకు సిద్ధమయ్యారు. ఆగస్టు 20 నుంచి 30వ తేదీ వరకు లండన్, అమెరికాలో సీఎం పర్యటించనున్నారు. ఈ పర్యటనలో భాగంగా పలు ప్రముఖ విశ్వవిద్యాలయాలు, విద్యా సంస్థలు, వ్యాపార సంస్థలను సందర్శించడంతో పాటు వివిధ సమావేశాల్లో పాల్గొననున్నారు.

## మెట్రో ఫేజ్-2 అనుమతులకు కసరత్తు

### ప్రక్రియను వేగం చేసే పనిలో అధికారులు

హైదరాబాద్ మెట్రో ఫేజ్–2కు సంబంధించిన అనుమతుల పక్రియను వేగవంతం చేయాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది.

హైదరాబాద్,ఆగస్ట్18 (సి

2



2

## ఉరిశిక్షను రద్దు చేయండి

- ఇతర సులువైన మరణాలను ప్రసాదించండి
- సుప్రీంలో దాఖలైన పిటిషన్ కొట్టివేత

## బిజెపి జేబుసంస్థగా కేంద్ర ఎన్నికల సంఘం

- ఇష్టం వచ్చినట్లుగా ఓట్లు తొలగించడం అన్యాయం
- 22శాతం ఓట్ల తొలగింపు దుర్మార్గపు చర్య
- తెలంగాణలో సర్ ప్రక్రియను పొడిగించాలి
- పిసిసి చీఫ్ మహేశ్ గౌడ్ డిమాండ్

2

సింగిడి
ప్రతి రంగూ ఓ నిజం
Singidi
బుధవారం
19 ఆగస్టు 2026

## 20 నుంచి సీఎం రేవంత్ విదేశీ పర్యటన

ఆగస్టు 20వ తేదీ అర్ధరాత్రి 12:30 గంటలకు న్యూఢిల్లీ నుంచి ఎయిర్ ఇండియా విమానంలో సీఎం రేవంత్ రెడ్డి లండన్‌కు బయలుదేరనున్నారు. ఆగస్టు 20 ఉదయం 7 గంటలకు యూకే స్థానిక కాలమానం ప్రకారం లండన్ చేరుకోనున్నారు. ఆగస్టు 21న ఉదయం 10:30 గంటలకు ఆక్సఫర్డ్ యూనివర్సిటీలోని బ్లావాట్నిక స్కూల్ ఆఫ్ గవర్నమెంట్‌ను సీఎం సందర్శించనున్నారు. అనంతరం సాయంత్రం 6 గంటలకు ఫుట్‌బాల్ ప్రెజెంటేషన్ కార్యక్రమం కోసం ఎమిరేట్స్ స్టేడియాన్ని సందర్శించనున్నారు. 22న ఉదయం 10:30 గంటలకు కేంబ్రిడ్జ్ బృందంతో సీఎం రేవంత్ రెడ్డి సమావేశం కానున్నారు. ఉదయం 11:30 గంటలకు లండన్ యూనివర్సిటీ క్యాంపస్‌లోని సెనేట్ హౌస్‌ను సందర్శించ నున్నారు. సాయంత్రం 4 గంటలకు లండన్ బిజినెస్ స్కూల్‌ను సందర్శించనున్నారు. యూకే పర్యటన అనంతరం ఆగస్టు 23న సీఎం రేవంత్ రెడ్డి లండన్ నుంచి అమెరికాలోని బోస్టన్‌కు బయలుదేరి వెళతారు. అక్కడ కూడా పలు ప్రముఖ విద్యా సంస్థలను సందర్శించి సమావేశాల్లో పాల్గొననున్నారు. 24న ఉదయం 10:30 గంటలకు హార్వర్డ్ యూనివర్సిటీ క్యాంపస్‌ను సీఎం సందర్శించనున్నారు. అనంతరం సాయంత్రం 4 గంటలకు ఎంఐఐటి క్యాంపస్‌ను సందర్శిస్తారు. అదే రోజు రాత్రి 7 గంటలకు బాస్టన్ నుంచి న్యూయార్క్‌కు బయలుదేరనున్నారు. 25న ఉదయం 10:30 గంటలకు నోర్త్–ఈస్టర్న్ యూనివర్సిటీ క్యాంపస్‌ను సీఎం సందర్శించనున్నారు. సాయంత్రం 4 గంటలకు వర్జీనియా టెక యూనివర్సిటీ ప్రతినిధుల బృందంతో సమావేశం కానున్నారు. 26న న్యూయార్క్‌లో ఇండియన్ ఓవర్సీస్ కాంగ్రెస్ ఆధ్వర్యంలో నిర్వహించే 'మీట్ అండ్ గ్రీట్' కార్యక్రమంలో సీఎం రేవంత్ రెడ్డి పాల్గొననున్నారు. ఈ కార్యక్రమంలో ప్రవాస భారతీయులు, వివిధ వర్గాల ప్రతినిధులతో ఆయన సమావేశమయ్యే అవకాశం ఉంది. అమెరికా పర్యటన ముగించుకుని ఆగస్టు 29న న్యూయార్క్ నుంచి సీఎం రేవంత్ రెడ్డి హైదరాబాద్‌కు తిరుగు ప్రయాణం కానున్నారు. 30న హైదరాబాద్ చేరుకోనున్నారు. మొత్తంగా సీఎం రేవంత్ రెడ్డి విదేశీ పర్యటనలో యూకే, అమెరికాలోని ప్రముఖ విశ్వవిద్యాలయాలు, విద్యా సంస్థలు, బిజినెస్ స్కూళ్లను సందర్శించడంతో పాటు పలు ప్రతినిధి బృందాలతో సమావేశాలు నిర్వహించనున్నారు. ఈ పర్యటన ద్వారా విద్య, పరిశ్రమలు, పెట్టుబడులు, అంతర్జాతీయ భాగస్వామ్యాలకు సంబంధించిన అంశాలపై చర్చలకు అవకాశం ఉండనుంది.

## తాగునీటికే తొలి ప్రాధాన్యం

మంగళవారం జలసౌధలో రాష్ట్రంలోని జలాశయాల నీటిమట్టాలు, ప్రవాహాలు, మిగిలిన ఖరీఫ్ సీజన్‌కు సాగునీటి అవకాశాలపై మంత్రి ఉన్నత స్థాయి సమీక్ష నిర్వహించారు. రాబోయే సెప్టెంబర్, అక్టోబర్ నెలల్లో భారీగా వర్షాలు కురుస్తాయని, ఎగువ నుంచి పెద్దఎత్తున వరదలు వస్తాయని ముందుగానే ఊహించుకొని నీటి నిర్వహణ ప్రణాళికలు రూపొందించడం సమంజసం కాదన్నారు. ప్రస్తుతం చేతిలో ఉన్న నీరే ప్రామాణికం కావాలి... నమ్మదగిన ప్రవాహాలే అంచనాలకు ఆధారం కావాలి... వర్షపాతంపై శాస్త్రీయ విశ్లేషణెళి నిర్ణయాలకు దిక్సూచి కావాలి అని స్పష్టం చేశారు. మన విధానం సమతుల్యంగా, వివేకవంతంగా ఉండాలి. ప్రజల తాగునీటి అవసరాలను ఎట్టి పరిస్థితుల్లోనూ ప్రమాదంలోకి నెట్టకూడదు. అదే సమయంలో తాగునీటి అవసరాలకు మించి అందుబాటులో ఉన్న నీరు జలాశయాల్లో ఉన్నప్పుడు పంటలు ఎండిపోతుంటే చూస్తూ ఉండకూడదు. ప్రతి నీటి విడుదల నిర్ణయం వాస్తవంగా వినియోగించగల నిల్వలు, నమ్మదగిన ప్రవాహాలు, వాస్తవిక వర్షపాత అంచనాల ఆధారంగానే జరగాలని ఉత్తమ్ కుమార్ రెడ్డి స్పష్టం చేశారు. , ృష్ణా పరీవాహక ప్రాంతంలోని ప్రధాన జలాశయాల్లో మొత్తం 973.68 టీఎంసీల సామర్థ్యానికి గాను 746.12 టీఎంసీల నీరు ఉండి, 76.63 శాతం నిల్వలు నమోదయ్యాయని సమీక్షలో వెల్లడైంది. గోదావరి బేసిన్‌లో 306.20 టీఎంసీల సామర్థ్యానికి 208.38 టీఎంసీలు, అంటే 68.1 శాతం నీరు అందుబాటులో ఉందని అధికారులు వివరించారు. కృష్ణా నదిపై తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాలకు ఉమ్మడి ప్రాజెక్టుగా ఉన్న నాగార్జునసాగర్‌లో ప్రస్తుతం సుమారు 164 టీఎంసీల నీటి నిల్వ ఉందని అధికారులు మంత్రికి వివరించారు. ప్రాజెక్టు స్థూల సామర్థ్యం సుమారు 312 టీఎంసీలు కాగా, ఇంకా దాదాపు 47 శాతం మేర వరద జలాలను స్వీకరించే అవకాశం ఉందని తెలిపారు. నాగార్జునసాగర్ ఎడమ కాలువ కింద నల్లగొండ, సూర్యాపేట, ఖమ్మం జిల్లాల్లో 6.4 లక్షల ఎకరాలకు పైగా ఆయకట్టు ఉన్న నేపథ్యంలో సాగునీటి అవసరాలను అత్యంత జాగ్రత్తగా అంచనా వేయాలని మంత్రి సూచించారు. అయితే జలాశయాల్లో కనిపించే స్థూల నిల్వ శాతాలను మాత్రమే చూపించి పరిస్థితి ఎంతో ఆశాజనకంగా ఉందన్న భావన కలిగించవద్దని అధికారులను మంత్రి హెచ్చరించారు. స్థూల సామర్థ్యం ఎంత లైవ్ స్టోరేజ్ ఎంత వాస్తవంగా వినియోగించగల నీరు ఎంత ఇప్పటికే కేటాయించిన అవసరాలు ఎంత వాటన్నింటినీ మినహాయించిన తర్వాత సాగునీటికి మిగిలేది ఎంత అన్న వివరాలు ప్రతి నివేదికలో స్పష్టంగా ఉండాలని ఆదేశించారు. 2025, 2026 సంవత్సరాల నిల్వలు, ప్రవాహాలను తులనాత్మకంగా అధ్యయనం చేసి నిర్ణయాలు తీసుకోవాలని సూచించారు. , ఁగిలిన ఖరీఫ్ కాలంలో ప్రభుత్వం ముందున్న లక్ష్యం స్పష్టమని మంత్రి పేర్కొన్నారు. నమ్మదగిన ప్రతి నీటి వనరును సద్వినియోగం చేసుకొని నిలువునా ఉన్న పంటలను కాపాడాలని, ప్రవాహాలపై అనిశ్చితి ఉన్న జలాశయాల్లో నీటిని జాగ్రత్తగా సంరక్షించాలని, రైతులకు వాస్తవ పరిస్థితులను ఎప్పటికప్పుడు పారదర్శకంగా తెలియజేయాలని ఆదేశించారు. వైరా రిజర్వాయర్ పరిస్థితిని ప్రత్యేకంగా సమీక్షించిన ఉత్తమ్ కుమార్ రెడ్డి, గోదావరి జలాలతో తిరిగి నింపుకునే అవకాశం ఉన్నప్పుడు సాగునీటి విడుదలలో జాప్యం ఎందుకు జరుగుతోందని అధికారులను ప్రశ్నించారు.

## పొంగులేటి వెంటనే రాజీనామా చేయాలి

న్యాయబద్ధంగా, కష్టార్జితంతో సంపాదించిన భూములు నిషేధిత జాబితాలో ఉంటే ఫోన్ చేయాలంటూ ప్రభుత్వం టోల్ ఫ్రీ నెంబర్ ఇచ్చిందని, అయితే ఆ టోల్ ఫ్రీ నెంబర్ పనిచేయడం లేదని హరీశ్‌రావు చెప్పారు. ప్రభుత్వం ఇచ్చిన టోల్ ఫ్రీ నంబర్ పని చేయకపోయినా మా జనతా గ్యారేజ్ అంటే తెలంగాణ భవన్ తలుపులు మీకోసం ఎప్పుడూ తెరిచే ఉంటాయని హరీశ్‌రావు అన్నారు. మూసిపరివాహక ప్రాంతంలోని ఇండ్లను హైడ్రా కూలగొట్టే ప్రయత్నం చేసినప్పుడు జనతా గ్యారేజ్ తలుపు తట్టారని, అప్పుడు వాళ్లకు న్యాయం చేశామని అన్నారు. అదేవిధంగా నిషేధిత జాబితాలో ఉన్న ఇళ్ల విషయంలో కూడా ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని అన్నారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిపై హరీశ్ రావు మరోసారి తీవ్ర స్థాయిలో విరుచుకుపడ్డారు. మంగళవారం మీడియాతో మాట్లాడుతూ.. రేవంత్ రెడ్డి తుగ్లక నిర్ణయాలతో రాష్ట్ర పాలన పిచ్చోడి చేతిలో రాయిలా మారిందని వ్యాఖ్యానించారు. రాత్రికి రాత్రే కాలనీల్లో ప్రభుత్వం అమ్మిన భూములు, హెచ్ఎండీఏ అమ్మిన భూములను కూడా నిషేధిత జాబితాలో పెట్టారని మండిపడ్డారు. 'మీరు చేసిన తప్పులకి ప్రజలకు ఎందుకు శిక్ష అని అన్నారు. మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి.. హైదరాబాద్, రంగారెడ్డి జిల్లాలు నా చేతిలోకి రావాలని ఈ నిర్ణయం తీసుకున్నారు. అధికారులు తప్పు చేశారు.. సారీ అని పొంగులేటి చెప్తే సరిపోతుందా ఇది 30 శాతం గవర్నమెంట్... ఏ పని కావాలన్నా 30శాతం కమిషన్ అడుగుతున్నారని అంటూ విరుచుకుపడ్డారు. రేవంత్ రెడ్డి ఇల్లు నిషేధిత జాబితాలో ఉందని.. మరి సీఎం ఎక్కడ మీసేవకు వెళ్లి దరఖాస్తు చేసుకున్నారో చెప్పాలని మాజీ మంత్రి డిమాండ్ చేశారు. నిషేధిత భూములతో పాటు ప్రభుత్వ భూములు, అసైన్మెంట్ భూములను కాజేసే కుట్ర జరుగుతోందని ఆరోపించారు. నిషేధిత జాబితాల నుంచి తొలగించిన భూముల లిస్టును పబ్లిక డొమైన్‌లో పెట్టాలన్నారు. సీఎం రేవంత్ రెడ్డి, పొంగులేటి కలిసి కుట్ర చేస్తున్నారని.. తప్పు వారు చేసి అధికారులపై నెడుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. అధికారులూ జాగ్రత్త.. మీరు తప్పు చేస్తే రేపు మీరే బలవుతారు. మీ కమిషన్ల కోసం పెన్ను పోటుతో ప్రజల జీవితాలను బలి చేయొద్దు. రేపు ఎప్పుడు అసెంబ్లీ పెట్టినా నిషేధిత భూములపై ప్రభుత్వాన్ని బీఆర్ఎస్ నిలదీస్తుంది.. ప్రజలకు అండగా ఉంటుంది. ప్రజల ఆస్తులపై మీ ఇష్టం వచ్చినట్లు వ్యవహరిస్తామంటే పాతర వేస్తారు. ప్రభుత్వ టోల్ ఫ్రీ నంబర్ పనిచేయట్లేదు... మీ జనతా గ్యారేజ్ తెలంగాణ భవన్ ఎప్పుడూ మీకోసం తెరిచే ఉంటుంది' అని హరీశ్ రావు పేర్కొన్నారు.

# తెలంగాణలో సెక్షన్ 22-ఏ సెగ

మొదటి పేజీ తరువాయి...

ఫిర్యాదులు వచ్చాయి. మరి గతంలోనూ ఉన్న వ్యవస్థపై ఇప్పుడు ఇంతగా రాజకీయ చర్చ ఎందుకు? ప్రస్తుత ప్రభుత్వం అమలులో ఏం మార్పు చేసింది? అన్నదే అసలు ప్రశ్న.

**ఇప్పుడు ఎందుకు హైలైట్?**

2023 డిసెంబర్ తర్వాత 22–ఏ జాబితాలో చేర్చిన భూములపై శ్వేతపత్రం విడుదల చేయాలని హరీశ్‌రావు డిమాండ్ చేస్తున్నారు. ప్రైవేట్ ఆస్తుల యజమానులు ఇబ్బందులు పడుతున్నారన్నది ఆయన వాదన. అంటే 22–ఏ నిబంధనపై కాకుండా.. ప్రస్తుత జాబితా తయారీ, అమలు తీరుపైనే ఆయన ప్రధానంగా ప్రశ్నలు సంధిస్తున్నారు. అదే సమయంలో గత పాలనలో జరిగిన ప్రక్రియకు సంబంధించిన వివరాలు కూడా బయటకు రావాల్సిన అవసరం ఉంది.

**30 శాతం కమిషన్ ఆరోపణ**

22–ఏ నుంచి భూములను తొలగించేందుకు 30 శాతం వరకు కమిషన్ అడుగుతున్నారంటూ హరీశ్‌రావు ఆరోపించారు.

ఇది తీవ్రమైన అభియోగం. అయితే దీనిని నిర్ధారిత అవినీతిగా పేర్కొనడానికి ఆధారాలు లేవు. అందువల్ల ఆరోపణలపై ప్రభుత్వం, సంబంధిత అధికారులు వాస్తవాలను స్పష్టం చేయాల్సి ఉంటుంది.

**సీఎం భరోసా.. చర్యలు**

వివాదం వేడెక్కుతున్న వేళ సీఎం రేవంత్‌రెడ్డి రెవెన్యూ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి, ఉన్నతాధికారులతో సమీక్ష నిర్వహించారు. ఆస్తి హక్కుల పరిరక్షణకు ప్రభుత్వం కట్టుబడి ఉందని స్పష్టం చేశారు. రిజిస్ట్రేషన్ కోసం ఆన్‌లైన్‌లో స్లాట్ తీసుకున్న వ్యక్తి భూమి 22–ఏలో ఉంటే.. రెవెన్యూ అధికారులు రెండు రోజుల్లో పరిశీలించాలని, అది ప్రైవేట్ భూమి అని తేలితే వెంటనే రిజిస్ట్రేషన్ చేయాలని ఆదేశించారు.

**శాశ్వత పరిష్కారానికి కసరత్తు**

22–ఏ జాబితాలో ఉన్న భూములను జిల్లా కలెక్టర్లు క్షుణ్ణంగా పరిశీలించి.. తప్పులు లేకుండా సరైన జాబితాను రూపొందించాలని సీఎం ఆదేశించారు. భవిష్యత్తులో ఇలాంటి సమస్యలు తలెత్తకుండా శాశ్వత పరిష్కారం దిశగా ప్రక్రియను వేగంగా పూర్తి చేయాలని సూచించారు. ప్రైవేట్ భూముల్లో ఒక్క అంగుళానికీ ఇబ్బంది రానివ్వబోమని ప్రభుత్వం స్పష్టం చేసింది.

**దళారులను నమ్మొద్దు**

22–ఏ భూముల విషయంలో దళారులు, మధ్యవర్తులను ఆశ్రయించవద్దని ప్రభుత్వం ప్రజలకు సూచించింది. పుకార్లు, కట్టుకథలను నమ్మకుండా అధికారిక మార్గాల్లోనే సమస్యలను పరిష్కరించుకోవాలని కోరింది. దీంతో ఒకవైపు ప్రతిపక్ష ఆరోపణలు.. మరోవైపు ప్రభుత్వం చేపడుతున్న చర్యలు.. రెండింటి మధ్య అసలు వాస్తవం ఏంటన్నది కీలకంగా మారింది.

**గతం.. వర్తమానం.. వాస్తవం**

బీఆర్ఎస్ హయాంలోనూ ఉన్న 22–ఏ వ్యవస్థపై ఇప్పుడు రాజకీయ రగడ కొనసాగుతోంది. గతంలో ఎన్ని భూములు జాబితాలో చేరాయి? ప్రస్తుత పాలనలో ఎన్ని చేర్చారు? ఎన్ని తొలగించారు? పొరపాటున నమోదైన ప్రైవేట్ ఆస్తులు ఎన్నున్నాయి? అన్న పూర్తి వివరాలు ప్రజల ముందుకు వస్తేనే వివాదానికి శాశ్వత పరిష్కారం దొరుకుతుంది.

22–ఏ నిబంధన ఉద్దేశం అక్రమాలను అడ్డుకోవడమే.. ప్రైవేట్ భూముల హక్కులను అడ్డుకోవడం కాదు. ఆరోపణలు, ప్రత్యారోపణలతో సమస్య మరింత రాజకీయమవుతుంది. అందుకే గతం నుంచి వర్తమానం వరకు పూర్తి లెక్కలు బయటపెట్టి.. అర్హమైన ప్రైవేట్ భూములకు వేగంగా రిజిస్ట్రేషన్ జరిగేలా చూడటమే ప్రజలకు కావాల్సిన పరిష్కారం. భూ హక్కుల విషయంలో రాజకీయ రగడ కాదు.. స్పష్టమైన రికార్డులే అసలైన భరోసా.

# పేదలకు భూమి పంపిణీ అత్యావశ్యకం

**హైదరాబాద్,ఆగస్ట్18 (సింగిడి):** తాము అధికారంలోకి వస్తే 'భూలక్ష్మి ' పేరుతో పేదలకు భూమి పంపిణీ చేస్తామని తెలంగాణ రక్షణ సేన అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత ప్రకటించారు. పేదల భూములను రేవంత్‌రెడ్డి లాక్కుంటే.. చూస్తు ఊరుకోమని హెచ్చరించారు. మంగళవారం హైదరాబాద్‌లోని బంజారాహిల్స్.. టీఆర్ఎస్ కార్యాలయంలో కవిత మీడియాతో మాట్లాడారు. బీసీలకు పెద్దపీట వేస్తామని చెప్పినా.. ఆచరణలో మాత్రం సామాజిక న్యాయం ఎందుకు కనిపించడం లేదని ప్రశ్నించారు. తెలంగాణ రక్షణ సేన అధికారంలోకి వస్తే రాష్ట్రంలోని భూమిలేని పేదలకు ఎకరం చొప్పున భూమి ఇచ్చేలా 'భూ లక్ష్మి పథకం' అమలు చేస్తామని ఆ పార్టీ అధినేత్రి కవిత ప్రకటించారు. రాష్ట్రంలో భూమి పంపిణీ అవసరం ఉందన్నారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి భూమి కేవలం లావాదేవీల అంశంగా కనిపించవచ్చని, అయితే పేద బీసీ, ఎస్సీ, ఎస్టీ మహిళలకు భూమి, అడవి జీవనాధారమని కవిత వ్యాఖ్యానించారు. రాష్ట్రంలో ఏ ప్రాజెక్టు చేపట్టినా ముందుగా అసైన్డ్ భూములనే తీసుకుంటున్నారని ఆరోపించారు. రాష్ట్రంలో సుమారు 30 వేల ఎకరాల అసైన్డ్ భూములను ప్రభుత్వం తీసుకుందని కవిత ఆరోపించారు. ముఖ్యమంత్రికి చిత్తశుద్ధి ఉంటే ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీ మేరకు పేదలకు అసైన్డ్ భూములపై యాజమాన్య హక్కులు కల్పించాలని డిమాండ్ చేశారు. రేవంత్‌రెడ్డి సోదరులపై కూడా కవిత తీవ్ర ఆరోపణలు చేశారు. వారి ఆధ్వర్యంలో భూ దోపిడీ జరుగుతోందని ఆరోపిస్తూ.. రాష్ట్రంలో రేవంత్‌రెడ్డి పాలనను తీవ్రంగా విమర్శించారు. రేవంత్‌రెడ్డి, భట్టి విక్రమార్క కుటుంబ సభ్యుల ప్రభావం ప్రభుత్వంలో కొనసాగుతోందని ఆమె ఆరోపించారు. సామాజిక న్యాయం గురించి మాట్లాడుతున్న రేవంత్‌రెడ్డి.. గత 31 నెలల్లో ఆ అంశాన్ని ఎందుకు పట్టించుకోలేదని కవిత ప్రశ్నించారు. సామాజిక న్యాయం గురించి మాట్లాడే ముందు కేబినెట్‌లో ఎస్సీ, ఎస్టీ, బీసీలకు తగిన ప్రాతినిధ్యం కల్పించాలని అన్నారు. ప్రభుత్వ సలహాదారుల నియామకాల్లోనూ బడుగు, బలహీన వర్గాలకు అన్యాయం జరుగుతోందని ఆరోపించారు. ఒకే రోజు శివధర్‌రెడ్డి, వీహెచ్‌లను సలహాదారులుగా నియమిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు ఇచ్చిందని, అయితే ఇద్దరి వేతనాల్లో తేడా ఎందుకు ఉందని ప్రశ్నించారు. ఆర్టీఐ కమిషన్‌లో ఒక్క బీసీకి కూడా అవకాశం కల్పించలేదని కవిత ఆరోపించారు. ప్రభుత్వ నియామకాల్లో సామాజిక న్యాయం పాటించడం లేదని విమర్శించారు. కాంగ్రెస్ పార్టీలో అగ్రవర్ణాలకు ఒక న్యాయం, పేదలకు మరో న్యాయం కొనసాగుతోందని ఆరోపించారు. రాష్ట్ర ప్రభుత్వ విధానాలపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని కవిత సూచించారు.విజయశాంతి లాంటి ఉద్యమకారులను పక్కన పెట్టి.. మంత్రి పదవి ఇవ్వకుండా ఎమ్మెల్సీ పదవితో సరిపెట్టారని విమర్శించారు. రేవంత్‌రెడ్డి చెప్పేది సామాజిక న్యాయం.. కానీ ఆచరణలో మాత్రం అటవికా న్యాయమని విమర్శించారు. అప్పర్ క్లాస్ మాట్లాడితే ఒక రకమైన చర్యలు.. లో క్లాస్ మాట్లాడితే మరో రకమైన చర్యలు తీసుకుంటారా ఇదేనా రేవంత్‌రెడ్డి సామాజిక న్యాయం అని ప్రశ్నల వర్షం కురిపించారు. తెలంగాణలో రేవంత్ రాక్షస పాలన సాగుతోందని విమర్శించారు.

## ఆత్మగౌరవం కోసం పోరాటం

ఈ కార్యక్రమంలో డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, పీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్ గౌడ్, పలువురు మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎంపీలు, బీసీ సంఘాల నాయకులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా సీఎం రేవంత్‌రెడ్డి మాట్లాడుతూ.. సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ ఆత్మగౌరవం, సామాజిక న్యాయం కోసం పోరాడిన గొప్ప యోధుడని కొనియాడారు. అమరవీరుల స్థూపానికి ఎంత ప్రాధాన్యం ఉంటుందో పాపన్న విగ్రహానికి కూడా అంతే ప్రాధాన్యం ఉండాలని అన్నారు. బీసీ నేతల విజ్ఞప్తి మేరకు నెక్లెస్ రోడ్డుపై పాపన్న విగ్రహాన్ని ఏర్పాటు చేయాలని నిర్ణయించినట్లు తెలిపారు. చరిత్రను చెప్పుకోవడంలో మనం వెనుకబడ్డా మని అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వంపై బీఆర్ఎస్ దుష్ప్రచారం చేస్తోందని మండిపడ్డారు. అక్రమ సంపాదనతో సోషల్ మీడియాలో దుష్ప్రచారం చేస్తున్నారంటూ బీఆర్ఎస్ పార్టీపై విరుచుకుపడ్డారు. 2029లో అధికారంలోకి వచ్చేది కాంగ్రెస్ ప్రభుత్వమే అని సీఎం రేవంత్ జోస్యం చెప్పారు. తలరాతలు మారాలంటే చదువు ఒక్కటే మార్గమని సీఎం రేవంత్ స్పష్టం చేశారు. డీలిమిటేషన్ జరిగితే 117 సీట్లతో అధికారంలోకి వస్తామని విశ్వాసం వ్యక్తం చేశారు. కేసీఆర్ సీఎం అయితే.. ఆయన కుమారుడు వర్కింగ్ ప్రెసిడెంట్ అయ్యారని గుర్తు చేశారు. కానీ రేవంత్ ముఖ్యమంత్రి అయితే.. మహేష్ కుమార్ గౌడ్ పీసీసీ చీఫ్ అయ్యారని.. అలాగే కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తే సీతక్క, వాకిటి శ్రీహరి మంత్రులయ్యారని సోదాహరణంగా వివరించారు. కాంగ్రెస్ ప్రభుత్వం కొలువుదీరిన తర్వాత ఉద్యమకారులకు కీలక పదవులు ఇచ్చామని గుర్తు చేశారు. శ్రీకాంతచారి తల్లి శంకరమ్మ, చాకలి ఐలమ్మ మనవరాలికి పదవులిచ్చామని పేర్కొన్నారు. అయితే కేసీఆర్ మాత్రం ఎర్రబెల్లి, వినోద్‌రావుకు పదవులిచ్చారని వ్యంగ్యంగా అన్నారు. కేసీఆర్ సీఎం అయితే.. వారి కుటుంబ సభ్యులకు ఫామ్‌హౌజ్‌లు వచ్చాయని ఎద్దేవా చేశారు. అదే కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక పేదలకు ఇందిరమ్మ ఇళ్లు వస్తున్నాయని వివరించారు. దిశ బాగుంటుందని కేసీఆర్ కొత్త సచివాలయం కట్టుకున్నారని తెలిపారు. కానీ కేసీఆర్ దిశ, దశ బాగా లేదు.. అందుకే తాను, భట్టి సచివాలయంలో ఉన్నామని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చెప్పారు. బీసీల లెక్కలు తేల్చిన తొలి ప్రభుత్వం మాదేనని అన్నారు. కేసీఆర్ చేసిన రూ.8 లక్షల కోట్ల అప్పు తెలంగాణ పాలిట ముప్పుగా మారిందని ఆందోళన వ్యక్తం చేశారు. వడ్డీలు కట్టగా మిగిలిన డబ్బుతోనే సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నామని సీఎం రేవంత్ రెడ్డి వివరించారు. గీత కార్మికుల వృత్తిని కాపాడే బాధ్యత తమ ప్రభుత్వానిదేనని రేవంత్‌రెడ్డి తెలిపారు. అర్హత ఉన్న గీత కార్మికులకు పెన్షన్లు అందించేలా ఆదేశాలు ఇచ్చామని చెప్పారు. ఇరిగేషన్ కాల్వలపై ఈత, తాటి చెట్లను పెంచే చర్యలు చేపడతామని వెల్లడించారు. అలాగే గౌడ సామాజికవర్గం సహకారంతో వచ్చే ఎన్నికల్లో కాంగ్రెస్ మరోసారి అధికారంలోకి వస్తుందని సీఎం ధీమా వ్యక్తం చేశారు. పీసీసీ అధ్యక్షుడిగా మహేశ్‌కుమార్ గౌడ్‌తో కలిసి పనిచేస్తున్నామని, తమ కాంబినేషన్‌లో 2029లోనూ ప్రభుత్వాన్ని ఏర్పాటు చేస్తామని అన్నారు. ఇందిరమ్మ పాలనలో తెలంగాణ బహుజనుల తెలంగాణగా మారుతుందని సీఎం అన్నారు.

## బిజెపి జేబుసంస్థగా కేంద్ర ఎన్నికల సంఘం

**హైదరాబాద్,ఆగస్ట్18 (సింగిడి):**

2014లో కొలువుదీరిన నాటి నుంచి రాజ్యాంగ సంస్థలను నిర్వీర్యం చేస్తుందంటూ కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వంపై తెలంగాణ పీసీసీ చీఫ్ మహేష్ కుమార్ గౌడ్ మండిపడ్డారు. ఎన్నికల కమిషన్ కూడా బీజేపీకి అనుబంధ సంస్థగా మారిందని విమర్శించారు. కేంద్ర ప్రభుత్వం సీబీఐ, ఈడీ తరహాలో ఎన్నికల సంఘాన్ని కూడా తనకు అనుకూలంగా మార్చుకుందని ఆయన తీవ్ర ఆరోపణలు చేశారు.తెలంగాణలో ఎస్ఐఆర్‌కు ఇంకా సమయం ఇవ్వాలని ఈసీని డిమాండ్ చేశారు. అర్హులైన అందరికీ ఓటు హక్కు కల్పించాలని ఈసీని తెలంగాణ పీసీసీ చీఫ్ డిమాండ్ చేశారు.ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ పేరుతో తెలంగాణలో ఎన్నికల సంఘం నిర్దాక్షిణ్యంగా ఓట్లను తొలగించిందని టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్ గౌడ్ ఆరోపించారు. ఓటర్ల ముసాయిదా జాబితాను రాష్ట్ర ఎన్నికల సంఘం విడుదల చేసిన నేపథ్యంలో గాంధీభవన్‌లో నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. తాము ప్రతి ఓటు హక్కు కాపాడాలని చూస్తున్నామని అన్నారు. ఎన్నికల సంఘం గైడ్‌లైన్స్‌తో చాలా నష్టం జరుగుతుందని ఆందోళన వ్యక్తం చేశారు. ఈసీ ఉదాసీనంగా చూడటం కరెక్ట కాదని అభిప్రాయపడ్డారు. తెలంగాణ 3.38 కోట్ల ఓట్లు ఉన్నాయని గుర్తు చేశారు. ఎఎస్‌బీడీల పేరుతో 22 శాతం ఓట్లు తొలగించారని చెప్పారు. ఓట్ల తొలగింపునకు ప్రధాని మోదీతోపాటు కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్ షా బాధ్యత వహించాలని అన్నారు. పేద ప్రజల ఓట్లు తొలగిపోతున్నాయని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. కాంగ్రెస్ పార్టీ బీఎల్ఏలను 35 వేల మందిని నియమించిందని తెలిపారు. కానీ ఈసీ మాత్రం13,100 మందిని ఇచ్చినట్లు చూపిస్తుందని చెప్పారు. సామాన్యుడి ఓటు తొలగించే ప్రయత్నం చేస్తున్నారంటూ ఈ సందర్భంగా ఈసీపై నిప్పులు చెరిగారు. 2002లో ఓటు వేసి ఉండాలని కండిషన్‌తో చాలా మంది ఎనుమరేషన్ ఫామ్స్ ఇవ్వలేక పోయారని చెప్పుకొచ్చారు. దీంతో వారిని కూడా ఓటర్ల జాబితా నుంచి తొలగిస్తున్నారని వివరించారు. అన్ మ్యాపుడ్ ఓట్లు 32,37000 ఉన్నాయని అన్నారు. అలాగే 60,50,000 ఓట్లు సందేహంగా ఉన్నాయని చూపిస్తున్నారని పేర్కొన్నారు. దాంతో 92 లక్షల ఓట్లు ప్రశ్నార్థకంగా మారాయని ఆవేదనతో అన్నారు. 1.60 కోట్ల ఓట్లు ఎందుకు క్వచ్చన్ మార్క్ పెట్టారో చెప్పాలంటూ ఈసీని తెలంగాణ పీసీసీ చీఫ్ డిమాండ్ చేశారు. దేశంలో ఓటు హక్కును తొలగించే అధికారం మీకు ఎవరు ఇచ్చారంటూ ఈసీని ఆయన సూటిగా ప్రశ్నించారు.

## పెట్టుబడిదారులకు స్వర్గధామం తెలంగాణ

**హైదరాబాద్,ఆగస్ట్18 (సింగిడి):**

తెలంగాణ రాష్ట్రం అన్ని రకాల పెట్టుబడిదారులను ప్రోత్సహించే స్వర్గధామమని, క్లీన్ ఎనర్జీ రంగానికి నిలయంగా రాష్ట్రాన్ని తీర్చిదిద్దడమే తమ ప్రభుత్వ ధ్యేయమని ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క ప్రకటించారు. హైదరాబాద్‌లోని హైటెక్స్, నోవాటెల్ లో రెండు రోజుల పాటు జరగనున్న 'ఇండియా ఎనర్జీ సమ్మిట్ / ఎక్స్‌పో 2026'ను మంగళవారం ఆయన ప్రారంభించారు. ఈ సమ్మిట్‌కు విచ్చేసిన పారిశ్రామికవేత్తలు, పెట్టుబడిదారులు, ఆవిష్కర్తలు మరియు సాంకేతిక నిపుణులను ఉద్దేశించి డిప్యూటీ సీఎం ప్రసంగించారు. పెట్టుబడిదారులు, ఆవిష్కర్తలు, శాస్త్రవేత్తలు, సీఈఓలు... మీ అందరినీ ఆహ్వానిస్తున్నాను, రండి. తెలంగాణ అన్ని రకాల పెట్టుబడిదారులను ప్రోత్సహించే రాష్ట్రం, ఇది పెట్టుబడిదారులకు ఒక స్వర్గధామం. మన సమృద్ధిని పంచుకోవ డానికి మరియు కలిసి ఎదగ డానికి మిమ్మల్ని పూర్ణహృదయంతో ఆహ్వానించడానికి ఈ రాష్ట్రం సిద్ధంగా ఉంది' అని భట్టి విక్రమార్క పిలుపునిచ్చారు. ఇంధన రంగంలో మార్పు అనేది కేవలం విద్యుత్ ఉత్పత్తి మూలాన్ని మార్చడం మాత్రమే కాదని, అది సమగ్ర ఆర్థిక వ్యవస్థ నిర్మాణాన్నే మార్చే విప్లవాత్మక పక్రియ అని ఆయన వ్యాఖ్యానించారు. తెలంగాణను కేవలం స్వచ్ఛమైన ఇంధనాన్ని వినియోగించే రాష్ట్రంగా మాత్రమే కాకుండా, ప్రపంచ క్లీన్ ఎనర్జీ రంగానికి అవసరమైన సాంకేతికతలను తయారు చేసే ప్రధాన కేంద్రంగా నిలపాలని ఆకాంక్షించారు. రాష్ట్రంలో వేగంగా పెరుగుతున్న విద్యుత్ డిమాండ్‌ను తట్టుకుంటూనే, పర్యావరణ పరిరక్షణను సాధించేలా ప్రణాళికలు రూపొందించామని డిప్యూటీ సీఎం వివరించారు. ఇందులో భాగంగా 2030 నాటికి 20,000 మెగావాట్లు, 2035 నాటికి 26,000 మెగావాట్లకు పైగా సోలార్ విద్యుత్ సామర్థ్యాన్ని పెంచనున్నట్లు తెలిపారు. అలాగే పునరుత్పాదక ఇంధనానికి అత్యంత కీలకమైన 'విద్యుత్ నిల్వ' సామర్థ్యాన్ని కూడా భారీగా విస్తరిస్తున్నామని చెప్పారు. బ్యాటరీ ఎనర్జీ స్టోరేజ్, పంప్డ్ స్టోరేజ్ ప్రాజెక్టుల ద్వారా 2030 నాటికి 3,800 మెగావాట్లు, 2035 నాటికి 8,000 మెగావాట్ల నిల్వ వ్యవస్థను అందుబాటులోకి తెస్తామన్నారు. హైదరాబాద్‌లోని ఐటీ, ఎఐ నైపుణ్యాలను ఉపయోగించి భవిష్యత్తు విద్యుత్ గ్రిడ్‌ను డిజిటల్ నెట్‌వర్క్‌గా మారుస్తున్నామని ఆయన పేర్కొన్నారు.

## ఉరిశిక్షను రద్దు చేయండి

**ఇతర సులువైన మరణాలను ప్రసాదించండి**

**సుప్రీంలో దాఖలైన పిటిషన్ కొట్టివేత**

**న్యూఢిల్లీ,ఆగస్ట్18 (సింగిడి):**

మరణశిక్ష పడిన దోషులను ఉరిశిక్ష నుంచి తప్పించి, సులువుగా మరణించే ప్రక్రియను చేపట్టాలని కోరుతూ దాఖలైన పిల్‌ను సుప్రీంకోర్టు తిరస్కరించింది. భారతీయ శిక్షా స్మృతిలో భాగంగా కొన్ని కేసుల్లో ఉరి తీస్తున్న విషయం తెలిసిందే. అయితే ఉరి వేసి దోషిని చంపే ప్రయత్నాలను ఆపేయాలని కోరుతూ సుప్రీంకోర్టులో పిల్ దాఖలైంది. ఉరికి బదులుగా, మరేదైనా నొప్పిలేని విధానాన్ని అమలు చేయాలని కోరుతూ దాఖలైన పిల్‌ను సుప్రీంకోర్టు కొట్టిపారేసింది. జస్టిస్ విక్రమ్ నాథ్, సందీప్ మెహతాతో కూడిన ధర్మాసనం ఈ తీర్పును ఇచ్చింది. కాలం చెల్లిన ఉరి విధానాన్ని బహిష్కరించి, దాని స్థానంలో నొప్పి లేకుండా మరణశిక్షను అమలు చేసే విధానాన్ని ప్రవేశపెట్టాలని కోరుతూ సుప్రీంలో పిటిషన్ దాఖలైంది. అయితే ఆ పిటీషన్‌ను అత్యున్నత న్యాయస్థానం తిరస్కరించింది. ఇక ఈ కేసులో ఇదే తుది తీర్పు కాదని, భవిష్యత్తులో ఈ అంశాన్ని మళ్లీ ప్రస్తావించవచ్చు అని, ఒకవేళ ప్రత్యామ్నాయ మరణాలపై ఏవైనా శాస్త్రీయ ఆధారాలు ఉంటే, దాని ప్రకారం మరణశిక్షను అమలు చేయవచ్చని కోర్టు తన తీర్పులో అభిప్రాయపడింది. ప్రస్తుతం రిట్ పిటీషన్‌ను డిస్మిస్ చేస్తున్నామని, కానీ భవిష్యత్తులో రాజ్యాంగం ధర్మాసనం ఈ విధానంపై సమీక్ష నిర్వహించే అవకాశం ఉంటుందని కోర్టు తెలిపింది. శాస్త్రీయ విధానాల్లో మరణశిక్షను అమలు చేసే అంశంలో కేంద్ర ప్రభుత్వం తన నిర్ణయాన్ని స్వేచ్ఛగా తీసుకోవచ్చని కోర్టు అభిప్రాయపడింది. సీనియర్ న్యాయవాది రిషి మల్హోత్రా 2017లో ఈ పిల్ దాఖలు చేశారు. సీఆర్పీసీలోని సెక్షన్ 354(5) కింద ఉరి ద్వారా మరణశిక్షను అమలు చేసే వారు. అయితే ఆ సెక్షన్‌ను సవాల్ చేస్తూ కోర్టులో పిటీషన్ వేశారు.

## దిమాగీ నక్సల్స్.. మరో పార్టీ పుట్టుక

**ప్రధాని నోట మాటరావడం ఆలస్యం..**

**సోషల్ మీడియాలో ఉత్పన్నం**

న్యూఢిల్లీ,ఆగస్ట్18 (సింగిడి): కాక్రోచెస్ అంటూ సుప్రీం చీఫ్ జస్టిస్ చేసిన వ్యాఖ్యల ఆధారంగా కాక్రోచ్ జనతాపార్టీ పుట్టుకు వచ్చింది. ఇటీవల ఢిల్లీ జంతర్‌మంతర్ వద్ద తన సత్తా చాటింది. ఇప్పుడు ఇలాంటిదే మరో పార్టీ పుట్టుకు వచ్చింది. సాయుధ నక్సల్స్‌ను నిర్మూలించామని.. దిమాగీ నక్సల్స్ మాత్రం మిగిలారంటూ ఎర్రకోట వేదికగా ప్రధానమంత్రి నరేంద్రమోదీ ప్రకటించారు. ఈ వ్యాఖ్యల ఆధారంగా కొత్తపార్టీ పుట్టుకువచ్చింది. మోదీ ఆ వ్యాఖ్యలు చేసిన 24 గంటల్లోనే దిమాగీ నక్సల్ అనే పేరుతో ఇన్‌స్టాగ్రామ్, ఎక్స్‌లో తెరిచిన పార్టీ ఖాతాలకు అనూహ్య ఆదరణ లభించింది. ఇన్‌స్టాలో 1.81 లక్షలమంది, ఎక్స్‌లో 7000 మంది ఆ ఖాతాలను అనుసరించారు. ఇన్‌స్టాలో దిమాగి నక్సల్ జనతా పార్టీ అనే పేరుతో ఖాతాలు తెరిచారు. యువత ప్రశ్నించడమే కాదు, సమస్యలకు పరిష్కార మార్గాలను కూడా వెతకాలని ప్రధాని నరేంద్ర మోదీ ఇటీవల ఐఐటీ ఢిల్లీ యాభై ఏడవ స్నాతకోత్సవంలో చేసిన వ్యాఖ్యల సంగతి ఎలా ఉన్నా యువత ప్రశ్నిస్తూనే ఉంది. సమస్యలకు పరిష్కరాం చూపాలని ప్రధాని మోడీ అనడం చూస్తుంటే..పాలకులు ఎందుకన్న ప్రశ్న ఉదయిస్తోంది. నిజానికి సమస్యలను పరిష్కరించాల్సిన బాధ్యత ఎవరిది అధికారంలో ఉన్న పాలకులదాకాదా అన్నది తేల్చాలి.

## స్థానిక ఎన్నికల్లో బీసీ రిజర్వేషన్లు శాతం 34%

తెదేపా రాకముందు రాజకీయ అధికారం కొన్ని వర్గాలకే పరిమితమైంది. ఎన్టీఆర్ వచ్చాకే బీసీలకు ఆ అవకాశం దక్కింది. మా పార్టీలో ఎంతోమంది బీసీలు నేతలుగా ఎదిగారు. ఎర్రన్నాయుడు, యనమల రామకృష్ణుడు, కేఈ కృష్ణమూర్తి, అయ్యన్నపాత్రుడు, కళా వెంకట్రావు, దేవేందర్‌గౌడ్ ఉన్నత స్థాయికి చేరుకున్నారు. 1995లో బీసీలకు ఉన్న 20 శాతం రిజర్వేషన్లను 34 శాతానికి పెంచామన్నారు. తెదేపా పాలనలో బీసీల అభ్యున్నతికి అనేక కార్యక్రమాలు చేపట్టాం. కులవృత్తులు, చేతివృత్తులకు అండగా నిలిచాం. బీసీలకు ఆదరణ కింద 341 పరికరాలను 90 శాతం రాయితీతో ఇచ్చాం. బీసీల కోసం రూ.32 వేల కోట్లు ఖర్చు చేశాం. వడ్డెర్లకు 10 శాతం మైనింగ్ లీజులు ఇస్తున్నాం. నేతన్న సేవ కింద ప్రతి కుటుంబానికి రూ.25 వేలు అందజేస్తున్నాం. మత్స్యకారులకు ప్రతి దశలోనూ అండగా ఉంటున్నాం. 217 జీవో రద్దు చేసి మత్స్యకారులను ఆదుకున్నాం. దేవాలయాల్లో పనిచేసే నాయీ బ్రాహ్మణుల జీతాలను రూ.25వేలకు పెంచాం. బీసీలు సోలార్ ప్యానళ్లు ఏర్పాటు చేసుకుంటే రూ.95వేల రాయితీ ఇస్తున్నాం. బీసీలకు విద్య, నైపుణ్యం, ఉపాధి, వ్యాపార, రాజకీయ ప్రాతినిధ్యం ఇస్తాం. మేం తెచ్చిన బీసీ రిజర్వేషన్లు ఎవరికీ వ్యతిరేకం కాదు. రాజ్యాంగ పరిమితులు పాటిస్తూనే సామాజిక న్యాయం చేస్తున్నాం. సమాజంలో ప్రతి వర్గానికీ అవకాశం కల్పించాలనేది మా లక్ష్యం' అని చంద్రబాబు అన్నారు.

## మెట్రో ఫేజ్-2 అనుమతులకు కసరత్తు

ఈ నేపథ్యంలోనే మెట్రో ప్రాజెక్టుకు అవసరమైన ఎన్‌ఓసీలను త్వరగా జారీ చేయాలని పురపాలక శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి జయేష్ రంజన్ సంబంధిత అధికారులను కోరారు. ఈ మేరకు సచివాలయంలో కేంద్ర, రాష్ట్ర శాఖల అధికారులతో జయేష్ రంజన్ సమన్వయ సమావేశం నిర్వహించారు. జయేష్ రంజన్ అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో హెచ్ఎంఆర్ఎల్ ఎండీ, హెచ్ఎండీఏ మెట్రోపాలిటన్ కమిషనర్ సర్ఫరాజ్ అహ్మద్ పాల్గొన్నారు. కేంద్ర అనుమతుల కోసం డీపీఐఐటీ నెట్‌వర్క్ ప్లా–లానింగ్ గ్రూప్ పక్రియలో భాగంగా ఈ సమావేశం నిర్వహించారు. ఫేజ్2లో భాగంగా 7 కారిడార్ల ద్వారా మొత్తం 122.9 కిలోమీటర్ల మేర మెట్రోను విస్తరించేందుకు ప్రతిపాదనలు ఉన్నాయి.

ప్రభాతనవ సింగిడి
ప్రతి రంగూ ఓ నిజం
Singidi
బుధవారం
19-8-2026



# అభివృద్ధి పనుల్లో నిర్లక్ష్యం చేస్తే..
# ఉపేక్షించేది లేదు

- పనులు ప్రారంభించని కాంట్రాక్టర్లను బ్లాక్‌లిస్ట్‌లో పెట్టండి
- సెప్టెంబర్‌లో పోచారం, లకడారం సబ్‌స్టేషన్ల ప్రారంభం
- రూ.75 కోట్ల అభివృద్ధి పనులపై ఎమ్మెల్యే జీఎంఆర్ సమీక్ష

**పటాన్చెరు, ఆగస్టు 18 (సింగిడి):** అభివృద్ధి పనుల్లో జాప్యానికి తావు లేదని.. నిర్లక్ష్యాన్ని ఎంతమాత్రం సహించబోమని.. ప్రజలకు ఇచ్చిన ప్రతి హామీని నిర్ణీత సమయంలో పూర్తి చేయవలసిన గురుతర బాధ్యత తమపై ఉందని పటాన్చెరు ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి తెలిపారు. అభివృద్ధి పనుల విషయంలో అధికా రులు, కాంట్రాక్టర్లు పూర్తి బాధ్యతతో పనిచేయాలని, ప్రజలకు మెరుగైన మౌలిక వసతులు అందించడమే లక్ష్యంగా ముందుకు సాగాలని స్పష్టం చేశారు. మంగళవారం పటాన్చెరు డివిజన్ పరిధిలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి అధ్యక్షతన నియోజకవర్గస్థాయి సమీక్షా సమావేశం నిర్వహించారు. సైబరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్, మున్సిపాలిటీలు, విద్యుత్, విద్య, నీటిపారుదల, పంచాయతీరాజ్, ఆర్అండ్‌బీ, జాతీయ రహదారుల సంస్థ తదితర శాఖల అధికారులతో విస్తృతంగా సమీక్షించారు. ఇంద్రేశం, ఇస్నాపూర్, జిన్నారం, గుమ్మడిదల, గడ్డపోతారం మున్సిపాలిటీల పరిధిలో సుమారు రూ. 75 కోట్లతో కొనసాగుతున్న అభివృద్ధి పనుల పురోగతిని ఎమ్మెల్యే సమీక్షించారు. ప్రతి పనికి నిర్దేశిత గడువు నిర్ణయించుకొని, ఆ గడువులోగా పనులు పూర్తిచేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని ఆదేశించారు.

**పనులు ప్రారంభించని కాంట్రాక్టర్లపై కొరడా**

టెండర్ ప్రక్రియ పూర్తయినప్పటికీ పనులు ప్రారంభించకుండా కాలయాపన చేస్తున్న కాంట్రాక్టర్లపై ఎమ్మెల్యే తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. "ప్రజల కోసం మంజూరైన నిధులు కార్యాలయాల ఫైళ్లలో ఉండటానికి కాదు.. ప్రజలకు ఉపయోగపడే పనులుగా మారాలి" అని అన్నారు. పనులు ప్రారంభించని కాంట్రాక్టర్లపై నిబంధనల ప్రకారం చర్యలు తీసుకోవడంతో పాటు వారిని బ్లాక్‌లిస్ట్‌లో చేర్చాలని అధికారులను ఆదేశించారు. అవసరమైతే వారి స్థానంలో కొత్త కాంట్రాక్టర్లను ఎంపిక చేసి పనులను వెంటనే ప్రారంభించాలని సూచించారు. అధికారులు నిరంతరం క్షేత్రస్థాయిలో పర్యటించాలని ఎమ్మెల్యే సూచించారు. అమీన్పూర్, పటాన్చెరు సర్కిళ్ల పరిధిలో పారిశుధ్య పరిస్థితులపై ఎమ్మెల్యే తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. నూతన కాలనీలు, బస్తీల్లో వీధిదీపాల సమస్యపై ప్రజల నుంచి ఫిర్యాదులు వస్తున్నాయని ఎమ్మెల్యే తెలిపారు. ప్రతి వీధిలో వీధిదీపాలు వెలిగేలా అధికారులు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. అవసరమైన ప్రాంతాల్లో కొత్త వీధిదీపాలు ఏర్పాటు చేయడంతో పాటు పనిచేయని లైట్లను వెంటనే మరమ్మతు చేయాలని సూచించారు. ఇంద్రేశం, ఇస్నాపూర్, జిన్నారం, గుమ్మడిదల, గడ్డపోతారం మున్సిపాలిటీల్లో వేగంగా విస్తరిస్తున్న నూతన కాలనీలపై ప్రత్యేక దృష్టి పెట్టాలని ఎమ్మెల్యే ఆదేశించారు. పటాన్చెరు మండలంలోని మూడు గ్రామాలు, గుమ్మడిదల మండలంలోని ఎనిమిది గ్రామ పంచాయతీల్లో సీసీ రోడ్లు, యూజీడీ పనులకు ప్రాధాన్యత ఇవ్వాలని ఎంపీడీవోలను ఆదేశించారు. పటాన్చెరు రెవెన్యూ పరిధిలోని పోచారం, లకడారం ప్రాంతాల్లో నిర్మించిన నూతన సబ్‌స్టేషన్లను సెప్టెంబర్‌లో ప్రారంభించనున్నట్లు ఎమ్మెల్యే తెలిపారు. పటాన్చెరు, అమీన్పూర్ సర్కిళ్ల పరిధిలో క్యూర్ అర్బన్ రీజియన్ పాఠశాలల ఏర్పాటుకు ప్రభుత్వం నిధులు మంజూరు చేసిందని ఎమ్మెల్యే తెలిపారు. త్వరలోనే నిర్మాణ పనులు ప్రారంభమవుతాయని వెల్లడించారు. నాణ్యమైన విద్యను అందించడంతో పాటు విద్యార్థులకు ఆధునిక వసతులు కల్పించడమే లక్ష్యమన్నారు. చేయూత పింఛన్లకు సంబంధించిన అంశాలపై ప్రజలకు పూర్తి స్థాయిలో అవగాహన కల్పించాలని అధికారులను ఎమ్మెల్యే ఆదేశించారు.

## భిన్న దృక్కోణాల ద్వారా మానసిక సవాళ్లను పరిష్కరించాలి

**గీతం సదస్సులో అభిప్రాయపడ్డ సైకాలజీ నిపుణులు**

**పటాన్చెరు, ఆగస్టు 18 (సింగిడి):** మానసిక పరిశోధన యొక్క విస్తరిస్తున్న పరిధిని, సంక్లిష్టమైన మానవ, సామాజిక సవాళ్లను అంతర్-విభాగ దృక్కోణాల ద్వారా పరిష్కరించాల్సిన ఆవశ్యకత ఉందని మానసిక శాస్త్ర నిపుణులు అభిప్రాయపడ్డారు. గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయం, హైదరాబాదులో 'అనిశ్చితి కాలంలో మనస్తత్వ శాస్త్రం: అంతర్-విషయ దృక్పథం, ఆవిష్కరణ, ప్రభావం' అనే అంశంపై రెండు రోజుల సదస్సును 17-18 తేదీలలో నిర్వహించారు. గీతం స్కూల్ ఆఫ్ హ్యుమానిటీస్ అండ్ సోషల్ సైన్సెస్ లోని అప్లైడ్ సైకాలజీ విభాగం ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ సదస్సు హైబ్రిడ్ పద్ధతిలో జరిగింది. ఇందులో మనస్తత్వశాస్త్రం, దాని అనుబంధ విభాగాలకు చెందిన పరిశోధకులు, విద్యావేత్తలు, నిపుణులు, విద్యార్థులు పాల్గొన్నారు. అనిశ్చితి అనేది వ్యక్తిగత జీవితాలు, కార్యాలయాలు, విద్య, ఆరోగ్యం, సాంకేతికత, సమాజాన్ని అంతకంతకూ ప్రభావితం చేస్తున్న నేపథ్యంలో, వేగంగా మారుతున్న ఈ వాస్తవాలను మనస్తత్వ శాస్త్రం ఎలా స్పందించగలదో పరిశీలించడానికి సైకాన్ '26 ప్రయత్నించింది. ఈ సదస్సు సమకాలీన మనస్తత్వ శాస్త్ర పరిశోధన, బోధన, ఆచరణపై విభిన్న దృక్కోణాలను ఒకచోట చేర్చి, అంతర్-



విభాగ సంభాషణకు ఒక వేదికను కల్పించింది. ఈ సదస్సులో క్లినికల్ సైకాలజీ, సైకోఅనాలిసిస్, సైకోఅనలిటిక్ సైకోథెరపీ, ఆర్గనైజేషనల్ సైకాలజీ, ఎడ్యుకేషనల్ సైకాలజీ, సోషల్ సైకాలజీ, లీగల్-ఫోరెన్సిక్ సైకాలజీ, కాగ్నిటివ్-ఎక్స్ పెరిమెంటల్ సైకాలజీ, ఎన్విరాన్ మెంటల్ సైకాలజీ, హెల్త్ సైకాలజీ, టెక్నాలజీ-ఏఐ వంటి అనేక రంగాలకు సంబంధించిన పరిశోధన పత్రాలను సమర్పించారు. బెర్లిన్ లోని మాక్స్ ప్లాంక్ ఇన్ స్టిట్యూట్ ఫర్ హ్యూమన్ డెవలప్ మెంటుకు చెందిన సెంటర్ ఫర్ అడాప్టివ్ బిహేవియర్ అండ్ కాగ్నిషన్ (ఏబీసీ) డైరెక్టర్ డాక్టర్ గెర్డ్ గిగెరెంజర్ కీలకోపన్యాసం చేశారు. ఆయన భాగస్వామ్యం ఈ సదస్సుకు ఒక అంతర్జాతీయ దృక్కోణాన్ని తీసుకొచ్చింది. అనిశ్చిత వాతావరణంలో మనస్తత్వ శాస్త్రం, నిర్ణయాలు తీసుకోవడం, మానవ ప్రవర్తనపై చర్చలకు నాంది పలికింది. ఈ సదస్సులో మనస్తత్వ శాస్త్రం, దాని అనుబంధ రంగాల లోని విభిన్న విభాగాలకు చెందిన ప్రముఖ వక్తలు కూడా పాల్గొన్నారు. వారిలో కోల్ కతాలోని ప్రదీప్ సెంటర్ ఫర్ ఆటిజం మేనేజ్ మెంట్ డైరెక్టర్, సైకాలజిస్ట్ డాక్టర్ మల్లికా బెనర్జీ; కలకత్త విశ్వవిద్యాలయం, సైకాలజీ విభాగం ప్రొఫెసర్ డాక్టర్ అనిందితా చౌధురి; ముంబై విశ్వవిద్యాలయం, అనువర్తిత మనస్తత్వశాస్త్ర విభాగం ప్రొఫెసర్ డాక్టర్ వివేక్ బెల్హేకర్; క్లినికల్ సైకాలజిస్ట్, ఇన్నర్ హొరైజన్స్ వ్యవస్థాపకురాలు సుజాత అమేయ తదితరులు మనస్తత్వ శాస్త్రంలోని సమకాలీన ప్రశ్నలతో మమేకమయ్యేలా పండితోపన్యాసాలు, చర్చల ద్వారా ఇందులో పాల్గొన్న వారికి తోడ్పడ్డారు. సైకాన్ '26 విద్యార్థులకు, పరిశోధకులకు వారి పరిశోధనలను ప్రదర్శించడానికి, సుప్రసిద్ధ పండితులు, నిపుణులతో సంభాషించడానికి, సాంప్రదాయ విజ్ఞాన శాస్త్ర పరిధులను దాటిన దృక్కోణాలతో మమేకమవ్వడానికి అవకాశాలను కల్పించింది. విద్యా, వృత్తి, సాంకేతిక, సామాజిక సందర్భాలలో తలెత్తుతున్న సవాళు,, ఆవిష్కరణలో మానసిక శాస్త్ర పరిజ్ఞానాన్ని అనుసంధానించడం యొక్క ప్రాముఖ్యతను ఈ సదస్సు ప్రత్యేకంగా ప్రస్తావించింది. అప్లైడ్ సైకాలజీ విభాగ అధ్యాపకుల సహకారంతో డాక్టర్ రానితా బసు, డాక్టర్ శ్రీస్నిగ్ధ దిట్టకవి ఈ సదస్సును నిర్వహించారు. వారి సమిష్టి కృషి సైకాన్ '26 విజయవంతమైన నిర్వహణకు, ఈ విజ్ఞాన శాస్త్రంలో అర్థవంతమైన, విద్యాపరమైన చర్చలకు ఒక వేదికను అందించింది.

## హెచ్ఐవీ, ఎయిడ్స్ నివారణపై అవగాహన

- ప్రారంభించిన డీఎంహెచ్‌వో స్వర్ణ కుమారి

**ఉమ్మడి రంగారెడ్డి బ్యూరో, ఆగస్టు 18 (సింగిడి):** హెచ్ఐవీ,ఎయిడ్స్‌పై ప్రజల్లో అవగాహన కల్పించడంతో పాటు, వ్యాధిపై ఉన్న అపోహలను తొలగించేందుకు రంగారెడ్డి జిల్లా వైద్య ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో 'ఇంటెన్సిఫైడ్ ఐఈసీ క్యాంపెయిన్' లో భాగంగా మంగళవారం భారీ బైక్ ర్యాలీ నిర్వహించారు. రంగారెడ్డి జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి (డీఎంహెచ్‌వో) డాక్టర్ స్వర్ణ కుమారి ఈ బైక్ ర్యాలీని జెండా ఊపి ప్రారంభించారు. డిస్ట్రిక్ట్ ఇంటిగ్రేటెడ్ స్ట్రాటజీ ఫర్ హెచ్ఐవీ,ఎయిడ్స్ (దిశ) కార్యక్రమంలో భాగంగా నిర్వహించిన ఈ ర్యాలీలో టీజీఎస్ఏసీఎస్ (టిధిఎస్ ఏసిఎస్) ఐసీటీసీ ఉమ్మడి రంగారెడ్డి జిల్లా కేంద్రాల సిబ్బంది పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. ఆరోగ్య శాఖ సిబ్బంది, యువత, ఆశా కార్యకర్తలు, వివిధ శాఖల అధికారులు, నేకో (ఎన్ఏసీఓ) ప్రతినిధులు ర్యాలీలో ఉత్సాహంగా



పాల్గొని హెచ్ఐవీ,ఎయిడ్స్‌పై ప్రజలకు అవగాహన కల్పించారు. బైక్ ర్యాలీలో హెచ్ఐవీ ఎయిడ్స్ నివారణ, సురక్షిత జీవన విధానం, పరీక్షలు, చికిత్స, వ్యాధిపై ఉన్న అపోహల తొలగింపు వంటి అంశాలపై నినాదాలు చేస్తూ ప్రజల్లో అవగాహన కల్పించారు. బైక్‌లపై అవగాహన పోస్టర్లు, బ్యానర్లు ప్రదర్శిస్తూ ర్యాలీ కొనసాగింది. ఈ సందర్భంగా డాక్టర్ స్వర్ణ కుమారి మాట్లాడుతూ హెచ్ఐవీ ఎయిడ్స్‌పై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని, వ్యాధి పట్ల ఉన్న అపోహలను వీడాలని సూచించారు. హెచ్ఐవీతో జీవిస్తున్న వారిని వివక్షకు గురిచేయకుండా వారికి గౌరవం, అవసరమైన వైద్య సేవలు అందించాలని పిలుపునిచ్చారు. హెచ్ఐవీ ఎయిడ్స్‌కు సంబంధించిన సందేహాలు, సలహాల కోసం 1097 టోల్‌ఫ్రీ హెల్ప్‌లైన్‌ను వినియోగించుకోవాలని ఆమె కోరారు. ఈ కార్యక్రమంలో అదనపు డీఎంహెచ్‌వో డాక్టర్ పాప రావు, డీటీవో డాక్టర్ కళ్యాణ్ చక్రవర్తి, ఉమ్మడి రంగారెడ్డి జిల్లా టీజీఎస్ఏసీఎస్ ఐసీటీసీ కేంద్రాల సిబ్బంది పాల్గొన్నారు.

## సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ ఆశయ సాధనకు కృషి చేయాలి

**మాజీ ఎమ్మెల్యే కూన శ్రీశైలం గౌడ్**



**కుత్బుల్లాపూర్, ఆగస్టు 18 (సింగిడి):** కుత్బుల్లాపూర్ మాజీ శాసనసభ్యులు కూన శ్రీశైలం గౌడ్ సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ 366వ జయంతి సందర్భంగా చింతల్ డివిజన్ భగత్‌సింగ్ నగర్‌లో ఉన్న ఆయన విగ్రహానికి పూలమాల వేసి ఘనంగా నివాళు లర్పించారు. ఈ సందర్భంగా శ్రీశైలం గౌడ్ మాట్లాడుతూ బహుజన బిడ్డ సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ అణగారిన వర్గాల హక్కుల కోసం ధైర్యంగా పోరాడిన మహనీయుడని, ఆయన ఆశయాలు నేటి తరానికి స్ఫూర్తిదాయకమని గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో స్థానిక కాంగ్రెస్ డివిజన్ అధ్యక్షుడు బిల్లా వెంకటేష్, రోడా మేస్త్రీ నగర్ డివిజన్ అధ్యక్షుడు గుమస్తా మధుసూదన్, మోటే శ్రీనివాస్ యాదవ్, అఖిల్ గౌడ్, శ్రీనివాస్ రెడ్డి, రమేష్ మంజూల్కర్, షాకీర్, చోటు, సలీం, మధు, రఘు, బలరాం తదితరులు, స్థానిక నాయకులు పాల్గొన్నారు.

## సర్దార్ సర్వాయి పాపన్న ఆశయాలను ఆదర్శంగా తీసుకోవాలి

**ముమ్మారెడ్డి ప్రేమకుమార్**



**కూకట్‌పల్లి, ఆగస్టు 18 (సింగిడి):** కూకట్ పల్లి నియోజకవర్గం కేపీహెచ్‌బీ కాలనీ మూడో ఫేస్ టెంపుల్ బస్ స్టాప్ వద్ద భరతమాత ముద్దుబిడ్డ, తొలి తెలుగు బహుజన చక్రవర్తి సర్వాయి పాపన్న గౌడ్ 376వ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. తెలంగాణ రాష్ట్ర గౌడ సంఘ నాయకులు రాజేష్ గౌడ్, వినోద్ గౌడ్‌ల ఆహ్వానం మేరకు కూకట్ పల్లి నియోజకవర్గ జనసేన పార్టీ కంటెస్టెడ్ అభ్యర్థి ముమ్మారెడ్డి ప్రేమకుమార్ ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేశారు. ఈ సందర్భంగా సర్వాయి పాపన్న గౌడ్ చిత్రపటానికి ప్రేమకుమార్ పూలమాల వేసి ఘన నివాళులు అర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ... సామాజిక సమానత్వం కోసం, బహుజనుల ఆత్మగౌరవం కోసం జీవితాంతం పోరాడిన ధీశాలి సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ అన్నారు. మొఘల్ సామ్రాజ్యాన్ని ఎదిరించి, అణగారిన వర్గాల అభ్యున్నతి కోసం కోటలు నిర్మించి స్వయంపాలన అందించిన తొలి తెలుగు చక్రవర్తి ఆయన అన్నారు. పాపన్న చూపిన పోరాట స్ఫూర్తిని, తెగువను నేటి యువత ఆదర్శంగా తీసుకోవాలని సూచించారు. బహుజనుల హక్కుల సాధన కోసం ఆయన చేసిన త్యాగాలు చరిత్రలో చిరస్థాయిగా నిలిచిపోతాయని కొనియాడారు. ఈ కార్యక్రమంలో గౌడ సంఘ నాయకులు ముమ్మారెడ్డి ప్రేమకుమార్ ను శాలువాతో ఘనంగా సత్కరించారు. ఈ వేడుకల్లో జనసేన నాయకులు కొల్లా శంకర్, వేముల మహేష్, పోలబోయిన శ్రీనివాస్, పలువురు గౌడ సంఘ నాయకులు, సభ్యులు స్థానిక కాలనీ వాసులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## బడుగు,బలహీన వర్గాల హక్కుల కోసం పాపన్న గౌడ్ చేసిన పోరాటం స్ఫూర్తిదాయకం

- అడిషనల్ కలెక్టర్ పాండు
- ఘనంగా సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ జయంతి వేడుకలు



**సంగారెడ్డిబ్యూరో, ఆగస్టు 18 (సింగిడి):** సామాజిక సమానత్వం, సామాజిక న్యాయం కోసం ప్రతి ఒక్కరూ కృషి చేయాలని అదనపు కలెక్టర్ పాండు అన్నారు. సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ జయంతిని పురస్కరించుకుని జిల్లా వెనుకబడిన తరగతుల సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో మంగళవారం కలెక్టరేట్ ఎదుట ఉన్న సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ విగ్రహం వద్ద జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన అదనపు కలెక్టర్ పాండు సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ అణగారిన, బడుగు,బలహీన వర్గాల హక్కుల కోసం, సామాజిక సమానత్వం కోసం ధైర్యంగా పోరాడిన మహనీయుడని అన్నారు. అన్యాయం, దోపిడీ, అసమానతలకు వ్యతిరేకంగా ఆయన సాగించిన పోరాటం నేటి తరానికి స్ఫూర్తిదాయకమని పేర్కొన్నారు. అణగారిన వర్గాలకు ఆత్మగౌరవం, సమాన హక్కులు, స్వేచ్ఛ లభించాలనే లక్ష్యంతో ఆయన చేసిన కృషి చరిత్రలో చిరస్థాయిగా నిలిచిపోయిందన్నారు. ప్రజల కోసం ధైర్యంగా నిలబడిన ఆయన స్ఫూర్తిని నేటి యువత ఆదర్శంగా తీసుకోవాలని సూచించారు. సమాజంలోని బడుగు, బలహీన వర్గాల అభ్యున్నతికి ప్రతి ఒక్కరూ తమ వంతు కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో జిల్లా వెనుకబడిన తరగతుల సంక్షేమ అధికారి జగదీష్, బీసీ సంఘాల నాయకులు, అధికారులు, సిబ్బంది, ప్రజలు తదితరులు పాల్గొన్నారు. బీసీ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో కలెక్టరేట్ ఎదుట గల సర్వాయి పాపన్న విగ్రహానికి పూల మాలలు నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర కార్య నిర్వహణ అధ్యక్షులు ప్రభు గౌడ్, జిల్లా అధ్యక్షులు మల్లికార్జున్, నాయకులు రాజేశ్వర స్వామి తదితరులు పాల్గొన్నారు.

## డ్రైనేజీ పనులను పరిశీలించిన మాజీ కార్పొరేటర్ ప్రభుదాస్



**నాచారం, ఆగస్టు 18 (సింగిడి):** నాచారం సర్కిల్ హెచ్‌బీ కాలనీ డివిజన్ పరిధిలోని లక్ష్మీనగర్, కృష్ణానగర్ కాలనీలలో ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి సహకారంతో చేపట్టిన బాక్స్ డ్రైన్ నిర్మాణ పనులను మాజీ కార్పొరేటర్ జెరిపోతుల ప్రభుదాస్ అధికారులతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా మాజీ కార్పొరేటర్ జెరిపోతుల ప్రభుదాస్ మాట్లాడుతూ నిర్మాణ పనుల పురోగతిని పరిశీలించి, నాణ్యతా ప్రమాణాలు తప్పనిసరిగా పాటిస్తూ నిర్ణీత ప్రమాణాలకు అనుగుణంగా పనులను చేపట్టి ఎలాంటి జాప్యం లేకుండా త్వరితగతిన పూర్తి చేయాలని అధికారులకు సూచించారు. పనుల నాణ్యత విషయంలో రాజీ పడకుండా స్థానిక ప్రజలకు శాశ్వతంగా ఉపయోగపడేలా నిర్మాణ పనులను పకడ్బందీగా చేపట్టాలని కోరారు. లక్ష్మీనగర్, కృష్ణానగర్ కాలనీలలో డ్రైనేజీ సమస్యలకు శాశ్వత పరిష్కారం కల్పించేందుకు బాక్స్ డ్రైన్ నిర్మాణ పనులు చేపట్టడం జరుగుతుందని తెలిపారు. ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి సహకారంతో డివిజన్‌లో మౌలిక వసతుల అభివృద్ధికి నిరంతరం కృషి చేస్తున్నామని పేర్కొన్నారు. ప్రజలకు ఇబ్బందులు కలగకుండా పనులను వేగవంతంగా పూర్తి చేసి అందుబాటులోకి తీసుకురావాలని అధికారులను కోరారు. ఈ కార్యక్రమంలో ఈఈ రమేష్ బాబు, డీఈ సాయి పృథ్వీ, ఏఈ స్పందన, వర్క్ ఇన్‌స్పెక్టర్ చారి తదితరులు పాల్గొన్నారు.

# 3.29 కోట్లతో అభివృద్ధి పనులు

**శంకుస్థాపన చేసిన పీఏసీ ఛైర్మన్ గాంధీ**



**కూకట్ పల్లి, ఆగస్టు 18 (సింగిడి):** ఆల్విన్ కాలనీ డివిజన్ పరిధిలోని ఎల్లమ్మబండ, శంషిగూడ, పీజేఆర్ నగర్ కాలనీలలో రూ. 3 కోట్ల 29 లక్షల అంచనా వ్యయంతో నూతనంగా చేపట్టనున్న వివిధ అభివృద్ధి పనులకు పీఏసీ ఛైర్మన్, శేరిలింగంపల్లి ఎమ్మెల్యే ఆరెకపూడి గాంధీ శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజల సంక్షేమం, శేరిలింగంపల్లి నియోజకవర్గ సర్వతోముఖాభివృద్ధే ధ్యేయంగా ముందుకు వెళ్తున్నట్లు తెలిపారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మార్గదర్శకంలో, మంత్రి శ్రీధర్ బాబు సహకారంతో నియోజకవర్గాన్ని అన్ని రంగాల్లో ఆదర్శవంతమైన, అగ్రగామి నియోజకవర్గంగా తీర్చిదిద్దుతామన్నారు. మౌలిక వసతుల కల్పనకు పెద్దపీట వేస్తున్నామని, నాణ్యతా ప్రమాణాలతో పనులు చేపట్టి ఎక్కడా రాజీ పడకుండా త్వరితగతిన పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని అధికారులను ఆదేశించారు. ఎల్లమ్మబండలో హిందూ, ముస్లిం, క్రిస్టియన్ స్మశాన వాటికల అభివృద్ధికి ప్రత్యేక చర్యలు చేపడుతున్నట్లు తెలిపారు. ప్రహరీ గోడ నిర్మాణం, దహన వాటిక, స్నానపు గదులు, విశ్రాంతి గదుల ఏర్పాటు ద్వారా చివరి దశ సంస్కారాలు ప్రశాంత వాతావరణంలో జరిగేలా చర్యలు తీసుకుంటున్నట్లు వెల్లడించారు. కాలనీల్లో ఆహ్లాదకరమైన వాతావరణం కోసం పార్కులు, బతుకమ్మ పార్కుల అభివృద్ధి చేపడుతున్నామని, ప్రతి పార్కులోనూ ఓపెన్ జిమ్‌లను ఏర్పాటు చేసి వృద్ధులు, పిల్లలకు ఆరోగ్యకరమైన వాతావరణాన్ని అందిస్తామని స్పష్టం చేశారు. ఎల్లమ్మబండ: హిందూ, ముస్లిం, క్రిస్టియన్ స్మశాన వాటిక ప్రహరీ గోడ నిర్మాణం మరియు అభివృద్ధి పనులు రూ. 135.00 లక్షలు, పీజేఆర్ నగర్ బతుకమ్మ పార్క్ అభివృద్ధి, సుందరీకరణ పనులు రూ. 101.50 లక్షలు, పీజేఆర్ నగర్ కాలనీ పార్క్ సుందరీకరణ, అభివృద్ధి పనులు రూ. 61.50 లక్షలు, శంషిగూడ టాయిలెట్ బ్లాక్ నిర్మాణం పనులు రూ. 31.00 లక్షల ఉదయంతో పనులు చేపట్టనున్నారు. ఈ కార్యక్రమంలో తాజా మాజీ కార్పొరేటర్లు దొడ్ల వెంకటేష్ గౌడ్, నార్నె శ్రీనివాసరావు పాల్గొన్నారు.

## అర్హుల ఇంటి వద్ద పింఛన్ల ధరఖాస్తులు పరిశీలన



**వికారాబాద్, ఆగస్టు 18(సింగిడి):** వికారాబాద్ పట్టణంలోని 27వ వార్డు గంగారంలోని పలువురు వితంతువులు, వికలాంగుల పింఛన్ ధరఖాస్తులను వార్డ్ ఆఫీసర్ తో కలిసి పరిశీలించి వారి వివరాలను మంగళవారం సంతకాలను కౌన్సిలర్ రాకేష్ నమోదు చేయించారు. ఈ నేపథ్యంలో ప్రజల నుండి హర్షం వ్యక్తమైయింది. ఆయనతోపాటు 31వ వార్డు కౌన్సిలర్ మల్లికార్జున గౌడ్, 31వ వార్డ్ ఆఫీసర్ సంపత్ పాల్గొన్నారు.

# భవానీ నగర్‌లో అభివృద్ధి పనులు పరిశీలన

**నాచారం, ఆగస్టు 18 (సింగిడి):** నాచారం డివిజన్‌లో గత కొన్ని సంవత్సరాలుగా పెండింగ్‌లో ఉన్న భవానీ నగర్ అండర్ డ్రైనేజ్ మరియు సీసీ రోడ్ల పనులు ప్రారంభమయ్యాయి. ఉప్పల్ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి మందుముల పరమేశ్వర్ రెడ్డి చొరవతో నాచారం డివిజన్ అధ్యక్షులు నూతలకంటి పర్యవేక్షణలో అభివృద్ధి పనులకు శ్రీకారం చుట్టడం జరిగింది. భవానీ నగర్ కాలనీ వాసులు హర్షం వ్యక్తం చేస్తూ, ఎన్నాళ్ళుగానో ఎదురుచూస్తున్న సమస్యలకు పరిష్కారం చూపుతున్న కాంగ్రెస్ పార్టీ నాయకత్వానికి కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమం లో డిసిసి నాయకులు రామ్ రెడ్డి, రాజి రెడ్డి, మాజీ అధ్యక్షుడు శ్రీకాంత్ గౌడ్, ఫస్సిఉద్దీన్, ధర్మ కర్త సునీల్ రెడ్డి, గద్ద క్రాంతి కిషోర్, శంకర్ గౌడ్, పూర్ణిమ, సనా, జూపల్లి రాజేష్,రాజశేఖర్ తదితరులు పాల్గొన్నారు.



ప్రభాతనవ **సింగిడి** ప్రతి రంగూ ఓ నిజం
Singidi
బుధవారం 19-8-2026

# ఎడిటోరియల్

Editorial

## 'దిమాగీ నక్సల్' వివాదం.. భద్రతా? స్వేచ్ఛా? రెండింటికీ చోటెక్కడ!

ఎర్రకోట నుంచి దేశాన్ని ఉద్దేశించి చేసిన స్వాతంత్ర్య దినోత్సవ ప్రసంగంలో నక్సలిజం, మావోయిజం అంశాలను ప్రస్తావిస్తూ ప్రధాని నరేంద్ర మోదీ "దిమాగీ నక్సల్" అనే పదప్రయోగం చేయడం రాజకీయ, ప్రజాస్వామ్య వర్గాల్లో చర్చకు దారితీసింది. సాయుధ నక్సలిజం బలహీనపడుతున్నప్పటికీ, దాని భావజాల ప్రభావాలపై అప్రమత్తంగా ఉండాల్సిన అవసరం ఉందని ఆయన పేర్కొన్నట్లు పలు వార్తా నివేదికలు తెలిపాయి. ఈ పదప్రయోగంపై భిన్న రాజకీయ స్పందనలు వ్యక్తమయ్యాయి. కాంగ్రెస్ సీనియర్ నేత పి. చిదంబరం తనదైన రీతిలో స్పందించగా, జమ్మూ--కాశ్మీర్ మాజీ ముఖ్యమంత్రి మెహబూబా ముఫ్తీ కూడా ఈ వ్యాఖ్యపై అభిప్రాయం వ్యక్తం చేశారు. అయితే ఈ చర్చను ఒక పదప్రయోగానికి అనుకూలమా, వ్యతిరేకమా అనే రాజకీయ వాదనగా మాత్రమే పరిమితం చేయకుండా, దాని వెనుక ఉన్న విస్తృత ప్రజాస్వామ్య ప్రశ్నను పరిశీలించాల్సిన అవసరం ఉంది. దేశ భద్రతను కాపాడే ప్రభుత్వ బాధ్యతతో పాటు, ప్రభుత్వ విధానాలను ప్రశ్నించే పౌరుడి రాజ్యాంగ హక్కు ఎలా సమతుల్యంగా కొనసాగాలి? విమర్శ ఎక్కడ వరకు చట్టబద్ధమైన భావప్రకటనగా ఉంటుంది? ఏ పరిస్థితుల్లో అది వర్తించే చట్టాల పరిధిలోకి వస్తుంది? వీటికి సమాధానం రాజకీయ ముద్రల్లో కాదు.. రాజ్యాంగ నిబంధనలు, వర్తించే చట్టాలు, నిర్దిష్ట వాస్తవాలు, అందుబాటులో ఉన్న ఆధారాలు, న్యాయపరమైన ప్రక్రియ ఆధారంగానే ఉండాలి.

**విమర్శ నేరం కాదు..**
**చట్టం గీసిన హద్దు ఏమిటి?**

ప్రజాస్వామ్యంలో ప్రభుత్వ విధానాలను ప్రశ్నించడం, విమర్శించడం, అసమ్మతిని వ్యక్తం చేయడం భావప్రకటన స్వేచ్ఛలో భాగం. అయితే ఈ స్వేచ్ఛకు రాజ్యాంగం అనుమతించే చట్టబద్ధమైన పరిమితులు కూడా ఉన్నాయి. ప్రభుత్వ విధానంపై విమర్శ ఒక అంశమైతే, హింసకు ప్రేరేపించడం లేదా చట్టవిరుద్ధ చర్యలకు పాల్పడడం మరో అంశం. ఈ రెండింటి మధ్య తేడాను రాజకీయ ముద్రల ఆధారంగా కాకుండా, వ్యక్తి చేసిన నిర్దిష్ట వ్యాఖ్యలు లేదా చర్యలు, వాటి సందర్భం, వర్తించే చట్టపరమైన నిబంధనలు, అందుబాటులో ఉన్న ఆధారాల ఆధారంగా పరిశీలించాలి. కేదార్‌నాథ్ సింగ్ వర్సెస్ బీహార్ రాష్ట్రం (1962) తీర్పులో సుప్రీంకోర్టు అప్పటి భారతీయ శిక్షాస్మృతిలోని 124--ఎ సెక్షన్‌ను పరిశీలిస్తూ, ప్రభుత్వ చర్యలపై విమర్శ లేదా అసంతృప్తి వ్యక్తం చేయడానికీ, హింసకు ప్రేరేపించే లేదా ప్రజా శాంతి, శాంతిభద్రతలకు ముప్పు కలిగించే చర్యలకూ మధ్య తేడాను వివరించే న్యాయసూత్రాన్ని ప్రతిపాదించింది. అయితే ఆ తీర్పు అప్పటి చట్టపరమైన నిబంధనకు సంబంధించినదైనందున, ప్రస్తుత క్రిమినల్ చట్ట వ్యవస్థలో వర్తించే నిబంధనలను సందర్భానుసారంగా ప్రత్యేకంగా పరిశీలించాల్సి ఉంటుంది. ప్రస్తుతం అమల్లో ఉన్న భారతీయ న్యాయ సంహిత, 2023లోని 152వ సెక్షన్ భారత సార్వభౌమత్వం, ఐక్యత, సమగ్రతకు ముప్పు కలిగించే నిర్దిష్ట చర్యలను శిక్షార్హంగా పేర్కొంటుంది. అదే నిబంధనలో, ప్రభుత్వ చర్యలు లేదా పరిపాలనా చర్యల్లో మార్పు కోరుతూ చట్టబద్ధమైన మార్గాల్లో అసమ్మతి వ్యక్తం చేయడం, ఆ సెక్షన్‌లో పేర్కొన్న నిషేధిత కార్యకలాపాలకు ప్రేరేపణ లేదా వాటికి ప్రయత్నంతో సంబంధం లేకపోతే, ఆ చర్యలు ఆ సెక్షన్ కింద నేరంగా పరిగణించబడవని వివరణ ఉంది. అందువల్ల భావప్రకటన స్వేచ్ఛకు రాజ్యాంగ రక్షణ ఉన్నప్పటికీ, చట్టబద్ధంగా విధించగల పరిమితులు, నిర్దిష్ట చట్టపరమైన నిబంధనలు కూడా వర్తిస్తాయి. ఏదైనా వ్యాఖ్య లేదా చర్య చట్టపరమైన బాధ్యతకు దారితీస్తుందా లేదా అనేది కేవలం రాజకీయ ఆరోపణలతో నిర్ణయించకూడదు. దాని పూర్తి సందర్భం, నిర్దిష్ట వాస్తవాలు, వర్తించే చట్టాలు, అందుబాటులో ఉన్న ఆధారాలు, న్యాయపరమైన పరిశీలన ఆధారంగానే నిర్ణయించాలి. విమర్శను నేరంగా చూడకూడదు. చట్టవిరుద్ధ చర్యలకు విమర్శ అనే పేరుతో స్వయంచాలక రక్షణ కూడా ఉండదు.

**యువత స్వరం వినాలి.. మార్గాలు చూపాలి!**

పరీక్షల పారదర్శకత, ప్రశ్నపత్రాల భద్రత, పరీక్షల నిర్వహణ, నియామకాల ప్రక్రియ, విద్యా వ్యవస్థలోని లోపాలు వంటి అంశాలపై విద్యార్థులు ప్రశ్నలు లేవనెత్తడం ప్రజాస్వామ్య ప్రక్రియలో సహజమైన భాగం. 2026లో పరీక్షలు, నియామక ప్రక్రియల్లో పారదర్శకత, జవాబుదారీతనం కోరుతూ విద్యార్థుల ఆందోళనలు, నిరసనలు ప్రజా చర్చలో భాగమయ్యాయి. ఇలాంటి సందర్భాల్లో విద్యార్థుల ప్రశ్నలకు వాస్తవాలు, గణాంకాలు, అధికారిక సమాచారం, పారదర్శక వివరణలతో సమాధానం ఇవ్వడం ప్రభుత్వ బలహీనత కాదు, అది ప్రజా విశ్వాసాన్ని పెంచే ప్రజాస్వామ్య బాధ్యత. శాంతియుత నిరసన ప్రజాస్వామ్య వ్యక్తీకరణలో ముఖ్యమైన రూపం. అయితే హింస, బెదిరింపులు, ప్రజా ఆస్తుల ధ్వంసం లేదా ఇతర చట్టవిరుద్ధ చర్యలకు అదే హక్కు పేరుతో సమర్థన ఉండకూడదు. స్థానిక సమస్య అయినా, జాతీయ స్థాయి అంశమైనా ప్రమాణం ఒకటే కావాలి. ప్రశ్నను అణచడం కాదు.. ప్రశ్నకు వాస్తవాలతో సమాధానం ఇవ్వడం ప్రజాస్వామ్య జవాబుదారీతనం. ప్రభుత్వం యువతను వినే, వారి ప్రశ్నలకు పారదర్శకంగా సమాధానం ఇచ్చే వ్యవస్థలను బలోపేతం చేయాలి. అవసరమైన చోట సంభాషణా వేదికలు, ఫిర్యాదు పరిష్కార వ్యవస్థలు, ప్రజా సంప్రదింపుల ప్రక్రియలను మరింత సమర్థవంతం చేయాలి. యువత కూడా తమ అసమ్మతిని శాంతియుతంగా, బాధ్యతాయుతంగా, చట్టబద్ధమైన మార్గాల్లో వ్యక్తం చేయాలి.

**వ్యాసకర్త: ఫిరోజ్ ఖాన్,**
**సీనియర్ ఫ్రీలాన్స్ జర్నలిస్ట్**
**9640466464**

# గణితశాస్త్ర మేధావి బ్లేజ్ పాస్కల్

## ఆగస్టు 19...బ్లేజ్ పాస్కల్ వర్ధంతి

అన్ని వయసులవారూ నేడు వాడే చిన్ని యంత్రం కాలుక్యులేటరు. కూడికలు, తీసివేతలు, హెచ్చ వేతలు, భాగహారాలు ... ఒకటేమిటి, లెక్కల్లో వచ్చే ప్రతి అంశాన్నీ అతివేగంగా పరిస్కరించి తెరమీద చూపిస్తుంది. ఇది విద్యార్థులకు, వ్యాపార సంస్థలకు, అనేకులకు అనేక విధాలుగా ఉపయోగ పడుతుంది . దీన్ని కనుగొన్నశాస్త్రజ్ఞుడే బ్లెయిస్ పాస్కల్ .

పాస్కల్ (జూన్ 19, 1623 – ఆగష్టు 19, 1662) పాస్కల్ సూత్రం కని పెట్టిన శాస్త్రవేత్త. ప్రఖ్యాతి గాంచిన గణిత శాస్త్రవేత్త, భౌతిక శాస్త్రజ్ఞుడు, ఆధ్యాత్మిక తత్వవేత్త.
బ్లేజ్ పాస్కల్ జూన్ 19, 1623 న ఫ్రాన్స్ యొక్క దక్షిణ – మధ్య ప్రాంతంలో ఆవర్న్ ప్రాంతంలో క్లెర్మాంట్‌లో జన్మించాడు. ఈ ప్రాంతం ఉంది. చిన్న వయసులోనే మరణించిన గణిత మహా మేధావి. ఫ్రాన్స్ కి చెందిన పాస్కల్ 7 యేండ్ల వయస్సు నుండే జామెట్రీ పట్ల విపరీతమైన ఆసక్తిని ప్రదర్శిస్తూ అందరినీ ఆశ్చర్య పరచే వాడట, 12 ఏళ్ళ వయస్సులోనే ఒక త్రిభుజం లోని మూడు కోణాల మొత్తం రెండు లంబకోణాల మొత్తానికి సమానంగా ఉంటుందనే సిద్ధాంతాన్ని ప్రవేశ పెట్టాడు. దీంతో ఈయన తండ్రి పాస్కల్ ను గణితం చదవడానికి ఎక్కువగా ఆసక్తి చూపాడు. అందరూ వేనోళ్ళ కొనియాడుతున్న "యూనివర్సల్ థీరం ఆఫ్ జామెట్రీ" పాస్కల్ రూపొందించినదే. పదహారేళ్ల వయసులో శంఖు పరిచ్ఛేదాల (ఎశీఅఱష ంవష్‌ఱశీఅం) గురించి గొప్ప వ్యాసం రాసి మహామహా గణితవేత్తలే ముక్కున వేలు వేసుకునేట్టు చేశాడు పాస్కల్. ఆ కృషిలో బయట పడ్డదే పాస్కల్ సిద్ధాంతంగా తరువాత పేరు పొందింది.



శంఖు పరిచ్ఛేదంలో అంతర్లిఖితమైన ఏదైనా షడ్భుజి యొక్క అభిముఖంగా ఉండే అంచులని కలుసుకునే వరకు పొడిగిస్తే, ఆ మూడు జతల అభిముఖ అంచులూ కలిసే మూడు ఖండన బిందువులూ ఒకే సరళరేఖలో ఉంటాయి.

ఈ సిద్ధాంతం ప్రకారం... షడ్భుజి ఆరు భుజాలు (లేదా బాహువులు) గల బహుభుజి. ఆ భుజాలు సమానంగా ఉండనక్కర్లేదు. ఆరు భుజాలు ఉన్నాయి గనుక ఒకటోది, నాలుగోది అభిముఖంగా ఉంటాయి. అలాగే 2–5, 3–6 జతల భుజాలు కూడా అభిముఖంగా ఉంటాయి. ఈ అభిముఖంగా ఉండే భుజాల జతలని పొడిగిస్తే ఎక్కడో అక్కడ కలుస్తాయి. అలా వచ్చిన మూడు ఖండన బిందువులు (జూశీఱఅ్‌ం శీట ఱఅ్‌వతీంవష్‌ఱశీఅ) ఒకే సరళ రేఖ మీద ఉంటాయని సిద్ధాంతం చెప్తుంది. పాస్కల్ సిద్ధాంతం 1639 లో ప్రచురించ బడింది, "ది కోనిక్స్ ఎస్సే". పాస్కల్ యొక్క ఆధ్యాత్మిక షడ్భుజి అని పిలుస్తారు.

ఆయనకు 17 ఏళ్ళు వచ్చినప్పుడు ప్రముఖ గణిత శాస్త్రజ్ఞుడు డెస్ కార్టెస్ ఆయనలో ఒక గొప్ప మేధావిని చూసి ప్రశంసించాడు. అంతటి సమర్థుడు బ్లెయిసీ పాస్కల్. పాస్కల్ త్రిభుజం గురించి, దాని లక్షణాల గురించి 20ఏళ్ళ వయసుల ఓ పుస్తకం రాశాడు.
పాస్కల్ జీవితమంతా ఫ్రాన్స్ లోనే గడిచింది. ఆయన తండ్రి అక్కౌంటెంట్ గా పని చేసేవాడు. రాత్రీ పగలూ లెక్కలు చేసేవాడు. తండ్రి పడుతున్న కష్టం చూచి పాస్కల్ లెక్కలు చేసే యంత్రాన్ని రూపొందించాడు. ఈ కాలిక్యులేటింగ్ మెషిన్ కూడికలు, తీసివేతలు, గుణింతాలు, భాగహారాలు వంటివి చేసి పెట్టేది. ఆ మెషీన్ పాస్కల్ తండ్రికి ఎంతగానో ఉపయోగపడేది. అయితే ఈ యంత్రాన్ని తయారు చేయటానికి ఎవరూ ముందుకు రాలేదు. కారణం దానికయ్యే ఖర్చు ఎక్కువ కావటమే. అయినప్పటికీ చాలా కాలం తరువాత 1892 విల్లియం బరగ్స్ అనే అమెరికన్ పాస్కల్ నమూనాను ఆధారంగా చేసుకునే ఓ కాలిక్యులేటింగ్ మెషీన్ రూపొందించాడు.

పాస్కల్ సూత్రం తెలియని విద్యార్థి ఉండరు. ద్రవ పదార్థంలో ఏదైనా ఒక బిందువు వద్ద పీడనాన్ని ఉపయోగించడం జరిగితే ఆ పీడన ప్రభావం ఆ ద్రవ పదార్థం అన్ని పైపులకు సమానంగా విస్తరిస్తుంది. ఈ సూత్రాన్ని ఆధారంగా చేసుకుని సిరెంజ్ ని, హైడ్రాలిక్ ప్రెస్ ను, హైడ్రాలిక్ బ్రేక్ ను రూపొందించటం జరిగింది. పాస్కల్ ఒక త్రిభుజాన్ని కూడా నిర్మించాడు. దీన్ని పాస్కల్ త్రిభుజం అంటారు. ఈ త్రిభుజం సహాయంతో ప్రాబబిలిటీ సమస్యలను సునాయాసంగా చేయవచ్చు.
1643 లో చేసిన గణిత శాస్త్రవేత్త మరియు భౌతిక శాస్త్రవేత్త ఎవాంజెలిస్టా టోరిసెల్లి రూపొందించిన ప్రయోగాలను పునరావృతం చేశాడు. 1646 నుండి పాస్కల్ శూన్యతను తనిఖీ చేసే ఎంపికలను అధ్యయనం చేయడానికి తనను తాను అంకితం చేసుకున్నాడు.

1653 లో పాస్కల్ వాతావరణ పీడనం గురించి ఒక గ్రంథాన్ని ప్రచురించాడు. హైడ్రో స్టాటిక్స్ అంశం చాలా వివరణాత్మక రీతిలో అభివృద్ధి చేయబడిన మొదటి గ్రంథంగా ఇది పరిగణించ బడుతుంది.

పాస్కల్ శాస్త్రవేత్త మాత్రమే కాదు. తత్వవేత్త కూడా. రచయిత కూడ, మతపరమైన పుస్తకాలను ఎన్నింటినో రాసాడు. జామెట్రీ, ప్రాబబిలిటీ, హైడ్రోస్టాటిక్స్, ఎంటగ్రల్ కాలిక్యులస్ -- అంశాల మీద ఎన్నో విలువైన పరిశోధనలు చేశాడు. పాస్కల్ ప్రధాన రచనలు పాస్కల్ యొక్క సిద్ధాంతం, పాస్కలిన్, శూన్యత యొక్క ఉనికి లేదా వాతావరణ పీడనంపై ప్రయోగాలు.

1659 లో తీవ్ర అనారోగ్యం పాలై, పాస్కల్ 1662 లో కన్ను మూశాడు. మొదటి కాలిక్యులేటర్ నుండి మొదటి ప్రజా రవాణా సేవ వరకు ఆవిష్కరణలతో అతను చిన్న వయస్సు నుండే ప్రపంచాన్ని విప్లవాత్మకంగా మార్చాడు. ఆయన వెలువరించిన శాస్త్రీయ వాస్తవాలు మాత్రం ఎంతో మందికి మార్గ నిర్దేశం చేస్తున్నాయి.

**రామ కిష్టయ్య సంగన భట్ల,**
**సీనియర్ ఇండిపెండెంట్ జర్నలిస్ట్ కాలమిస్ట్...**
**9440595494**



# విమానం నుంచి అంతరిక్షం వరకు..

## మానవ చరిత్రలో ఒక అద్భుత యానం



జాతీయ విమాన యాన దినోత్సవం ప్రతి సంవత్సరం ఆగస్టు 19న ఘనంగా జరుపు కుంటారు. మానవ చరిత్రలో అత్యద్భుతమైన విప్లవ ఘట్టాల్లో ఒకటైన గగన యానం సాధనకు గుర్తుగా, విమాన యాన రంగంలో మార్గదర్శకుల కృషిని స్మరించుకునేందుకు ఈ రోజు ప్రత్యేకంగా నిలుస్తుంది. రైట్ బ్రదర్స్ 1903 డిసెంబర్ 17న తొలి విజయవంతమైన యాంత్రిక విమానాన్ని ఆకాశంలో ఎగరవేయడం ద్వారా మానవ కలలకు రెక్కలు వచ్చాయి. ఆర్విల్లే రైట్ జన్మదినం ఆగస్టు 19 కావడంతోనే అమెరికా అధ్యక్షుడు ఫ్రాంక్లిన్ డి. రూజ్‌వెల్ట్ 1939లో ఈ రోజును విమానయాన దినోత్సవంగా ప్రకటించారు. అప్పటి నుంచి ప్రపంచవ్యాప్తంగా విమానయాన రంగం సాధించిన పురోగతిని గుర్తు చేసుకుంటూ ఈ రోజును జరుపు కుంటున్నారు. భారతీయ సంస్కృతిలో గగనయాన భావన పూర్వం నుంచే ఉంది. రామాయణం లోని పుష్పక విమానం, మహాభారతం లోని దివ్య రథాలు మన పూర్వికుల ఊహా శక్తిని ప్రతిబింబిస్తాయి. శాస్త్రీయ యుగంలో ఆ కలలు వాస్తవ రూపం దాల్చాయి. భారత దేశంలో విమానయాన చరిత్ర 1911 ఫిబ్రవరి 18న అలహాబాద్ నుండి నైనికి పంపిన పోస్టల్ మెయిల్‌తో ప్రారంభమైంది. ఆ తర్వాత 1932 అక్టోబర్ 15న జె. ఆర్. డి. టాటా తన డీహావిలాండ్ పూసా–38 విమానం నడిపి కరాచీ నుండి మద్రాస్ వరకు పోస్టు, ప్రయాణికులను రవాణా చేయడం ద్వారా భారతీయ పౌర విమానయాన రంగానికి నూతన దారులు తీశారు. ఆయన ప్రారంభించిన టాటా ఎయిర్‌లైన్స్ తరువాత ఎయిర్ ఇండియాగా మారి దేశ గౌరవానికి ప్రతీకగా నిలిచింది. జె. ఆర్. డి. టాటా అందుకే భారతీయ పౌర విమానయాన పితామహుడిగా చిరస్థాయిగా గుర్తింపు పొందారు. స్వాతంత్ర్యం తరువాత భారత ప్రభుత్వం 1953లో ఎయిర్‌లైన్స్ జాతీయీకరణ చేసి ఎయిర్ ఇండియా ఇంటర్నేషనల్, ఇండియన్ ఎయిర్‌లైన్స్‌ను ఏర్పాటు చేసింది. 1990ల ఆర్థిక స్వేచ్ఛా విధానాల తరువాత ప్రైవేట్ రంగానికి అవకాశం లభించడంతో జెట్ ఎయిర్‌వేస్, సహారా, కింగ్‌ఫిషర్, స్పైస్ జెట్, ఇండిగో, విస్తారా వంటి విమానయాన సంస్థలు రంగప్రవేశం చేశాయి. ప్రస్తుతం ఇండిగో సంస్థ 60 శాతం మార్కెట్ వాటాతో భారత గగనంలో అగ్రస్థానంలో నిలిచింది. దేశవ్యాప్తంగా ప్రస్తుతం 148 ఆపరేషనల్ విమానాశ్రయాలు ఉన్నాయనే గణాంకం ఈ రంగం విస్తృతతను తెలియజేస్తుంది. ఢిల్లీ ఇందిరాగాంధీ అంతర్జాతీయ విమానాశ్రయం, ముంబై ఛత్రపతి శివాజీ మహారాజ్ విమానాశ్రయం, బెంగళూరు కేమ్పేగౌడ, హైదరాబాద్ రాజీవ్ గాంధీ అంతర్జాతీయ విమానాశ్రయాలు ప్రపంచస్థాయి సౌకర్యాలను కలిగి దేశ గర్వంగా నిలుస్తున్నాయి. 2017లో ప్రారంభమైన ఉడాన్ పథకం ద్వారా చిన్న పట్టణాలు, దూరప్రాంతాలు కూడా గగనతల రవాణాతో అనుసంధానమవడం సామాన్య ప్రజలకు విమాన ప్రయాణం అందుబాటులోకి తెచ్చింది. ఇప్పటివరకు 500కి పైగా కొత్త మార్గాలు ప్రారంభమైనట్లు ప్రభుత్వ గణాంకాలు చెబుతున్నాయి. రక్షణ రంగంలోనూ విమాన శక్తి భారత భద్రతకు కంచుకోటగా నిలిచింది. 1932లో స్థాపించబడిన భారత వైమానిక దళం స్వాతంత్ర్యం తరువాత అనేక యుద్ధాల్లో కీలక పాత్ర పోషించింది. 1965, 1971 యుద్ధాల్లోనూ, 1999 కార్గిల్ ఘర్షణలోనూ వాయుసేన ప్రదర్శించిన ధైర్య సాహసాలు చరిత్రలో నిలిచి పోయాయి. నేడు టెజాస్ వంటి స్వదేశీ యుద్ధ విమానాలతో పాటు సుఖోయ్–30 ఎంఎంకెఐ, రాఫేల్ వంటి ఆధునిక యంత్రాలు భారత రక్షణ శక్తికి బలాన్నిస్తున్నాయి. అంతరిక్ష పరిశోధనలోనూ విమాన శాస్త్రం పునాదిగా నిలిచింది. భారత అంతరిక్ష పరిశోధన సంస్థ (ఇస్రో) రూపకల్పన చేసిన ఉపగ్రహ ప్రయోగాలు, చాంద్రయాన్, మంగళయాన్ విజయాలు ప్రపంచ దృష్టిని ఆకర్షించాయి. త్వరలో జరగబోయే గగనయాన్ మిషన్ ద్వారా భారతీయులు అంతరిక్షంలో అడుగు పెట్టబోతున్న సందర్భం విమానయాన దినోత్సవానికి మరింత విశిష్టతనిస్తోంది. ప్రస్తుతానికి భారతీయ విమానయాన రంగం విస్తృతంగా అభివృద్ధి చెందుతోంది. రోజూ మూడు వేలకుపైగా విమానాలు దేశ ఆకాశంలో ఎగురుతున్నాయి.

2024లో 36 కోట్లకుపైగా ప్రయాణికులు విమాన సౌకర్యాలను వినియోగించుకున్నారని గణాంకాలు చెబుతున్నాయి. ఇండిగో ప్రపంచంలోనే అతిపెద్ద ూ320 నెరోబాడీ విమానాల వాహక సంస్థగా నిలిచింది. 2030 నాటికి అమెరికా, చైనాల తర్వాత భారతదేశం ప్రపంచంలో మూడవ అతిపెద్ద విమానయాన మార్కెట్‌గా మారబోతోందని నిపుణులు అంచనా వేస్తున్నారు. ఈ సమగ్ర పరిణామ క్రమం మనకు ఒక స్ఫూర్తిదాయక సందేశం ఇస్తోంది. జాతీయ విమానయాన దినోత్సవం కేవలం ఒక ఆవిష్కరణ జ్ఞాపక దినం మాత్రమే కాదు. అది మానవ మేధస్సు, ఆవిష్కరణ, ధైర్యసాహసాలకు ప్రతీక. దేశాల మధ్య ఆర్థిక, సాంస్కృతిక, రాజకీయ సంబంధాలను బలపరచడంలో విమానయానం కీలక పాత్ర పోషించింది. సామాన్య పౌరుడికి కూడా విమాన ప్రయాణం అందుబాటులోకి రావడం సామాజిక ఆర్థిక అభివృద్ధికి పునాదిగా నిలిచింది. జె. ఆర్. డి. టాటా నుంచి నేటి ఆధునిక గగనయాన్ వరకు, భారతదేశం విమానయాన రంగంలో నిరంతరం కొత్త శిఖరాలను అధిరోహిస్తోంది. "ఆకాశమే హద్దు" అన్న నమ్మకాన్ని మరింత బలపరుస్తూ జాతీయ విమానయాన దినోత్సవం ప్రతి భారతీయునికి గర్వకారణంగా నిలుస్తోంది.

రామ కిష్టయ్య సంగన భట్ల సీనియర్ ఇండిపెండెంట్ జర్నలిస్ట్ కాలమిస్ట్...9440595494

# పాపన్న ఆశయాలను కొనసాగిద్దాం

- సర్వాయి పాపన్న పోరాటం స్ఫూర్తిదాయకం
- కార్మికుల సంక్షేమానికి ప్రభుత్వం అండగా ఉంటుంది
- జిల్లా కలెక్టర్ చిత్రా మిశ్రా



**కరీంనగర్, ఆగస్టు18(సింగిడి):** సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ పోరాటం స్ఫూర్తిదాయకమని, ఆయన ఆశయాలను కొనసాగించాలని కలెక్టర్ చిత్రా మిశ్రా పిలుపునిచ్చారు. మంగళవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో సర్వాయి పాపన్న గౌడ్ 376వ జయంతి వేడుకలను నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ చిత్రా మిశ్రా, అదనపు కలెక్టర్ శ్రీనివాస్‌రెడ్డి, నగరపాలక సంస్థ కమిషనర్ ప్రఫుల్ దేశాయ్, అధికారులు, బీసీ, గౌడ సంక్షేమ సంఘాల నాయకులు సర్వాయి పాపన్న చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కలెక్టర్ మాట్లాడుతూ, కల్లుగీత కార్మికుల సంక్షేమానికి ప్రభుత్వం అండగా ఉంటుందని తెలిపారు. కార్మికులకు పరిహారం, కాటమయ్య రక్షణ పరికరాలు అందిస్తున్నట్లు చెప్పారు. ఏవైనా సమస్యలు ఉంటే తమ దృష్టికి తీసుకు రావాలని, పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. ఐక్యంగా పనిచేస్తూ నియోజకవర్గాల వారీగా సమస్యలను పరిష్కరించుకోవాలని సూచించారు. విద్య, ఉపాధి అవకాశాలను సద్వినియోగం చేసుకుని అన్ని రంగాల్లో అభివృద్ధి సాధించాలని, బాలికల విద్యకు ప్రాధాన్యం ఇచ్చి వారు ఉన్నత స్థానాలకు ఎదిగేలా ప్రోత్సహించాలని కోరారు. ఎక్సైజ్ శాఖ సమన్వయంతో జిల్లాలోని 3,412 మంది కల్లుగీత కార్మికులకు కాటమయ్య రక్షణ పరికరాలను అందించినట్లు కలెక్టర్ తెలిపారు. కమిషనర్ ప్రఫుల్ దేశాయ్ మాట్లాడుతూ, జనగామ జిల్లాలో సర్వాయి పాపన్న నిర్మించిన కోట ఆయన గొప్పతనానికి నిదర్శనమన్నారు. పాపన్న ఆశయాలు, జీవన విధానం, దూరదృష్టిని నేటి తరానికి తెలియజేయాలని సూచించారు. అదనపు కలెక్టర్ శ్రీనివాస్‌రెడ్డి మాట్లాడుతూ పాపన్న వంటి వీరులు అన్ని వర్గాలకు స్ఫూర్తిగా నిలుస్తారని పేర్కొన్నారు. కార్యక్రమంలో జిల్లా రెవెన్యూ అధికారి స్వామి, బీసీ సంక్షేమ శాఖ అధికారి అనిల్ ప్రకాష్, వివిధ శాఖల అధికారులు, గౌడ సంఘాల నాయకులు, ప్రతినిధులు పాల్గొన్నారు.

## ఆయిల్‌పాం సాగుపై రైతులు దృష్టి సారించాలి



- ఎల్‌నినో ప్రభావం నేపథ్యంలో ప్రత్యామ్నాయ పంటల వైపు రైతులను ప్రోత్సహించాలి
- మార్కెట్ కమిటీ చైర్మన్ నరసన్న

**కరీంనగర్, ఆగస్టు18(సింగిడి):** గ్రామాల్లోని సమస్యలను గుర్తించి సత్వరమే పరిష్కరించేందుకు మండల సమీక్ష సమావేశాలు దోహదపడతాయని కరీంనగర్ వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ ఆకుల నరసన్న అన్నారు. మంగళవారం రోజున కరీంనగర్ రూరల్ మండల పరిషత్ అభివృద్ధి అధికారి కార్యాలయంలో నిర్వహించిన సమీక్ష సమావేశానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా నరసన్న మాట్లాడుతూ, గ్రామాల వారీగా సమస్యలను సర్పంచులు అధికారుల దృష్టికి తీసుకురావాలని, వాటి పరిష్కారానికి అధికారులు, ప్రజాప్రతినిధులు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. రైతులు వరి సాగుపైనే ఆధారపడకుండా ఆరుతడి పంటలకు ప్రాధాన్యం ఇవ్వాలని కోరారు. ఎల్‌నినో ప్రభావం నేపథ్యంలో రాష్ట్ర ప్రభుత్వం ఆరుతడి పంటల సాగుపై ప్రత్యేక దృష్టి సారించిందని తెలిపారు. రైతుల్లో అవగాహన కల్పించే బాధ్యతను సర్పంచులు తీసుకోవాలని సూచించారు. అదేవిధంగా కరీంనగర్ రూరల్ మండలంలో అధిక ఆదాయం అందించే ఆయిల్‌పామ్ సాగును విస్తరించేలా రైతులను ప్రోత్సహించాలని అన్నారు. రైతుల సమస్యల పరిష్కారానికి మార్కెట్ కమిటీ తరఫున పూర్తి సహకారం అందిస్తామని, ధాన్యం కొనుగోళ్లతో పాటు అవసరమైన మౌలిక వసతుల కల్పనకు కృషి చేస్తామని తెలిపారు. రైతులు తమ సమస్యలను మార్కెట్ కమిటీ దృష్టికి తీసుకురావాలని కోరారు. సమావేశంలో రెవెన్యూ డివిజనల్ అధికారి షర్మిల, తహసీల్దార్ లక్ష్మీనరసింహారావు, మండల పరిషత్ అభివృద్ధి అధికారి అశోక్‌తో పాటు అధికారులు, సర్పంచులు పాల్గొన్నారు.

## వందేమాతరం అవమానంపై కాంగ్రెస్ క్షమాపణ చెప్పాలి

**సోనియా, ఖర్గే తీరుపై కేంద్ర మంత్రి బండి సంజయ్ ఆగ్రహం**



**కరీంనగర్, ఆగస్టు 18(సింగిడి):** వందేమాతరం గీతాన్ని సోనియాగాంధీ, మల్లికార్జున ఖర్గే అవమానించడం దేశానికే సిగ్గుచేటని కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్‌కుమార్ అన్నారు. మంగళవారం కరీంనగర్ టవర్ సర్కిల్ వద్ద మేయర్ కొలగాని శ్రీనివాస్, డిప్యూటీ మేయర్ సునీల్‌రావు, బీజేపీ నాయకులు, కార్యకర్తలతో కలిసి ఆయన మీడియాతో మాట్లాడారు. ఈ సందర్భంగా బండి సంజయ్ మాట్లాడుతూ, స్వాతంత్ర్య ఉద్యమంలో ప్రజల్లో స్ఫూర్తిని నింపిన వందేమాతరం గీతం పట్ల కాంగ్రెస్ వ్యవహరించిన తీరు భారతీయుల మనోభావాలను దెబ్బతీసేలా ఉందన్నారు. దేశభక్తిపైనా కాంగ్రెస్ ఆంక్షలు విధిస్తోందా అని ప్రశ్నించారు. వందేమాతరం చరిత్రను సోనియాగాంధీ తెలుసుకోవాలని, దేశం అభివృద్ధి చెందడమే కాకుండా దాని విలువలు, సంస్కృతి, వేల ఏళ్ల చరిత్రను గౌరవించాల్సిన అవసరం ఉందన్నారు. బ్రిటిష్ పాలకులను వందే మాతరం గీతం భయపెట్టిందని, ఇప్పుడు పూర్తి గీతం విషయంలో కాంగ్రెస్ భయపడుతోందని విమర్శించారు. కాంగ్రెస్ నాయకత్వం ఈ వ్యవహారంపై క్షమాపణ చెప్పాలని, ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి దీనిపై సమాధానం ఇవ్వాలని డిమాండ్ చేశారు. దేశంలో కాంగ్రెస్, ఎంఐఎం పార్టీలను ప్రజలు తిరస్కరించాలని బండి సంజయ్ పిలుపునిచ్చారు. ఎంఐఎంకు దేశభక్తి లేదని విమర్శిస్తూ, భారత్‌పై పాకిస్థాన్ విజయం సాధించిన సందర్భాల్లో కరీంనగర్‌లో సంబరాలు చేసుకున్న చరిత్ర ఆ పార్టీ నేతలదని ఆరోపించారు. ఈ విలేకరుల సమావేశం లో మేయర్ కోలగాని శ్రీనివాస్, ఉప మేయర్ సునీల్ రావు, కార్పొరేటర్స్ తదితరులు పాల్గొన్నారు.

## నిరుపయోగంగా వైకుంఠరథం

**మరమ్మతులు చేసి సేవలు అందించాలి**

**బీఆర్ఎస్ యూత్ నాయకులు బండారి ప్రశాంత్**



**జమ్మికుంట, ఆగస్టు 18 (సింగిడి):** జమ్మికుంట ఎంపీడీవో కార్యాలయం పక్కన కొన్ని సంవత్సరాలుగా వైకుంఠ రథాన్ని నిరుపయోగంగా ఉంచడం పట్ల ప్రజలు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. ప్రజలకు అత్యవసర సమయంలో ఉపయోగపడాల్సిన వైకుంఠ రథం ఇంతకాలం పక్కన పెట్టడం సరికాదని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వైకుంఠ రథాన్ని వెంటనే పరిశీలించి, అవసరమైన మరమ్మతులు చేపట్టి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని సంబంధిత అధికారులు చర్యలు తీసుకోవాలి. గ్రామీణ ప్రాంతాల్లో పేద, మధ్యతరగతి కుటుంబాలకు అంత్యక్రియల సమయంలో వైకుంఠ రథం ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని, అందువల్ల దాన్ని నిరుపయోగంగా ఉంచకుండా ప్రజా సేవకు వినియోగించాలని టిఆర్ఎస్ యూత్ నాయకులు బండారి ప్రశాంత్ ఒక ప్రకటనలో కోరారు. అధికారులు స్పందించి వైకుంఠ రథాన్ని వెంటనే వినియోగంలోకి తీసుకురావాలని బండారి ప్రశాంత్, వెంకటేశ్వర్లపల్లి గ్రామపంచాయతీ 3వ వార్డ్ మెంబర్ డిమాండ్ చేశారు.

## మైనర్ బాలికపై లైంగిక దాడి..

**నిందితుడికి 20 ఏళ్ల కఠిన కారాగార శిక్ష**

**భూపాలపల్లి జిల్లా ప్రధాన న్యాయమూర్తి జే. జీవన్ కుమార్ తీర్పు**




**జయశంకర్ భూపాలపల్లి బ్యూరో, ఆగస్టు 18 (సింగిడి):** మైనర్ బాలికపై లైంగిక దాడికి పాల్పడిన కేసులో నిందితుడికి 20 ఏళ్ల కఠిన కారాగార శిక్ష విధిస్తూ భూపాలపల్లి జిల్లా ప్రధాన న్యాయమూర్తి జే. జీవన్ కుమార్ మంగళవారం తీర్పు వెలువరించారు. కాటారం పోలీస్ స్టేషన్‌లో నమోదైన కేసులో ములుగు జిల్లా మల్లూరు శివారు మొట్లగూడెం గ్రామానికి చెందిన ఎలగొండ నవీన్‌పై నేరం రుజువు కావడంతో కోర్టు ఈ శిక్ష విధించింది. మల్హర్‌రావు మండలానికి చెందిన మైనర్ బాలిక హనుమకొండలో ఇంటర్ చదువుతున్న సమయంలో నవీన్‌కు ఇన్‌స్టాగ్రామ్ ద్వారా పరిచయమైంది. ప్రేమిస్తున్నానని నమ్మించి, పెళ్లి చేసుకుందామని చెప్పి 2021 ఏప్రిల్ 3న బాలికను ఇంటి నుంచి పిలిపించాడు. కాటారం మండలం బస్వాపూర్‌కు చేరుకున్న బాలికను ములుగు జిల్లా పస్రా మీదుగా బర్లగూడెంలోని తన స్నేహితుడి ఇంటికి తీసుకెళ్లి మూడు రోజుల పాటు నిర్బంధించి లైంగిక దాడికి పాల్పడ్డాడు. అనంతరం తన స్వగ్రామమైన మొట్లగూడెంకు తీసుకెళ్లి మరో రెండు రోజుల పాటు అదే విధంగా దాడికి పాల్పడ్డాడు.

**పటిష్ట ఆధారాలతో చార్జ్‌షీట్**

కుమార్తె కనిపించకపోవడంతో బాధితురాలి తండ్రి కాటారం పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా, అప్పటి కాటారం ఎస్ఐ సాంబమూర్తి కేసు నమోదు చేశారు. అప్పటి కాటారం డీఎస్పీ బోనాల కిషన్ దర్యాప్తు చేపట్టి నిందితుడిని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. అనంతరం పటిష్టమైన సాక్ష్యాధారాలతో చార్జ్‌షీట్ దాఖలు చేశారు. కోర్టు విచారణలో లైజన్ ఆఫీసర్ జి. వెంకన్న ఆధ్వర్యంలో కోర్టు డ్యూటీ ఆఫీసర్ కె. రమేష్ సాక్షులను హాజరుపరిచారు. స్పెషల్ పబ్లిక్ ప్రాసిక్యూటర్లు ఎన్. విష్ణువర్ధన్ రావు, వెంకట్రామ్ సమర్థవంతంగా వాదనలు వినిపించారు. సాక్ష్యాధారాలను పరిశీలించిన న్యాయస్థానం నిందితుడిపై నేరం రుజువైనట్లు నిర్ధారించి 20 ఏళ్ల కఠిన కారాగార శిక్ష విధించింది.

**పోలీసు అధికారులకు ఎస్పీ అభినందనలు**

కేసులో నిందితుడికి శిక్ష పడేలా సమర్థవంతంగా పనిచేసిన ప్రస్తుత కాటారం డీఎస్పీ సూర్యనారాయణ, సీఐ నాగార్జునరావు, ఎస్ఐ శ్రీనివాస్, కోర్టు మానిటరింగ్ ఆఫీసర్ పీసీఆర్ ఇన్‌స్పెక్టర్ రాజు, లైజన్ ఆఫీసర్ జి. వెంకన్న, కోర్టు డ్యూటీ ఆఫీసర్ కె. రమేష్, లీగల్ సపోర్ట్ ఆఫీసర్ జి. రజితతో పాటు అప్పటి దర్యాప్తు అధికారులను జిల్లా ఎస్పీ సిరిశెట్టి సంకీర్త్, ఐపీఎస్ ప్రత్యేకంగా అభినందించారు.

## 8వ తరగతి విద్యార్థి సృష్టిసాయి వినూత్న ఆవిష్కరణ

**వైఫైతో జాతీయ జెండా ఎగరవేసిన బాల మేధావి**

**సృష్టి సాయిని అభినందించిన మాజీ స్పీకర్, ఎమ్మెల్సీ మధుసూదనాచారి**



**జమ్మికుంట, ఆగస్టు18 (సింగిడి):** చిన్న వయస్సులోనే గొప్ప ఆలోచనతో అందరి ప్రశంసలు అందుకుంటున్నాడు. జమ్మికుంట పట్టణంలోని కాకతీయ విద్యాలయంలో 8వ తరగతి చదువుతున్న విద్యార్థి కాటిపెల్లి సృష్టి సాయి. సాధారణంగా తాడుతో జాతీయ జెండాను ఎగరవేయడం ఆనవాయితీ కాగా, సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించి వైఫై ద్వారా జెండాను ఎగరవేసే విధానాన్ని రూపొందించాడు. చిన్న వయసులోనే సాంకేతికతపై ఆసక్తిని పెంచుకుని, తన ఆలోచనను ఆచరణలో పెట్టడం విశేషంగా నిలిచింది. వైఫై సిగ్నల్ ఆధారంగా పనిచేసే పరికరాన్ని రూపొందించి, దాని ద్వారా జెండా ఎగరవేత వ్యవస్థను నియంత్రించేలా విద్యార్థి ప్రయోగం చేశాడు. మొబైల్ లేదా ఇతర నియంత్రణ పరికరం నుంచి వైఫై ద్వారా సంకేతం పంపగానే మోటార్ పనిచేసి జాతీయ జెండా పైకి ఎగిరేలా వ్యవస్థను రూపొందించినట్లు సృష్టి సాయి తెలిపారు.

**విద్యార్థి సృష్టి సాయిని అభినందించిన మాజీ స్పీకర్, ఎమ్మెల్సీ మధుసూదనాచారి..**

సృష్టి సాయి చిన్నతనంలోనే వినూత్న ఆలోచనలతో ఆవిష్కరణలు చేస్తున్న విషయాన్ని స్థానికుల ద్వారా తెలుసుకున్న మాజీ స్పీకర్, ఎమ్మెల్సీ మధుసూదనాచారి సోమవారం రాత్రి జమ్మికుంట లోని సృష్టి సాయి ఇంటికి వెళ్లి సృష్టి సాయి వినూత్న ఆవిష్కరణలను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ మధుసూదనాచారి మాట్లాడుతూ... జమ్మికుంట పట్టణానికి చెందిన కాటిపెల్లి రాజు తనకు గత కొన్ని ఏళ్లుగా సుపరిచితుడని, రాజు కుమారుడు సృష్టిసాయి చిన్న వయస్సులోనే సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించి వైఫైతో జాతీయ జెండా ఎగరవేయడం గర్వించదగిన విషయమని అన్నారు. సృష్టి సాయి వంటి విద్యార్థులు ఇతరులకు ఆదర్శంగా నిలుస్తారని, చిన్న ఆలోచనలే పెద్ద ఆవిష్కరణలకు నాంది పలుకుతాయని, శాస్త్రవేత్తల వినూత్న ఆలోచనా విధానాన్ని ఆదర్శంగా తీసుకుని ముందుకు సాగే విద్యార్థులే దేశ భవిష్యత్తుకు బలమైన పునాదులుగా నిలుస్తారని అన్నారు. విద్యార్థుల్లో ఉన్న సృజనాత్మకతకు సరైన ప్రోత్సాహం లభిస్తే భవిష్యత్తులో మరెన్నో గొప్ప ఆవిష్కరణలు వెలుగులోకి వచ్చే అవకాశం ఉంటుందన్నారు. విద్యార్థి సృష్టిసాయి ప్రతిభను కొనియాడుతూ, భవిష్యత్తులో మరిన్ని వినూత్న ఆవిష్కరణలు చేసి ఉన్నత స్థాయికి చేరుకోవాలని ఆకాంక్షించారు. సృష్టిసాయి వినూత్న ఆవిష్కరణలకు తన వంతు ఆర్థిక సహకారం అందిస్తానని హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా వినూత్న ఆవిష్కరణలు చేస్తున్న సృష్టి సాయి మాట్లాడుతూ... “శాస్త్రవేత్తలు కొత్త ఆవిష్కరణలు చేయడానికి సమస్యలను గుర్తించి వాటికి పరిష్కారాలు వెతుకుతారు. నేను కూడా రైతులకు, సమాజానికి, దేశానికి ఉపయోగపడే ఆలోచనలు చేయాలని కోరుకుంటున్నాను. ప్రయోగాలు చేయడం అంటే నాకు చాలా ఇష్టం. అందుకోసమే నేను ఏఐని నేర్చుకున్నాను. ముఖ్యంగా కోడింగ్ పై పూర్తిస్థాయి అవగాహన పెంచుకొని వినూత్న ఆవిష్కరణలకు శ్రీకారం చుట్టాను నా తల్లిదండ్రులు, కుటుంబ సభ్యులు, ఏఐ నిర్వాహకులు గంప నాగేశ్వరరావు, ఉదయ్ కుమార్, అంజిరెడ్డి, కిరణ్ సహకారంతో భవిష్యత్తులో గొప్ప శాస్త్రవేత్తగా ఎదిగి దేశానికి సేవ చేయాలనేదే నా “లక్ష్యం” అని తెలిపాడు.

## “సర్వాయి” పోరాటం స్ఫూర్తిదాయకం

**ఇల్లందకుంట దేవస్థానం మాజీ చైర్మన్ దేశిని కోటి గౌడ్**

**ఘనంగా పాపన్న జయంతి వేడుకలు**



**జమ్మికుంట, ఆగస్టు 18 (సింగిడి):** సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ పోరాటం స్ఫూర్తిదాయకమని ఆయన ఆశయాలను అందరం కొనసాగిద్దామని ఇల్లంతకుంట దేవస్థానం మాజీ చైర్మన్ కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు దేశిని కోటి పిలుపునిచ్చారు. మంగళవారం జమ్మికుంట మున్సిపల్ పరిధిలోని ఇందిరానగర్ స్టేజి వద్ద గల సర్వాయి పాపన్న విగ్రహానికి పూలమాలవేసి పాపన్న గౌడ్ 376 వ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా జమ్మికుంట మున్సిపల్ చైర్మన్ ప్రశాంత్ కుమార్ మార్కెట్ కమిటీ చైర్మన్ పుల్లూరి స్వప్న సదానందం వైస్ చైర్మన్ ఎర్రం సతీష్ రెడ్డి దుబ్బ మల్లన్న ఆలయ చైర్మన్ రవీందర్ బిజెపి నాయకులు ఆకుల రాజేందర్ కనుమల్ల గణపతి కార్మిక సంఘం నాయకులు సామ్రాజ్యం బిజెపి పట్టణ అధ్యక్షుడు కోలకాని రాజు కౌన్సిలర్లు శ్రీపతి నరేష్ గౌడ్ మాచర్ల రాజు గుర్రం కావ్య పరశురాం గౌడ్ తిరుపతి బత్తుల లక్ష్మణ్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా దేశిని కోటి మారెల్లి మల్లయ్య గౌడ్ మున్సిపల్ చైర్మన్ ప్రశాంత్ కుమార్ మాట్లాడుతూ, సర్దార్ సర్వాయి పాపన్న భూస్వాముల పెత్తందారుల అరాచకాలు చూడలేక వాళ్ళు వసూలు చేస్తున్న పనులతో ఇబ్బంది పడుతున్న ప్రజల కోసం తిరుగుబాటు చేసి మొగల్ సామ్రాజ్యాన్ని వారి సైనికులను తరిమికొట్టి ఇక్కడే కాదు ఈ ప్రాంతం మొత్తం ఇలాగే ఉందని తెలుసుకొని 12 మంది మిత్రుల తో మొదలైన సైన్యం 12000 మందితో గెరిల సైన్యాన్ని తయారుచేసి గోల్కొండ ఖిల్లా పై యుద్ధం చేసి మొదటి సామ్రాజ చక్రవర్తనం మట్టిగరిపించిన మహనీయుడు సర్దార్ పాపన్న గౌడ్ అని పేర్కొన్నారు. మొగల్ సామ్రాజ్యం చక్రవర్తులను మట్టికరిపించి రాజుగా సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ పరిపాలించి భూస్వాములను పెత్తందారుల నూకల సామ్రాజ్యాన్ని అక్రమ పన్నువసూలు చేయకుండా ప్రజల స్వతంత్రంగా హక్కులు కల్పిస్తూ పరిపాలన సాగించాడని తెలిపారు. సర్వాయి పాపన్న జయంతి సందర్భంగా రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ గౌడ్ ఆధ్వర్యంలో హైదరాబాద్ నడిబొడ్డులో ట్యాంక్బండ్ వద్ద పాపన్న గౌడ్ విగ్రహాన్ని ఆవిష్కరించడం శుభ సూచకమని అన్నారు. ఇలాంటి మహత్తర కార్యక్రమానికి శ్రీకారం చుట్టిన రాష్ట్ర ప్రభుత్వానికి వారు కృతజ్ఞతలు తెలిపారు. ప్రతి ఒక్కరూ సర్వాయి పాపన్న ఆశయ సాధనకు పాటుపడాలని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ డైరెక్టర్లు గడ్డం దీక్షిత్ రాజేశ్వరరావు గౌడ సంఘం నాయకులు నాగపురి రాజు ప్రభాకర్ రాజు నాయకులు పూదరి రేణుక శివ కుమార్ గౌడ్ బొంగుని వీరన్న మారేపల్లి బిక్షపతి శ్రీహరి పంజాల అజయ్ దేశ శ్రీనివాస్ పున్నమి శ్రీను పాత ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా సర్దార్ సర్వాయి పాపన్నగౌడ్ జయంతి వేడుకలు



**జయశంకర్ భూపాలపల్లి బ్యూరో, ఆగస్టు 18 (సింగిడి):** సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ 376వ జయంతి వేడుకలను జయశంకర్ భూపాలపల్లి జిల్లా బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. జిల్లా బార్ అసోసియేషన్ కార్యాలయంలో పాపన్న గౌడ్ చిత్రపటానికి పూలమాల వేసి న్యాయవాదులు ఘనంగా నివాళు లర్పించారు. ఈ సందర్భంగా బార్ అసోసియేషన్ అధ్యక్షుడు కూనూరు సురేష్ కుమార్ మాట్లాడుతూ.. సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ బహుజనుల పక్షాన పోరాడిన మహనీయుడని కొనియాడారు. ఆత్మగౌరవం, సామాజిక సమానత్వం కోసం ఆనాటి మొఘల్ పాలకుల అణచివేతకు వ్యతిరేకంగా ధైర్యంగా పోరాడారని తెలిపారు. జనగామ జిల్లా ఖిలాషాపూర్ గ్రామంలో గౌడ కుటుంబంలో జన్మించిన పాపన్న గౌడ్, తన కులవృత్తిని కొనసాగిస్తూనే ఆనాటి పాలకుల అణచివేత, అవమానాలకు వ్యతిరేకంగా బహుజనులను ఏకతాటిపైకి తీసుకువచ్చారని పేర్కొన్నారు. చిన్న సైన్యాన్ని ఏర్పాటు చేసుకుని అనేక కోటలను జయించి తన వీరత్వాన్ని చాటుకున్నారని అన్నారు. గోల్కొండ కోటను సైతం స్వాధీనం చేసుకుని తన పరాక్రమాన్ని, ఆత్మగౌరవాన్ని చాటుకున్న వీరుడు పాపన్న గౌడ్ అని పేర్కొన్నారు. సామాజిక సమానత్వం, బహుజనుల ఆత్మగౌరవం, స్వేచ్ఛ కోసం పాపన్న గౌడ్ చేసిన పోరాటం నేటి తరానికి స్ఫూర్తిదాయకమని సురేష్ కుమార్ అన్నారు. ఈ కార్యక్రమంలో బార్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి ఆకుల రాములు, లేడీ జాయింట్ సెక్రటరీ కంప అక్షయ, ట్రెజరర్ ఇందారపు శివకుమార్, లేడీ ఈసీ మెంబర్ వసంత, న్యాయవాదులు పైతర అజయ్, రాకేష్, ప్రశాంత్ తదితరులు పాల్గొన్నారు.

## పాపన్న గౌడ్ పోరాటం చిరస్మరణీయం

**పాపన్న ఆశయాలను కొనసాగించాలి**

**మున్సిపల్ చైర్మన్ ప్రశాంత్ కుమార్**



**జమ్మికుంట, ఆగస్టు 18 (సింగిడి):** సర్దార్ సర్వాయి పాపన్న 376 జయంతి పురస్కరించుకొని సర్దార్ సర్వాయి పాపన్న మోకు దెబ్బ గౌడ సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు గండి రంజిత్ కుమార్ గౌడ్ ఆధ్వర్యంలో జమ్మికుంట పట్టణంలో గల శివాలయంలో మహా అన్నదాన కార్యక్రమం తో పాటు జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మున్సిపల్ చైర్మన్ ప్రశాంత్ కుమార్, కేడీసీసీ బ్యాంకు వైస్ చైర్మన్ పింగిలి రమేష్, ప్రాథమిక సహకార సంఘం అధ్యక్షులు పొన్నగంటి సంపత్, మాజీ మార్కెట్ చైర్మన్ పోలేని సత్యనారాయణ రావు మాట్లాడుతూ తెలంగాణ ప్రాంతంలో సామాజిక సమానత్వం అణగారిన వర్గాల హక్కుల కోసం సర్వాయి పాపన్న గౌడ్ చేసిన పోరాటం చిరస్మరణీయమని పేర్కొన్నారు. సర్వాయి పాపన్న ఆశయాలను కొనసాగిస్తూ భావితరాలకు బంగారు బాటలు వేసిన విధంగా ప్రతి ఒక్కరు ముందుకు సాగాలని అభివర్ణించారు. పట్టణంలోని గాంధీ చౌరస్తా వద్ద సర్వాయి పాపన్న చిత్రపటానికి పూలమాల సమర్పించి ఘన నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో, బిజెపి పట్టణ శాఖ అధ్యక్షులు కొలకాని రాజు, కనుమల్ల గణపతి, ఆకుల రాజేందర్ , కోరపల్లి మాజీ ఎంపీటీసీ సభ్యులు తాళ్లపల్లి శ్రీనివాస్ గౌడ్ ,గండి యాదగిరి, మొగిలిపాక లక్ష్మణ్ గౌడ్, పల్లె శ్రీనివాస్ గౌడ్ ,బండా వెంకన్న, కారుపాకల వెంకన్న తోపాటు తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా సర్దార్ సర్వయ్ పాపన్న గౌడ్ జయంతి వేడుకలు



**వికారాబాద్, ఆగస్టు 18(సింగిడి):** నిజాం నిరంకుశ పాలను వ్యతిరేకస్తూ తిరుగు బాటు చేసిన సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ 376 వ జయంతిని మంగళవారం జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్ లోని బీసీ సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భం గా జిల్లా కలెక్టర్ దీపక్ తివారి పాపన్నాగౌడ్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళ్ళు అర్పించారు. సర్వాయి సేవలను కొనియాడారు. అదేవిధంగా ఆయా పట్టణాలల్లో జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భం గా పలువురు మాట్లాడుతూ నిజాం పాలనను స్వీయ సైన్యంతో ఎదిరించిన వీరుడని అన్నారు. ఆయన స్ఫూర్తితో గౌడ సామాజిక వర్గం ఐక్యం కావాలని అన్నారు. అన్నిరంగాల్లో రాజించి సర్వాయి పాపన్న కళలను సాకారం చేయాలని పిలుపునిచ్చారు. వికారాబాద్ లో నిర్వహించిన కార్యక్రమంలో నాయకులు మల్లికార్జున్ గౌడ్, బీసీ సంక్షేమ అధికారి మాధవరెడ్డి, గౌడ సంఘం నాయకులు వెంకటయ్య గౌడ్, చిన్నయ్య గౌడ్, బుచ్చిరామ్ గౌడ్, కృపాకర్ గౌడ్, వరకుమార్ తదితరులు పాల్గొన్నారు.

## ముత్యాలమ్మ పండుగ.. భక్తుల కోలాహలం



- బోనాలతో తరలివచ్చిన మహిళలు..
- పూజలు చేసిన మాజీ ఎమ్మెల్యే బొల్లం

**కోదాడ, ఆగష్టు 18 (సింగిడి):** అనంతగిరి మండలంలోని చనుపల్లి, అమీనాబాద్ గ్రామాల్లో ముత్యాలమ్మ పండుగను ఆదివారం భక్తిశ్రద్ధలతో ఘనంగా నిర్వహించారు. మహిళలు బోనాలు ఎత్తుకొని అమ్మవారి ఆలయాలకు చేరుకుని ప్రత్యేక పూజలు నిర్వహించి మొక్కులు చెల్లించుకున్నారు. ఈ వేడుకల్లో కోదాడ మాజీ ఎమ్మెల్యే బొల్లం మల్లయ్యయాదవ్ పాల్గొని అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రజలు ఆయురారోగ్యాలతో, సుఖసంతోషాలతో ఉండాలని, సకాలంలో వర్షాలు కురిసి పంటలు సమృద్ధిగా పండాలని అమ్మవారిని ప్రార్థించారు. పండుగ సందర్భంగా ఆలయాల వద్ద భక్తులు పెద్ద సంఖ్యలో తరలిరావడంతో సందడి నెలకొంది. మహిళలు సంప్రదాయబద్ధంగా బోనాలు సమర్పించి అమ్మవారిని దర్శించుకున్నారు. గ్రామాల్లో ఆధ్యాత్మిక వాతావరణం నెలకొనగా, జాతర సందర్భంగా ప్రజలు పరస్పరం శుభాకాంక్షలు తెలుపుకున్నారు. బిఆర్ఎస్ మండల అధ్యక్షులు నల్లా భూపాల్ రెడ్డి పాల్గొన్నారు.

## చెరువులో దూకి ఆత్మహత్యకు యత్నించిన మహిళను కాపాడిన బ్లూకోల్ట్ సిబ్బంది



- పోలీలను అభినందించిన జిల్లా ఎస్పీ స్నేహ మెహ్రా

**వికారాబాద్, ఆగష్టు 18 (సింగిడి):** జిల్లా పరిధిలోని దౌల్తాబాద్ గ్రామానికి చెందిన ఓ మహిళ కుటుంబం వ్యక్తిగత సమస్యల కారణంగా తీవ్ర మనస్తాపానికి గురై ఆత్మహత్య చేసుకోవాలని నిర్ణయించుకున్నారు. ఈ క్రమంలో ఆదివారం ఆమె ఏడుస్తూ దౌల్తాబాద్ చెరువు వైపు వెళ్తుండగా, బ్లూకోల్ట్ విధుల్లో ఉన్న పీసీ చంద్రశేఖర్, పీసీ రాఘవేందర్ ఆమెను గమనించారు. ఆమె చెరువులో దూకేందుకు ప్రయత్నిస్తున్న విషయాన్ని గుర్తించిన పోలీసు సిబ్బంది వెంటనే స్పందించి, ఆమెను అడ్డుకుని కాపాడారు. అనంతరం ఆమెకు ధైర్యం చెప్పి కౌన్సెలింగ్ నిర్వహించి, కుటుంబ సభ్యుల వద్దకు సురక్షితంగా తీసుకెళ్లారు. సమయస్ఫూర్తితో స్పందించి ఒక ప్రాణాన్ని కాపాడిన బ్లూకోల్ట్ సిబ్బంది పోలీస్ కానిస్టేబుల్ చంద్రశేఖర్, పోలీస్ కానిస్టేబుల్ రాఘవేందర్‌లను వికారాబాద్ జిల్లా ఎస్పీ స్నేహ మెహ్రా అభినందించారు. ఆపదలో ఉన్న వారికి మానవతా దృక్పథంతో స్పందించి సహాయం చేయడం పోలీసుల బాధ్యత అని ఎస్పీ పేర్కొన్నారు.

## సుమని హెల్త్ అండ్ రిహాబిలిటేషన్ క్లినిక్ ప్రారంభం



- పేదలకు నాణ్యమైన వైద్యం అందించాలి
- ఎమ్మెల్యే అరేకపూడి గాంధీ

**కూకట్ పల్లి, ఆగష్టు 18 (సింగిడి):** పేదలకు నాణ్యమైన వైద్యం అందించాలని శేరిలింగంపల్లి ఎమ్మెల్యే ఆరెకపూడి గాంధీ అన్నారు. ఆల్విన్ కాలనీ పరిధిలోని హనుమాన్ నగర్‌లో 'సుమని హెల్త్ అండ్ రిహాబిలిటేషన్ క్లినిక్' ను ఆదివారం ఆయన ప్రారంభించారు. ఈ ప్రారంభోత్సవ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ ఉప్పలపాటి శ్రీకాంత్, సీనియర్ నాయకులు చంద్రకాంత్ రావు, జిల్లా గణేష్ తదితరులు ప్రత్యేక అతిథులుగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే అరేకపూడి గాంధీ క్లినిక్ యజమాని, వైద్యురాలు డాక్టర్ సుకన్యను అభినందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. హనుమాన్ నగర్ మరియు చుట్టుపక్కల ప్రాంతాలలో పేద, మధ్యతరగతి కుటుంబాలు ఎక్కువగా నివసిస్తున్నాయని, వారందరికీ అందుబాటు ధరల్లో నాణ్యమైన వైద్య సేవలు అందించాలని సూచించారు. ఒకే చోట జనరల్ ఫిజిషియన్, స్పీచ్ థెరపీ, ఫిజియోథెరపీ వంటి ప్రత్యేక వైద్య సేవలు అందుబాటులో ఉంచడం అభినందనీయమని అన్నారు. వైద్యులు రోగులతో సానుకూలంగా మాట్లాడుతూ మెరుగైన వైద్యం అందించి ప్రజల మన్ననలు పొందాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో పలువురు కాలనీ పెద్దలు, వివిధ వైద్య నిపుణులు, స్థానిక నాయకులు, ప్రజలు పాల్గొన్నారు.

## పార్టీ బలోపేతానికి నాయకులు, కార్యకర్తలు సమన్వయంతో పని చేయాలి

### ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్ రెడ్డి

### బీఆర్ఎస్‌లో చేరిన గౌతమ్ నగర్ డివిజన్ యువకులు



**మల్కాజిగిరి, ఆగష్టు 18 (సింగిడి):** బిఆర్ఎస్ పార్టీ అధికారంలో లేకపోయినా, ప్రతిపక్షంలో ఉన్నప్పటికీ మల్కాజిగిరి నియోజకవర్గం లోని ప్రజలకు దగ్గరగా ఉంటూ ప్రభుత్వం ఇచ్చి అనేక సంక్షేమ పథకాలను ప్రజలకు చేరవేస్తున్నామని, బిఆర్ఎస్ పార్టీ బలోపేతానికి నాయకులు, కార్యకర్తలు, సమన్వయంతో పనిచేయాలని మల్కాజిగిరి ఎమ్మెల్యే రాజశేఖర్ రెడ్డి పిలుపునిచ్చారు. గౌతమ్ నగర్ డివిజన్ బిఆర్ఎస్ నాయకులు మాశెట్టి అనిల్ కుమార్ ఆధ్వర్యంలో మల్కాజిగిరి సర్కిల్ గౌతమ్ నగర్ డివిజన్ పరిధిలోని వివిధ పార్టీ లకు చెందిన పలువురు యువకులు బిఆర్ఎస్ పార్టీ లో చేరారు. వారికి ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్ గులాబీ కండువా కప్పి బిఆర్ఎస్ పార్టీ లోకి ఆహ్వానించారు. ఈ కార్యక్రమం లో బిఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

# బాధితులకు న్యాయం జరిగేలా ప్రత్యేక శ్రద్ధ వహించాలి

- నేరాల నియంత్రణకు సమర్థవంతమైన దర్యాప్తు
- పెండింగ్ కేసుల పరిష్కారం, నిందితులకు శిక్షలపై ప్రత్యేకదృష్టి
- సీపీ గౌష్ ఆలం



**కరీంనగర్, ఆగష్టు 18(సింగిడి):** కరీంనగర్ పోలీస్ కమిషనరేట్‌లో జూలై నెల నేర సమీక్ష సమావేశాన్ని పోలీస్ కమిషనర్ గౌష్ ఆలం అధ్యక్షతన నిర్వహించారు. నేరాల నియంత్రణ, దర్యాప్తు పురోగతి, పెండింగ్ కేసుల పరిష్కారం, కోర్టు కేసుల్లో శిక్షల శాతం పెంపు, మహిళలు, చిన్నారులపై నేరాల నియంత్రణ, సైబర్ నేరాలు, మాదకద్రవ్యాల నిర్మూలన, ట్రాఫిక్ నిర్వహణపై సమీక్షించారు. ఈ సందర్భంగా సీపీ మాట్లాడుతూ నేరం జరిగిన వెంటనే శాస్త్రీయ ఆధారాలతో సమర్థవంతంగా దర్యాప్తు చేసి నిందితులకు శిక్ష పడేలా పోలీసులు, ప్రభుత్వ న్యాయవాదులు, న్యాయస్థాన విధుల అధికారులు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. పెండింగ్ కేసులను త్వరితగతిన పరిష్కరించాలని, కోర్టు విచారణలో ఉన్న కేసుల్లో సాక్ష్యాలు, అభియోగపత్రాలు, ఇతర న్యాయపరమైన అంశాలను నిరంతరం పర్యవేక్షించాలని ఆదేశించారు. మహిళలు, చిన్నారులపై నేరాలు, లైంగిక దాడులు, పోక్సో కేసుల్లో దర్యాప్తును వేగవంతం చేసి బాధితులకు న్యాయం జరిగేలా ప్రత్యేక శ్రద్ధ వహించాలని తెలిపారు. సైబర్ నేరాల బాధితులకు సాధ్యమైనంత త్వరగా నగదు తిరిగి అందేలా చర్యలు తీసుకోవడంతో పాటు, నిందితులపై కఠిన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. పోగొట్టుకున్న సెల్‌ఫోన్లను కేంద్ర పరికరాల గుర్తింపు వ్యవస్థ ద్వారా గుర్తించి బాధితులకు అప్పగించే ప్రక్రియను వేగవంతం చేయాలని సూచించారు. మాదకద్రవ్యాలు, గుట్కా, పేకాట, అక్రమ ఇసుక రవాణా వంటి చట్టవిరుద్ధ కార్యకలాపాలపై నిఘా పెంచాలని, ట్రాఫిక్ నిబంధనల అమలుతో పాటు రోడ్డు ప్రమాదాల నివారణకు ప్రత్యేక చర్యలు చేపట్టాలని సీపీ ఆదేశించారు.

**15 కేసుల్లో శిక్షలు...**

జూలైలో 15 ప్రధాన కేసుల్లో నిందితులకు శిక్షలు పడేలా ప్రభుత్వ న్యాయవాదులు సమర్థవంతంగా పనిచేశారని సీపీ గౌష్ ఆలం అభినందించారు. అడిషనల్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ డి. శరత్ 6 కేసులు, పబ్లిక్ ప్రాసిక్యూటర్ ఎం. ప్రతాప్ 5 కేసులు, అసిస్టెంట్ పబ్లిక్ ప్రాసిక్యూటర్లు ఎ. రంజిత్ కుమార్, జి. వీరస్వామి చెరో 2 కేసులు, గాయత్రి ఒక కేసులో శిక్షలు సాధించడంలో కీలక పాత్ర పోషించారు. ఆయా కేసుల్లో జీవిత ఖైదు నుంచి 18 నెలల వరకు వివిధ కాలాల జైలు శిక్షలు విధించబడ్డాయి. ఈ సందర్భంగా సంబంధిత ప్రభుత్వ న్యాయవాదులకు సీపీ ప్రశంసా పత్రాలు అందజేశారు. బాధితులకు న్యాయం అందించేందుకు దర్యాప్తు నుంచి కోర్టు తీర్పు వరకు ప్రతి దశలో సమన్వయాన్ని మరింత బలోపేతం చేయాలని సూచించారు. సమావేశంలో అదనపు డీసీపీ వెంకటరమణ, న్యాయశాఖ అధికారులు, ప్రభుత్వ న్యాయవాదులు, ఏసీపీలు, ఇన్‌స్పెక్టర్లు, కోర్టు విధుల అధికారులు, ఇతర పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

## ఉచిత శిక్షణ అందించడం.. ఉద్యోగ సాధనకు మార్గం

### రాష్ట్ర ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షుడు చిన్నారెడ్డి





**వనపర్తి ప్రతినిధి, ఆగష్టు 18(సింగిడి):** పేద కుటుంబాలకు చెందిన యువతకు పోటీ పరీక్షలపై ఉచిత శిక్షణ అందించడం ఉద్యోగ సాధనకు మార్గం చూపుతోందని రాష్ట్ర ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షుడు డాక్టర్ జిల్లెల చిన్నారెడ్డి అన్నారు. పరవస్తు క్రియేటివ్ ఫౌండేషన్ వ్యవస్థాపకులు మధుకర్ స్వామి ఆధ్వర్యంలో సబ్‌ఇన్‌స్పెక్టర్, కానిస్టేబుల్ ఉద్యోగాల కోసం నిర్వహించనున్న ఉచిత ప్రీ-రిక్రూట్‌మెంట్ శిక్షణకు తెలంగాణ రాష్ట్రవ్యాప్తంగా 11 కేంద్రాల్లో ఎలిజిబిలిటీ టెస్ట్ నిర్వహించారు. ఇందులో భాగంగా ఉమ్మడి మహబూబ్ నగర్ జిల్లాకు చెందిన అభ్యర్థుల కోసం వనపర్తి జిల్లా కేంద్రంలోని రేడియంట్ కాన్సెప్ట్ స్కూల్ లో ఆదివారం పరీక్ష నిర్వహించగా సుమారు 500 మంది అభ్యర్థులు హాజరయ్యారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా తెలంగాణ రాష్ట్ర ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షులు డాక్టర్ జిల్లెల చిన్నారెడ్డి హాజరై అభ్యర్థులకు పరీక్షా పత్రాలను పంపిణీ చేసి పరీక్షను ప్రారంభించారు. ఈ సందర్భంగా చిన్నారెడ్డి మాట్లాడుతూ 2005 నుంచి ఇప్పటివరకు మధుకర్ స్వామి, గద్దె భాస్కర్ లు విద్యార్థులు, నిరుద్యోగ యువతకు అందిస్తున్న సేవలను ప్రత్యేకంగా ఆయన ప్రశంసించారు. గ్రామీణ, పేద, మధ్యతరగతి కుటుంబాలకు చెందిన యువతకు పోటీ పరీక్షలపై అవగాహన కల్పిస్తూ వారికి ఉచిత శిక్షణ అందించడం అభినందనీయమని అన్నారు. ప్రభుత్వ ఉద్యోగాల కోసం సిద్ధమవుతున్న యువతకు ఆర్థిక భారం లేకుండా నాణ్యమైన శిక్షణ అందించడం సామాజిక బాధ్యతతో కూడిన గొప్ప కార్యక్రమమని ఆయన కొనియాడారు. ఇలాంటి సేవా కార్యక్రమాలు మరింత విస్తరించి తెలంగాణ యువతకు ఉపాధి అవకాశాలు కల్పించడంలో దోహదపడాలని ఆకాంక్షించారు. పరవస్తు క్రియేటివ్ ఫౌండేషన్ రాష్ట్ర కోఆర్డినేటర్ గద్దె భాస్కర్ మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా నిర్వహించిన ఎలిజిబిలిటీ టెస్ట్‌కు అభ్యర్థుల నుంచి విశేషస్పందన లభించిందన్నారు. అర్హత సాధించిన అభ్యర్థులకు సబ్‌ఇన్‌స్పెక్టర్, కానిస్టేబుల్ ఉద్యోగాల కోసం ఉచిత ప్రీ-రిక్రూట్‌మెంట్ శిక్షణ అందించనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో సాహితీ కళావేదిక అధ్యక్షులు పలుస శంకర్ గౌడ్, రేడియంట్ స్కూల్ ప్రిన్సిపాల్ ఉప్పరి తిరుమలేష్, పాఠశాల సిబ్బంది, ప్రభుత్వ ఉపాధ్యాయులు శ్రీనివాస్ రెడ్డి, కవిత, బాలసుబ్రమణ్యం, చైల్డ్ వెల్ఫేర్ కమిటీ సభ్యురాలు శైలజ, సాహితీ కళా వేదిక ప్రతినిధులు భైరవ చంద్రశేఖర్, డాక్టర్ బైరోజు శ్యాంసుందర్, రాంకీ ఫౌండేషన్ ప్రతినిధులు, పరవస్తు క్రియేటివ్ ఫౌండేషన్ వాలంటీర్లు పాల్గొన్నారు.

## అసమానతల నిర్మూలనతోనే సామాజిక న్యాయం

### డిల్లీ విద్యార్థుల స్ఫూర్తితో సామాజికోద్యమాలు...

### కేవీపీఎస్ రాష్ట్ర ప్రదాన కార్యదర్శి స్కైలాబ్‌బాబు



**మల్కాజిగిరి, ఆగష్టు 18(సింగిడి):** సామాజిక ఆర్థిక రాజకీయ అంతరాలను అంతం చేయడం ద్వారానే సామాజిక న్యాయం సిద్ధిస్తుందని జెన్ జీ తరం సామాజిక న్యాయ సాధన కోసం ఉద్యమించాలని కేవీపీఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి టి స్కైలాబ్ బాబు పిలుపునిచ్చారు. ఆదివారం ఓల్డ్ నేరేడ్ మెట్ లోని అంబేద్కర్ భవన్ లో కుల వివక్ష వ్యతిరేక సంఘం (కేవీపీఎస్) ఆధ్వర్యంలో "79 ఏళ్ల స్వాతంత్ర్యం సామాజిక న్యాయం' అనే అంశంపై జిల్లా సదస్సు నిర్వహించారు. కేవీపీఎస్ జిల్లా ఆద్యక్షులు ఎం కృపాసాగర్ అధ్యక్షత వహించగా, ముఖ్యఅతిథిగా తెలంగాణ రాష్ట్ర కేవీపీఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి టి స్కైలాబ్ బాబు మాట్లాడుతూ బీజేపీ పాలిత రాష్ట్రాలలో దళితులపై రోజురోజుకి దౌర్జన్యాలు పెట్రేగిపోతున్నాయని, ప్రత్యేకించి ఉత్తర ప్రదేశ్ లో గత పన్నెండ్ల కాలంలో 59 వేల దౌర్జన్యాలు జరిగాయన్నారు. డబుల్ ఇంజన్ సర్కార్ లోనే దౌర్జన్యాలు ఎక్కువ జరుగుతున్నాయని, ఢిల్లీ కేంద్రంగా రిజర్వేషన్ హటావో ఆందోళన చేస్తున్న వారివెనుక ఆర్ఎస్ఎస్ బిజెపి హస్తం ఉందన్నారు. బిజెపి రాజకీయ విధానం దళితులు బలహీన వర్గాలు మైనార్టీలకు వ్యతిరేకంగా ఉంటుందని ఈ వాస్తవాన్ని గ్రహించి బిజెపి మనువాద మతోన్మాద విధానాలకు వ్యతిరేకంగా యువతరం ఐక్యంగా ఉద్యమించాలన్నారు. బిజెపి మూడోసారి అధికారంలోకి వచ్చిన తర్వాత బిజెపి పాలిత రాష్ట్రాలైన ఉత్తర ప్రదేశ్ మధ్యప్రదేశ్ రాజస్థాన్ ఛత్తీస్ ఘడ్ బీహార్ ఢిల్లీ రాష్ట్రాల్లో దళితులపై గంటకు 15 దౌర్జన్యాలు జరుగుతున్నాయని చెప్పారు రాజ్యాంగ బద్దంగా రూపొందించిన ఎన్నికల కమిషన్ ఈ డి, సి బి ఐ వంటి స్వతంత్ర సంస్థలను తమ గుప్పిట్లో పెట్టుకుని ప్రతిపక్షాలపై కక్ష సాధింపులకు పాల్పడుతుందన్నారు బిజెపి విధానాల ఫలితంగా గౌతం ఆదాని ప్రపంచంలో అతిపెద్ద రెండవ కుబేరుడుగా ఒకవైపు ఎదిగితే మరొకవైపున 46 కోట్ల మంది దారిద్ర్య రేఖకు దిగువన ఉన్నారని చెప్పారు లక్షల కోట్ల రూపాయలు బడా పారిశ్రామికవేత్తలకు కేంద్ర ప్రభుత్వం రాయితీ ఇస్తుందని మరోవైపున పేదలపై మోయలేని భారాలు మోపుతుందని విమర్శించారు అసమాన తల పెరుగుదల దేశ అభివృద్ధికి అడ్డుగా నిలుస్తుందన్నారు రిజర్వేషన్లు రద్దు చేయడానికి కుట్ర జరుగుతుందని, కులాన్ని రద్దు చేయడం ద్వారా రిజర్వేషన్లులేకుండా పోతాయని కులాన్ని రద్దు చేసే ధైర్యం కేంద్ర బిజెపి సర్కార్ కు ఉందా అని ప్రశ్నించారు. కుల వివక్ష అంటరానితనం 79 ఏళ్ల స్వాతంత్ర్యం తర్వాత కూడా కొనసాగడం దేశ పాలకులు సిగ్గుతో తలదించుకోవాలని, సాటి మనిషిని మనిషిగా ప్రేమించలేని వాళ్లే మత కలహాలు సృష్టించి దేశ ప్రజల ఐక్యతకు విఘాతం కలిగిస్తున్నారని, నేటికీ కొనసాగుతున్న కుల వివక్ష అంటరానితనం ఈ దేశ దీనస్థితికి కారణమని, ఇటీవల ఢిల్లీలో జరిగిన జెన్ జీ ఉద్యమ స్ఫూర్తితో విద్యారంగ పరిరక్షణ ఉపాధి వంటి లక్ష్యాల సాధన కోసం కృషి చేయాలన్నారు. ఆర్ఎస్ఎస్ చీఫ్ మోహన్ భగవత్ ఓవైపు జెన్ జీ ఉద్యమాన్ని బలపరుస్తూనే తమ సంఘ పరివార్ కార్యకర్తలతో మరోవైపున ఆ ఉద్యమంపై అనేక అసత్య ప్రచారాలు సామాజిక మాధ్యమాలలో చేపట్టారని విమర్శించారు బీజేపీపై వ్యతిరేకత పెరుగుతున్న ప్రతి సందర్భంలో అసంతృప్తి వెలిబుచ్చిన ప్రజలతో ఉన్నట్లు ఆర్ఎస్ఎస్ నటన చేస్తుందన్నారు ఉత్తరాఖండ్ రామ్ లీలా మైదానంలో ఒక జాతీయ పార్టీ అధ్యక్షులు రాజ్యసభలో ప్రతిపక్ష నేత మల్లికార్జున ఖర్గే ప్రసంగించిన వేదికను శ్రీరామ్ సేన పేరిట శుద్ధికరణ చేసిన దాని వెనక ఆర్ఎస్ఎస్ హస్తం ఉందన్నారు. దళితుల పట్ల బీజేపీ ఆర్ఎస్ఎస్ వైఖరేమిటో దీన్నిబట్టి విధితమవుతుందన్నారు. రైతాంగ ఉద్యమం విద్యార్థి ఉద్యమం బిజెపి పాలకుల మెడలు వచ్చిందన్నారు ప్రజాస్వామ్య దేశంలో నియంత పాలనకు చోటు లేదని, సామాజిక న్యాయం సాధించబడాలంటే భూమి పరిశ్రమలు ప్రకృతి వనరులు అన్నింటిలో ప్రజలకు సహజ న్యాయం జరగడం ద్వారానే సంపూర్ణ సామాజిక న్యాయం సిద్ధించబడుతుందని ఆయన పిలుపునిచ్చారు. ఈ సదస్సు లో సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షులు జి శ్రీనివాసులు, కేవీపీఎస్ జిల్లా కార్యదర్శి ఎన్ బాలపీరు, జిల్లా ఉపాధ్యక్షులు చింతల యాదయ్య, ఐద్వా జిల్లా అధ్యక్షురాలు ఎన్ సృజన, ఆల్ పెన్షనర్ అసోసియేషన్ రాష్ట్ర కార్యదర్శి నారాయణరెడ్డి లు పాల్గని మాట్లాడారు. ఈ కార్యక్రమం లో కేవీపీఎస్ సభ్యులు, వివిధ ప్రజా సంఘాల నాయకులు ఎన్ సబిత, జయరాజు, గుంటి లక్ష్మణ్, లీలావతి, దర్శనం, రమేష్, పి భాగ్య, సిహెచ్ అశోక్, బాలయ్య, మధు, స్వాతి, హరి, పాల్గొన్నారు.

# రోడ్డు ప్రమాదంలో యువకుడి మృతి

### ఆలస్యంగా వెలుగులోకి ఘటన



**భూపాలపల్లి ప్రతినిధి, ఆగష్టు 18(సింగిడి):** ఇంట్లో నుండి గత మూడు రోజుల క్రితం బయటకు వెళ్లిన యువకుడు రోడ్డు ప్రమాదానికి గురై మృతి చెందిన సంఘటన కాటారం మండలం మద్దులపల్లిలో ఆదివారం ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. పోలీసులు, కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం కాటారం మండలం మద్దులపల్లికి చెందిన పొట్ల లక్ష్మిరాజు(20) ఈ నెల 14న సాయంత్రం పని నిమిత్తం తన ద్విచక్ర వాహనంపై ఇంటి నుండి బయల్దేరి వెళ్ళాడు. మూడు రోజులుగా లక్ష్మిరాజు ఇంటికి రాకపోవడంతో ఆందోళనకు గురైన కుటుంబ సభ్యులు బంధువులు, తెలిసిన వారి వద్ద ఆరా తీసినప్పటికి ఆచూకీ లభించలేదు. కుటుంబ సభ్యులు ఆదివారం స్థానిక పోలీస్ స్టేషన్ లో ఫిర్యాదు చేశారు. ఇదే క్రమంలో కాటారం మండలం మేడిపల్లి శివారు అటవీప్రాంతంలో ఓ యువకుడు అనుమానస్పదంగా మృతి చెంది ఉన్నట్లు అటు వైపుగా వెళ్లిన పశువుల కాపరి చూశారు. పోలీసులకు సమాచారం అందించడంతో సంఘటన స్థలానికి చేరుకున్న పోలీసులు మృతదేహాన్ని పరిశీలించారు. ద్విచక్ర వాహనం జాతీయ రహదారి పక్కనే గల చెట్టును బలంగా ఢీ కొట్టడంతో సదరు యువకుడు ఎగిరిపడి తీవ్ర గాయాల పాలై మృతి చెందినట్లు ఆనవాళ్లు ఉన్నాయి. మృతదేహం కొంత కుళ్ళిపోయి ఉండటంతో గత రెండు, మూడు రోజుల క్రితం ఈ ప్రమాదం జరిగిన ఆనవాళ్లు ఉన్నట్లు పోలీసులు గుర్తించారు. కాగా అనుమానంతో లక్ష్మిరాజు కుటుంబ సభ్యులకు సమాచారం అందించగా దీంతో వారు మృతదేహం వద్దకు చేరుకొని లక్ష్మిరాజుగా నిర్ధారించారు. మృతుడి తండ్రి నర్సయ్య గత కొంత కాలం క్రితం మృతి చెందగా తల్లి మల్లమ్మ ఉన్నారు. లక్ష్మిరాజు తల్లి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై శ్రీనివాస్ తెలిపారు.

## దేశానికి వాజ్ పేయి చేసిన సేవలు చిరస్మరణీయం

- మాజీ కార్పొరేటర్ క్యానం రాజ్యలక్ష్మి

**మల్కాజిగిరి, ఆగష్టు 18 (సింగిడి):** భారత మాజీ ప్రధానమంత్రి, భారతరత్న అటల్ బిహారీ వాజ్‌పేయి వర్ధంతి సందర్భంగా ఆదివారం వినాయక్ నగర్ లోని వాజ్‌పేయి విగ్రహానికి వినాయక్ నగర్ డివిజన్ మాజీ కార్పొరేటర్ క్యానం రాజ్యలక్ష్మి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా రాజ్యలక్ష్మి మాట్లాడుతూ అటల్ బిహారీ వాజ్‌పేయి దేశానికి చేసిన సేవలు చిరస్మరణీయమని అన్నారు. దేశభక్తి, ప్రజాసేవ, విలువలతో కూడిన రాజకీయాలకు వాజ్‌పేయి ప్రతీకగా నిలిచారని పేర్కొన్నారు. ఆయన ఆశయాలు, సిద్ధాంతాలు నేటి తరానికి స్ఫూర్తిదాయకమని తెలిపారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు ఓం ప్రకాష్, సాయి సురేష్, తదితరులు పాల్గొన్నారు.



## 60 లక్షల రూపాయల రోడ్డు అభివృద్ధి పనులకు శంకుస్థాపన




**కుత్బుల్లాపూర్, ఆగష్టు 18(సింగిడి):** కుత్బుల్లాపూర్ నియోజకవర్గం 279వ ముఠామేస్త్రి నగర్ డివిజన్ శ్రీరామ్ నగర్--బి రోడ్డు, ముఠామేస్త్రి నగర్ ప్రాంతాల్లో 8, 9, 10, 11, 12వ వీధుల్లో రోడ్ల దుస్థితి కారణంగా ప్రజల రాకపోకలకు, చిన్నారులకు తీవ్ర ఇబ్బందులు ఎదురవుతున్న విషయాన్ని స్థానికులు కుత్బుల్లాపూర్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి కొలన్ హన్మంత్ రెడ్డి దృష్టికి తీసుకువచ్చారు. ప్రజల సమస్యపై వెంటనే స్పందించిన ఐటీ శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు సహకారంతో సిఎంసి నిధుల ద్వారా రూ. 60 లక్షల మంజూరు చేయించి రోడ్డు అభివృద్ధి పనులు చేపట్టేలా చర్యలు తీసుకున్నారు. ఆదివారం స్థానికులు స్థానిక పార్టీ ముఖ్య నేతల తో కలిసి రోడ్డుపనులకు కొలను హనుమంత రెడ్డి శంకుస్థాపన చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రజలకు కావాల్సిన మౌలిక సదుపాయాలు కల్పించడమే రేవంత్ రెడ్డి ప్రభుత్వ లక్ష్యమని వివరించారు. ఈ కార్యక్రమంలో డివిజన్ అధ్యక్షులు సిద్ధనోల్ల సంజీవ్ రెడ్డి, డీసీసీ సెక్రటరీ లాయక్, అజయ్, జమీర్ రహీమ్, కలీమ్, గఫార్, ఖాజా రెహ్మాన్ ఖలీల్, ఎం.డి. ఖలీల్ ఉర్ రెహ్మాన్, హనీఫ్, నవీన్ గౌడ్, యాదగిరి, బుచ్చి రెడ్డి, అంజనేయులు, నరసింహాచారి, విశ్వనాథ్, ప్రభాకర్, అజాజ్, శ్రావణ్, విష్ణువర్ధన్ గౌడ్, కృష్ణ గౌడ్, ప్రభు గౌడ్, నరేష్ తదితరులు పాల్గొన్నారు.

## తెలంగాణ సంస్కృతి సాంప్రదాయాలకు ప్రతీక బోనాలు



**సూర్యాపేట ప్రతినిధి, ఆగష్టు 18 (సింగిడి):** తెలంగాణ సంస్కృతి సాంప్రదాయాలకు ప్రతి కథ బోనాల పండుగ జరుపుకుంటామని ఏఐసీసీ సభ్యులు రామ్ రెడ్డి సర్వోత్తమ్ రెడ్డి అన్నారు. గురువారం సూర్యాపేట పట్టణం లోని ఊర ముత్యాలమ్మ, 48వ వార్డు కోట మైసమ్మ 16వ వార్డు బేచిరా గ్ మాదారం శ్రీ ముత్యాలమ్మ ఒకటో వార్డు లోని ముత్యాలమ్మ రెండో వార్డులోని ముత్యాలమ్మ దేవాలయాలను మున్సిపల్ చైర్మన్ మొరిశెట్టి నివేదిత లక్ష్యాది రాష్ట్ర కాంగ్రెస్ నాయకులు పోతు భాస్కర్ కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షుడు వెలుగు వెంకన్న తో కలిసి ప్రత్యేక పూజలను నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శ్రావణమాసం మొదటి వారంలో జరిగే బోనాల పండుగకు ఎంతో విశిష్టత దాగి ఉందని పూర్వీకుల నుండి బోనాల పండుగ ఆనవాయితీగా తెలంగాణ ప్రజలు జరుపుకుంటారని అన్నారు. అమ్మవారి ఆశీస్సులతో జిల్లా ప్రజలు సుఖసంతోషాలతో వర్ధిల్లాలని ఆకాంక్షించారు. అనంతరం ఆలయ నిర్వహకులు శాలువలతో ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ ఫ్లోర్ లీడర్ కుమ్మరి కుంట్ల వేణుగోపాల్ జిల్లా యువజన అధ్యక్షుడు ఎలిమినేటి అభినయ్ మాజీ జెడ్పిటిసి చింతమల రమేష్ అబ్దుల్ రహీం కౌన్సిలర్లు కొండపల్లి దిలీప్ రెడ్డి మన్యం అరుణ మల్లేష్ గుణగంటి హేమ సతీష్ కోడి శిరీష జహీర్ తన్వీర్ మణిరత శ్రీనివాస్ దండు మైసమ్మ దేవాలయం చైర్మన్ తంగెళ్ల కరుణాకర్ రెడ్డి ఇతరులు పాల్గొన్నారు.



బుధవారం
19-8-2026

singidinews@gmail.com

ఈ రోజుల్లో ఫోన్ ఎక్కువగా వాడటం జీవితంలో ఒక అలవాటు అయిపోయింది. దీంతో లేని పోని సమస్యలు తెచ్చుకుంటున్నారు. ముఖ్యం గా మెడ, నడుముకి సంబంధించిన సమస్యలు ఎక్కువైపోయాయి. నటి షకీలా ఇటీవల ఫోన్ ఎక్కు వగా వాడటం వల్ల దాదాపు 3 లక్షల ఖర్చుతో మెడ సర్జరీ చేయించుకున్నానని తెలిపారు. కేవలం ఫోన్ వాడటం వల్లే సర్జరీ దాకా వెళ్లకపోయినా, ఇప్పటికే మెడ సంబంధిత సమస్యలు ఉన్నవారికి చెడు భంగిమ తీవ్ర ఒత్తిడిని కలిగిస్తుందని వైద్యులు హెచ్చరిస్తున్నారు.

# ఫోన్‌తో సమస్యలు ...రాకుండా ఉండాలంటే?



**5. ఫోన్ వాడేటప్పుడు పాటించాల్సిన సాధారణ మార్పులు**

ఐ-లెవల్ : ఫోన్‌ను కిందకు చూడకుండా, కంటి చూపు ఎత్తుకు తీసుకురావాలి.

విశ్రాంతి, మార్పు: భుజాల్ని రిలాక్స్‌గా ఉంచాలి. ఎక్కువసేపు ఒకే భంగిమలో ఉండకుండా మధ్యమధ్యలో బ్రేకులు తీసుకుంటూ మెడ, భుజాలను సున్నితంగా కదిలించాలి.

వ్యాయామం: మెడ, పై వీపు, భుజాల కండరాలను బలోపేతం చేసే చిన్నపాటి వ్యాయామాలు రోజువారీ అలవాటుగా చేసుకోవాలి.

**3. పెయిన్ కిల్లర్స్ వాడటం ఆపి స్పైన్ స్పెషలిస్ట్‌ను ఎప్పుడు సంప్రదించాలి?**

నొప్పి కొన్ని వారాల పాటు తగ్గకుండా ఉన్నా, లేదా మందులు వేసుకున్నా పదే పదే వస్తున్నా వైద్యుడిని కలవాలి. నొప్పి నిద్రకు లేదా దైనందిన పనులకు ఆటంకం కలిగిస్తున్నప్పుడు, చేతి పట్టు తగ్గడం, నడవడంలో ఇబ్బంది లేదా మూత్ర విసర్జన నియంత్రణ కోల్పోవడం వంటి తీవ్ర లక్షణాలు ఉంటే వెంటనే స్పెషలిస్ట్‌ను సంప్రదించాలి. స్పెషలిస్ట్‌ను కలవడం అంటే వెంటనే సర్జరీ అని కాదు. ఫిజియోథెరపీ, జీవనశైలి మార్పులు లేదా సరైన మందుల ద్వారా సమస్యను గుర్తించి పరిష్కరించడం.

**4. చెడు భంగిమ ఏ దశలో సర్జరీకి దారితీస్తుంది?**

సాధారణంగా పోశ్చర్ సంబంధిత నొప్పులకు సర్జరీ అవసరం ఉండదు. వీటికి ఫిజియోథెరపీ, వ్యాయామాలు సరిపోతాయి. డిస్క్ హెర్నియేషన్ (డిస్క్ జారడం), స్పైనల్ స్టెనోసిస్ (వెన్ను నరం ఉండే మార్గం కుచించుకుపోవడం) లేదా వెన్నుపాముపై తీవ్ర ఒత్తిడి ఉండి, ఇతర చికిత్సలు పనిచేయనప్పుడు మాత్రమే సర్జరీని పరిశీలిస్తారు.

**1. నార్మల్ రీడింగ్ కంటే స్మార్ట్‌ఫోన్ వైపు తల వంచి చూడటం ఎందుకు ఎక్కువ ప్రమాదకరం?**

ఫోన్ చూసేటప్పుడు చాలామంది మెడను ఎక్కువ కోణంలో కిందకు వంచుతారు దీనివల్ల తల బరువు మోసే మెడ కండరాలు, వెన్నుపూసలపై విపరీతమైన భారం పడుతుంది. పుస్తకాలు చదివేటప్పుడు సాధారణంగా అనుకూలమైన ఎత్తులో పట్టుకుంటారు, కానీ ఫోన్‌ను ఒడిలో లేదా కిందికి పెట్టి చూడటం వల్ల మెడపై నిరంతర ఒత్తిడి ఉంటుంది. ఇది ఎక్కువ సమయం కొనసాగితే కండరాల అలసట, దృఢత్వం డిస్క్ లేదా కీళ్ల సమస్యలు తీవ్రమవుతాయి.

**2. మొదట్లో గమనించకుండా వదిలేసే ప్రారంభ లక్షణాలు ఏవి?**

**సాధారణ లక్షణాలు:**

మెడ పట్టేయడం, మెడ – భుజాల వద్ద నొప్పి, తలనొప్పి, పైభాగపు వీపు నొప్పి.

**తీవ్రమైన లక్షణాలు:**

సమస్య పెరిగేకొద్దీ నొప్పి మెడ నుంచి చేతులు, భుజాల వైపు పాకడం చేతుల్లో తిమ్మిర్లు, మొద్దుబారినట్లు అనిపించడం లేదా బలహీనత రావడం. ఇవి నరాలపై ఒత్తిడి పడుతోందనడానికి సంకేతాలు.

**ముఖ్యమైన విషయాలు**

**తల బరువు ఒత్తిడి:** సాధారణంగా తల బరువు 4-5 కిలోలు ఉంటుంది. తలను 60 డిగ్రీల కోణంలో కిందకు వంచినప్పుడు మెడ వెన్నుపూసపై దాదాపు 27 కిలోల వరకు ఒత్తిడి పడుతుంది. 20-20-20 రూల్: ప్రతి 20 నిమిషాల స్క్రీన్ సమయానికి 20 సెకన్ల పాటు కనీసం 20 అడుగుల దూరంలో ఉన్న వస్తువును చూడటం, మెడను నిటారుగా ఉంచడం అలవాటు చేసుకోవాలి.

## స్టాక్ మార్కెట్ Stock Market





# ప్రకృతి సోయగాలకు ఆభరణ రూపం.. 'సిందూరం'

హైదరాబాద్ (సింగిడి): ప్రముఖ సహజ వజ్రాల ఆభరణాల బ్రాండ్ కీర్తిలాల్స్ హైదరాబాద్ సోమాజిగూడ స్టోర్‌లో 'సిందూరం' పేరుతో ప్రత్యేక బ్రైడల్ జ్యువెలరీ కలెక్షన్‌ను ఆవిష్కరించింది. ప్రకృతి అందాల నుంచి స్ఫూర్తి పొందిన ఈ కలెక్షన్‌లో పుష్పాలు, మందార పువ్వులు, నెమళ్లు తదితర అంశాలను ఆధారంగా చేసుకుని రూపొందించిన ఆకర్షణీయ మైన డిజైన్లు ఉన్నాయి. అత్యున్నత నాణ్యత కలిగిన సహజ వజ్రాలు, విలువైన లోహాలు, రంగు రంగుల రత్నాల సమ్మేళనంతో 'సిందూరం' ఆభరణాలను రూపొందించారు. సంప్రదాయ బ్రైడల్ ఆభరణాల వైభవాన్ని సమకాలీన డిజైన్లతో మేళవిస్తూ, ఆధునిక వధువుల అభిరుచులకు అనుగుణంగా ఈ కలెక్షన్‌ను తీర్చిదిద్దారు. ప్రతి ఆభరణం తరతరాలకు అందించే వారసత్వ సంపదగా నిలిచేలా ప్రత్యేక శ్రద్ధతో రూపొందించారు. రిటైల్ జ్యువెల్లర్ ఇండియా అవార్డ్స్ 2026లో కీర్తిలాల్స్ బ్రైడల్ కలెక్షన్‌కు ప్రతిష్టాత్మక 'బెస్ట్ బ్రైడల్ జ్యువెలరీ ఆఫ్ ది ఇయర్' అవార్డు లభించింది. అవార్డు గెలు చుకున్న ఆభరణాన్ని ప్రస్తుతం సోమాజిగూడ స్టోర్‌లో ప్రదర్శనకు ఉంచారు. ఈ సందర్భం గా కీర్తిలాల్స్ డైరెక్టర్-- బిజినెస్ స్ట్రాటజీ సూరజ్ శాంతకుమార్ మాట్లాడుతూ, వధువు జీవితంలోని అత్యంత ప్రత్యేకమైన రోజుకు ధరించే ఆభరణాలు కూడా చిరస్మరణీయంగా ఉండాలనే ఆలోచనతో 'సిందూరం' కలెక్షన్‌ను రూపొందించినట్లు తెలిపారు. ప్రకృతి సౌందర్యం, సృజనాత్మ కత, అత్యుత్తమ హస్తకళల సమ్మేళనంగా ఈ కలెక్షన్‌ను తీర్చిదిద్దామని పేర్కొన్నారు. వధు వులు, ఆభరణాల ప్రేమికులు సోమాజిగూడ స్టోర్‌ను సందర్శించి ఈ ప్రత్యేక కలెక్షన్‌ను ప్రత్యక్షంగా వీక్షించాలని ఆయన ఆహ్వానించారు.

# పిల్లల జుట్టు బాగా పెరగాలంటే...


పిల్లల జుట్టు పలుచగా ఉండటం, ఆశించినంత వేగంగా పెరగకపోవడం చాలామంది తల్లిదండ్రులను ఆందోళనకు గురిచేస్తుంది. దీంతో రకరకాల ప్రయోగాలు చేస్తుంటారు. రకరకాల ఆయిల్స్ వాడుతుంటారు. ఈ క్రమంలో జుట్టు త్వరగా పెరగాలనే ఉద్దేశంతో ఆముదం, కొబ్బరి నూనెతో తరచుగా మసాజ్ చేస్తూ ఉంటారు. అయితే ఈ రెండు నూనెల్లో పిల్లల జుట్టుకు నిజంగా ఏది ఎక్కువ ప్రయోజనం చేస్తుంది? పిల్లల జుట్టు ఒత్తుగా, సిల్కీగా, దృఢంగా, ఆరోగ్యంగా పెరగాలని ప్రతి తల్లిదండ్రి కోరుకుంటారు. అయితే కొందరు పిల్లల్లో జన్యుపరమైన లక్షణాలు, ఆహారపు అలవాట్లు, తల చర్మం ఆరోగ్యం వంటి కారణాల వల్ల జుట్టు పెరుగుదల నెమ్మదిగా ఉండొచ్చు. భారతీయులు హెయిర్ కేర్‌లో ఎక్కువగా వినియోగించేది కొబ్బరి నూనె లేదా ఆముదం. చిన్న పిల్లలకు కూడా వీటిని హెయిర్ కేర్‌లో ఎక్కువగా వాడుతుంటారు. వారి జుట్టు హెల్తీగా పెరగాలని ఇంట్లోనే ఆముదం, కొబ్బరి నూనెతో మసాజ్ చేస్తుంటారు. ఈ రెండు నూనెలు కూడా జుట్టు సంరక్షణలో విస్తృతంగా ఉపయోగిస్తున్నప్పటికీ, వాటి పనితీరు ఒకేలా ఉండదు. రెండు నూనెలు కూడా జుట్టు సంరక్షణలో తమదైన లాభాలు చూపిస్తాయి. అయితే పిల్లల జుట్టు పెరుగుదలకు ఏది ఎక్కువ ఉపయోగపడుతుంది? రెండింటిలో తేడా ఏమిటి? నిపుణులు, అధ్యయనాలు ఏమి సూచిస్తున్నాయో ఈ స్టోరీలో వివరంగా తెలుసుకుందాం.. ముదం హెయిర్ కేర్‌లో చాలా ప్రసిద్ధి అని చెప్పొచ్చు. దీనిలో ఉండే రిసినోలిక్ యాసిడ్ తలకు రక్త ప్రసరణను పెంచి, జుట్టు కుదుళ్లను బలపరుస్తుంది. తద్వారా హెయిర్ ఫాల్‌ను కంట్రోల్‌లో ఉంచుతుంది. అంతేకాకుండా జుట్టును సిల్కీగా మారుస్తుందని రీసెర్చ్‌గేట్ అధ్యయనం పేర్కొంది. పిల్లల్లో, జుట్టు కుదుళ్ల ఏర్పాటును ఉత్తేజపరిచేందుకు వారానికి ఒకటి లేదా రెండు సార్లు ఆముదం నూనెతో తలకు సున్నితంగా మర్దన చేయాలి. ఆముదం నూనె చిక్కగా, జిగటగా కూడా ఉంటుంది,. అందు వల్ల దీనిని కొన్నిసార్లు రాసుకోవడం కష్టంగా ఉంటుంది.



# సీనియర్ సిటిజన్లకు బెస్ట్ పథకం..

స్థిరమైన, రిస్క్ లేని రాబడి కోరుకునే సీనియర్ సిటిజన్లకు ప్రస్తుతం చాలా బ్యాంకుల్లో తక్కువ వడ్డీ ఇస్తున్నారు. ఆర్‌బీఐ వడ్డీ రేట్లను పెంచకపోవడంతో డిపాజిట్ల వడ్డీ రేట్లు తక్కువగా ఇస్తున్నారు. అయితే, ఇప్పటికీ ఓ 2 బ్యాంకులు ఏకంగా 8 శాతం మేర వడ్డీ రేట్లను ఆఫర్ చేస్తున్నాయి. స్మాల్ ఫైనాన్స్ బ్యాంకుల్లో 8.05 శాతం వరకు వడ్డీ వస్తోంది. ఇందులో రూ. 5 లక్షలు జమ చేస్తే ఎంతొస్తుందో తెలుసుకుందాం.

రిటైర్మెంట్ తర్వాత ఆదాయం ఉండదు. అందుకే మలివయసులో స్థిరమైన ఆదాయం అందించే మార్గాల్లో పెట్టుబడి పెట్టాల్సిన అవసరం ఉంటుంది. 60 ఏళ్ల వయసు దాటిన సీనియర్ సిటిజన్లు ఎక్కువగా స్థిరమైన, రిస్క్ లేని రాబడులు అందించే బ్యాంక్ ఫిక్స్‌డ్ డిపాజిట్లను ఎంచుకుంటుంటారు. గత ఏడాది కాలంలో రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా రెపో రేటును భారీగా తగ్గించి స్థిరంగా కొనసాగిస్తూ వస్తోంది. దీంతో ఎస్‌బీఐ, హెచ్‌డీఎఫ్‌సీ వంటి పెద్ద బ్యాంకులు డిపాజిట్ వడ్డీ రేట్లను కనిష్ఠ స్థాయిలో అందిస్తున్నాయి. దీంతో ఎక్కడ డిపాజిట్ చేయాలో తెల్చుకోలేకపోతున్నారు. అలాంటి సీనియర్ సిటిజన్లందరికీ బెస్ట్ ఎఫ్‌డీ ఆప్షన్ ఈ కథనం ద్వారా తెలుసుకుందాం. పెద్ద పెద్ద వాణిజ్య బ్యాంకులు డిపాజిట్ల వడ్డీ రేట్లను తక్కువగా ఆఫర్ చేస్తున్నా రెండు స్మాల్ ఫైనాన్స్ బ్యాంకులు మాత్రం ఇప్పటికీ 8.05 శాతం వరకు వడ్డీ రేట్లను ఆఫర్ చేస్తున్నాయి. అవే జన స్మాల్ ఫైనాన్స్ బ్యాంక్ సూర్యోదయ స్మాల్ ఫైనాన్స్ బ్యాంక్ 5 సంవత్సరాల మెచ్యూరిటీ పీరియడ్ గల ఫిక్స్‌డ్ డిపాజిట్ పథకం ద్వారా వరుసగా 8 శాతం, 8.05 శాతం వడ్డీ రేట్లనుఈ రెండు బ్యాంకులు ఆఫర్ చేస్తున్నాయి. 60 సంవత్సరాలు దాటిన ఒక సీనియర్ సిటిజన్ ఈ రెండు బ్యాంకుల్లో రూ. 5 లక్షలు జమ చేస్తే ఎంతొస్తుందో ఆన్‌లైన్ ఎఫ్‌డీ కాలిక్యులేటర్ ద్వారా ముందే అంచనా వేయవచ్చు. జన స్మాల్ ఫైనాన్స్ బ్యాంకులో 5 ఏళ్ల టర్మ్‌తో రూ. 5 లక్షలు జమ చేస్తే 8 శాతం వడ్డీ వర్తిస్తుంది. దీని ప్రకారం మెచ్యూరిటీ తర్వాత చేతికి రూ. 2,42,975 వడ్డీతో మొత్తం రూ. 7,42,975 వరకు అందుతాయి. అదే సూర్యోద య స్మాల్ ఫైనాన్స్ బ్యాంక్ అయితే వడ్డీ రూ. 2,44, 797 వరకు వస్తుంది. అంటే మొత్తం రూ. 7,44, 797 వరకు వస్తాయి. చాలా మంది స్మాల్ ఫైనాన్స్ బ్యాంకులు అంటే వెనకడుగు వేస్తుంటారు. తమ డబ్బులు సురక్షితమేనా, వడ్డీ తక్కువ అయినా ఎస్‌బీ ఐ వంటి పెద్ద బ్యాంకులే బెటర్ అని అనుకుంటారు.



ప్రభాతనవ సింగిడి
ప్రతి రంగూ ఓ నిజం
Singidi
బుధవారం 19-8-2026

# కళ్యాణలక్ష్మి, షాదీ ముబారక్‌ను వెంటనే పునరుద్ధరించాలి!

- రామగుండంలో బీఆర్ఎస్ భారీ నిరసన.. రాజీవ్ రహదారిపై రాస్తారోకో
- కాంగ్రెస్ ప్రభుత్వం పేదల సంక్షేమాన్ని విస్మరిస్తోంది మాజీ ఎమ్మెల్యే కోరుకంటి చందర్
- పథకాలను పునరుద్ధరించకపోతే ప్రజాక్షేత్రంలో తగిన బుద్ధి చెబుతాం
- బీఆర్ఎస్ నేతలు కౌశిక హరి, వ్యాల హరీష్ రెడ్డి



**రామగుండం, (సింగిడి):** పేద, మధ్య తరగతి కుటుంబాలకు అండగా నిలిచిన సంక్షేమ పథకాలను కాంగ్రెస్ ప్రభుత్వం నిర్వీర్యం చేస్తోందని ఆరోపిస్తూ బీఆర్ఎస్ ఆధ్వర్యంలో రామగుండంలో భారీ ఆందోళన చేపట్టారు. బీఆర్ఎస్ పార్టీ పెద్దపల్లి జిల్లా అధ్యక్షుడు, రామగుండం నియోజకవర్గ ఇంచార్జి కోరుకంటి చందర్ ఆధ్వర్యంలో కళ్యాణలక్ష్మి, షాదీ ముబారక్ పథకాలను తక్షణమే పునరుద్ధరించాలని డిమాండ్ చేస్తూ రాజీవ్ రహదారిపై రాస్తారోకో, ధర్నా నిర్వహించారు. అనంతరం రామగుండం ఎంఆర్ఓకు వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా బీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు కౌశిక్ హరి, వ్యాళ్ల హరీష్ రెడ్డితో కలిసి కోరుకంటి చందర్ కాంగ్రెస్ ప్రభుత్వంపై తీవ్ర స్థాయిలో విమర్శలు చేశారు. ప్రజాపాలన పేరుతో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం పేదల సంక్షేమాన్ని పూర్తిగా విస్మరిస్తోందని ఆరోపించారు.

**కేసీఆర్ హయాంలో పేదింటి ఆడబిడ్డలకు భరోసా**

గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ పేద కుటుంబాల ఆడపిల్లల వివాహం తల్లిదండ్రులకు ఆర్థిక భారం కాకూడదనే ఉద్దేశంతో కళ్యాణలక్ష్మి, షాదీ ముబారక్ పథకాలను అమలు చేశారని నేతలు గుర్తుచేశారు. ఈ పథకాల ద్వారా వేలాది పేద కుటుంబాలకు ఆర్థికంగా ఊరట లభించిందన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత రైతుభీమాతో పాటు పలు సంక్షేమ పథకాలకు నిధులు తగ్గించిందని, ఇప్పుడు కళ్యాణలక్ష్మి, షాదీ ముబారక్ పథకాల విషయంలోనూ నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని విమర్శించారు.

**పథకాలు పునరుద్ధరించకపోతే ఉద్యమం ఉధృతం**

బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఆదేశాల మేరకు రాష్ట్రవ్యాప్తంగా చేపడుతున్న నిరసనల్లో భాగంగానే రామగుండంలో ఈ ఆందోళన నిర్వహించినట్లు నేతలు తెలిపారు. పేదల ప్రయోజనాలకు సంబంధించిన సంక్షేమ పథకాలను వెంటనే పునరుద్ధరించాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం స్పందించి పథకాలను పునరుద్ధరించకపోతే ప్రజల తరఫున మరింత పెద్ద ఎత్తున ఉద్యమాలు చేపడతామని, ప్రజాక్షేత్రంలో కాంగ్రెస్ ప్రభుత్వానికి తగిన బుద్ధి చెబుతామన్నారు. భారీగా తరలివచ్చిన బీఆర్ఎస్ శ్రేణులు ఈ ఆందోళనలో మున్సిపల్ ఫ్లోర్ లీడర్ మేకల సమ్మయ్య యాదవ్, కార్పొరేటర్లు తోకల రమేష్, మహేష్, కర్క పద్మజ, నిమ్మరాజుల రవి, మాజీ జడ్పీటీసీ అముల నారాయణ, నారాయణదాసు మారుతి, మందల కిషన్ రెడ్డి, మెతుకు దేవరాజ్, బొడ్డుపెల్లి శ్రీనివాస్, ఈదునూరి పర్వతాలు, ఈదునూరి శ్రీకాంత్, తస్లీమా బాను, అయిత శివకుమార్, వకుల, సత్యవతి, సాజిదా, కళావతి, కిరణ్ జి, రామరాజుతో పాటు ప్రజాప్రతినిధులు, వివిధ విభాగాల నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. బీఆర్ఎస్ శ్రేణులు కాంగ్రెస్ ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేస్తూ కళ్యాణలక్ష్మి, షాదీ ముబారక్ పథకాలను వెంటనే పునరుద్ధరించాలన్నారు.

## కమాన్ పూర్‌లో "ప్రజావాణి"..!



**కమాన్ పూర్, (సింగిడి):** ప్రజా సమస్యలను సత్వరం పరిష్కరించాలనే సంకల్పంతో రాష్ట్ర ప్రభుత్వం "మండల ప్రజా పరిషత్" కార్యాలయాల్లో సోమవారం నుండి "ప్రజావాణి" కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది. ఈ "ప్రజావాణి" కార్యక్రమాన్ని ఉదయం 10:00 గంటల నుండి మధ్యాహ్నం 1:00 గంట వరకు నిర్వహించాలని, అన్ని శాఖల అధికారులు "ప్రజావాణి" కార్యక్రమంలో భాగస్వాములు కావాలని ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసిన సంగతి విధితమే. ఇందులో భాగంగా "కమాన్ పూర్ మండల ప్రజా పరిషత్" కార్యాలయంలో "ప్రజావాణి" కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఇందులో మండలంలోని వివిధ గ్రామాల్లో నుండి వచ్చిన ప్రజల నుండి అధికారులు విజ్ఞప్తులు స్వీకరించారు. ఈ కార్యక్రమంలో అధికారులు ఇన్చార్జి ఎంపీడీవో సౌమ్య, తహసిల్దార్ ముస్త్యాల వాసంతి,ఎం ఈ ఓ ఇల్లందుల విజయ్ కుమార్, వైద్యాధికారిని సల్మా బేగం,వ్యవసాయ అధికారి గిరి రామకృష్ణ, ఎన్ పి డి సి ఎల్ ఏ ఈ తూర్పాటి స్వామి, పశువైద్యాధికారి మురళీకృష్ణ, హౌసింగ్ ఏఈ రేఖ, ఆల్ డబ్ల్యూ ఎస్ ఏ ఈ ప్రణవ్, బీసీ సంక్షేమ శాఖ మమత, గ్రిడ్ ఏఈ నిత్య,ఏ పీ ఓ లావణ్య, ఏపీఎం పద్మ, ఐసిడిఎస్ సూపర్వైజర్ సూర్య కళ,పాల్గొన్నారు.

## జూలపల్లి సమస్యలకు ఇకనైనా మోక్షం కలిగేనా?

**-ఏళ్ల తరబడి పెండింగ్‌లో ఉన్న పనులు పూర్తి చేయాలి: ప్రజావాణిలో వినతి పత్రం**

**-బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు అమరగాని ప్రదీప్‌కుమార్**



**సుల్తానాబాద్, (సింగిడి):** పెద్దపల్లి జిల్లా జూలపల్లి మండల కేంద్రంలోని ఏళ్ల తరబడి పెండింగ్‌లో ఉన్న ప్రధాన సమస్యలను వెంటనే పరిష్కరించాలని బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు అమరగాని ప్రదీప్‌కుమార్ డిమాండ్ చేశారు. ప్రజావాణి తొలిరోజు సందర్భంగా బీజేపీ మండల శాఖ ఆధ్వర్యంలో అధికారులకు వినతిపత్రం సమర్పించారు. పోలీస్‌స్టేషన్ చౌరస్తా నుంచి మెయిన్‌రోడ్డు నిర్మాణం పూర్తి చేయడంతో పాటు అంబేద్కర్ చౌరస్తా అభివృద్ధి, వాగుపై బ్రిడ్జి నిర్మాణం, ప్రధాన రహదారిపై సెంట్రల్ లైటింగ్‌కు నిధులు మంజూరు చేయాలని కోరారు. 12 ఏళ్లుగా గుంత లమయమైన రోడ్డుతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నా పట్టించుకోవడం లేదని విమర్శించారు. బ్రిడ్జికి శంకుస్థాపన చేసి ఏడాది గడిచినా పనులు ప్రారంభించకపోవడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. సమస్యల పరిష్కారంలో ప్రభుత్వం, అధికారులు చిత్తశుద్ధితో స్పందించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో బీజేపీ మండల అధ్యక్షుడు కొప్పుల మహేష్‌తో పాటు మల్లెత్తుల అంజియాదవ్, పొన్నం వెంకటేష్, సింగిరెడ్డి మహిపాల్‌రెడ్డి, బోడిగే లక్ష్మణ్, కంచి శ్రీనివాస్, గుంటి అశోక్, ముక్కెర వెంకటేష్, కత్తెర్ల రాజేశం, శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

## పేదింటి పెళ్లికి భరోసా..

**కళ్యాణ లక్ష్మి కొనసాగించాల్సిందే: బీఆర్ఎస్ ధర్నా**



**మంచిర్యాల, (సింగిడి):** ఆడపిల్ల పెళ్లి అనేది ప్రతి పేద కుటుంబానికీ ఒక పెద్ద బాధ్యత. పెళ్లి ఖర్చులు ఎలా భరించాలనే ఆందోళనలో ఉన్న కుటుంబాలకు కళ్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ పథకాలు కొంతమేరకు ఆర్థిక ఊరటనిచ్చాయి. అలాంటి పథకాలను నిలిపివేయవద్దంటూ బీఆర్ఎస్ శ్రేణులు ఆందోళన బాట పట్టాయి. పథకాలను యథావిధిగా కొనసాగించాలని డిమాండ్ చేస్తూ సోమవారం మంచిర్యాల జిల్లా కలెక్టరేట్ ఎదుట బీఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ పిలుపు మేరకు, మంచిర్యాల మాజీ ఎమ్మెల్యే నడిపెల్లి దివాకర్‌రావు ఆదేశాలతో నిర్వహించిన ఈ కార్యక్రమానికి బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు నడిపెల్లి విజిత్‌కుమార్ నాయకత్వం వహించారు. మంచిర్యాల కార్పొరేషన్‌కు చెందిన బీఆర్ఎస్ ప్రజాప్రతినిధులు, మాజీ ప్రజాప్రతినిధులు, మహిళా నాయకులు, టీ బీ జీ కె ఎస్ నాయకులు, యువజన, విద్యార్థి విభాగాల నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు. ఈ సందర్భంగా విజిత్‌కుమార్ మాట్లాడుతూ.. ఎన్నికల సమయంలో కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీలను అమలు చేయకుండా ప్రజలను పక్కదారి పట్టించే రాజకీయాలు చేస్తోందని ఆరోపించారు. బీఆర్ఎస్ ప్రభుత్వం, మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ హయాంలో అమలైన కళ్యాణ లక్ష్మి--షాదీ ముబారక్ పథకాలు పేద కుటుంబాలకు ఎంతో ఉపయోగకరంగా ఉన్నాయని పేర్కొన్నారు. కళ్యాణ లక్ష్మి,షాదీ ముబారక్ పథకాలను కొనసాగించకపోతే ప్రజల తరఫున బీఆర్ఎస్ పోరాటాన్ని మరింత ఉధృతం చేస్తుందని విజిత్‌కుమార్ హెచ్చరించారు. బీఆర్ఎస్ నాయకులు ధర్నాను ముగించారు. ధర్నాలో పలువురు బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు, మహిళా నాయకులు, యువజన, విద్యార్థి విభాగాల ప్రతినిధులు పాల్గొన్నారు.

## ఆసుపత్రికి వచ్చే ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించాలి



**కొమురం భీం ఆసిఫాబాద్ ప్రతినిది (సింగిడి):** ప్రభుత్వ ఆసుపత్రులకు వచ్చే ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించడంతో పాటు ఆసుపత్రుల అభివృద్ధికి సమన్వయంతో కృషి చేయాలని ఆదిలాబాద్ పార్లమెంటు సభ్యుడు గొడం నగేష్ అన్నారు. జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ ఆసుపత్రిలో సోమవారం నిర్వహించిన జిల్లా ప్రభుత్వ ఆసుపత్రి అభివృద్ధి కమిటీ సమావేశానికి జిల్లా కలెక్టర్ కె. హరిత, ఆసిఫాబాద్ ఎమ్మెల్యే కోవ లక్ష్మి, కమిటీ సభ్యులు, వివిధ విభాగాల వైద్యులతో కలిసి ఎంపీ హాజరై ఆసుపత్రి అభివృద్ధిపై సమీక్షించారు. ఈ సందర్భంగా ఎంపీ నాగేష్ మాట్లాడుతూ వైద్యులు, సిబ్బంది విధుల పట్ల సమయపాలన పాటించాలని సూచించారు. ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న రోగుల పట్ల మర్యాదగా వ్యవహరించి, ప్రభుత్వ వైద్య సేవలపై ప్రజల్లో నమ్మకం కలిగించాలని అన్నారు. అన్ని విభాగాల్లో వైద్యులు, సిబ్బంది పూర్తిస్థాయిలో ఉండేలా నిబంధనల ప్రకారం ఖాళీలను భర్తీ చేయాలని సూచించారు.

## ఫిర్యాదుల పరిష్కారంలో జాప్యం వద్దు..!

- బాధితులకు సత్వర న్యాయం అందించాలి
- సీపీ అంబర్ కిషోర్ ఝా కీలక ఆదేశాలు



**గోదావరిఖని, (సింగిడి):** ప్రజల నుంచి అందే ప్రతి ఫిర్యాదును అత్యంత బాధ్యతతో స్వీకరించి, చట్టపరమైన నిబంధనలకు అనుగుణంగా సమగ్ర విచారణ చేపట్టి బాధితులకు సత్వర న్యాయం అందించాలని రామగుండం పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝా అధికారులను ఆదేశించారు. సోమవారం రామగుండం పోలీస్ కమిషనర్ కార్యాలయంలో నిర్వహించిన 'ప్రజావాణి' కార్యక్రమానికి పెద్దపల్లి, మంచిర్యాల జిల్లాల పరిధిలోని వివిధ ప్రాంతాల నుంచి పలువురు బాధితులు హాజరై తమ సమస్యలు, ఫిర్యాదులను సీపీ దృష్టికి తీసుకువచ్చారు. ప్రతి ఫిర్యాదుపై ప్రత్యేక దృష్టి ప్రజల నుంచి అందిన ఫిర్యాదులను సీపీ స్వయంగా పరిశీలించారు. అనంతరం సంబంధిత పోలీస్ అధికారులతో మాట్లాడి ఆయా సమస్యలపై నిష్పక్షపాతంగా, పారదర్శకంగా విచారణ నిర్వహించాలని సూచించారు. ఫిర్యాదుల పరిష్కారంలో ఎలాంటి జాప్యం లేకుండా నిర్ణీత సమయంలో చర్యలు తీసుకుని, బాధితులకు న్యాయం జరిగేలా చూడాలని ఆదేశించారు. ప్రజలకు మెరుగైన పోలీస్ సేవలే లక్ష్యం ప్రజలకు పోలీస్ శాఖ మరింత చేరువ కావాలని సీపీ అంబర్ కిషోర్ ఝా పేర్కొన్నారు. శాంతిభద్రతల పరిరక్షణతో పాటు ప్రజలకు త్వరిత, పారదర్శక, బాధ్యతాయుతమైన పోలీస్ సేవలు అందించడమే రామగుండం పోలీస్ కమిషనరేట్ ప్రధాన లక్ష్యమని తెలిపారు. ప్రజలు తమ సమస్యలను నిర్భయంగా పోలీసుల దృష్టికి తీసుకురావాలని, అందిన ప్రతి ఫిర్యాదుపై నిబంధనల మేరకు చర్యలు తీసుకుంటామని సీపీ స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో అదనపు డీసీపీ (పరిపాలన) కె. శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

## విధి నిర్వహణకు ప్రశంస..

**-పంచాయతీ కార్యదర్శికి ఘన సన్మానం**





**సుల్తానాబాద్, (సింగిడి):** సుల్తానాబాద్ మండలం సుద్దాల గ్రామపంచాయతీ కార్యదర్శి వరికుప్పల సాగర్ విధి నిర్వహణలో అందించిన సేవలకు గుర్తింపుగా 80వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల సందర్భంగా జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష చేతుల మీదుగా ప్రశంస పత్రం అందుకున్నారు. ఈ సందర్భంగాసోమవారం సుద్దాల గ్రామపంచాయతీ కార్యాలయంలో పెద్దపల్లి నియోజకవర్గ జాగృతి ఇంచార్జ్ బొంకూరి ఐలయ్య సాగర్‌ను శాలువాతో ఘనంగా సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు. విధి నిర్వహణలో అంకితభావంతో పనిచేసి ప్రభుత్వ ప్రశంసలు అందుకోవడం అభినందనీయమని ఆయన పేర్కొన్నారు.

### నీట్ లాంగ్‌టర్మ్ శిక్షణ కోసం దరఖాస్తుల ఆహ్వానం

**నిర్మల్ ప్రతినిధి, (సింగిడి):** సోన్ మండలంలోని లెఫ్ట్ పోచంపాడు లో గల తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల విద్యాలయాల సంస్థ 2026- 27 విద్యా సంవత్సరానికి గాను నడపబడుతున్న నీట్ లాంగ్ టర్మ్ శిక్షణ కొరకు అర్హులైన విద్యార్థుల నుంచి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు నిర్మల్ జిల్లా సమన్వయకర్త ఆర్. ప్రశాంతి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. హైదరాబాద్ లోని చిలుకూరు సీఓఈ నందు బాలురకు, మహేంద్ర హిల్స్ ఫౌండేషన్ సీఓఈ నందు బాలికలకు ఉచిత శిక్షణ ఇవ్వబడుతుందని తెలిపారు. దరఖాస్తు చేసుకొనుటకు అభ్యర్థులు ఏదైనా కళాశాలలో 2025-26లో ఇంటర్మీడియేట్ బైపీసీ చదివి ఉత్తీర్ణులై ఉండాలని పేర్కొన్నారు. అర్హులైన విద్యార్థులు tgwreis. telangana.gov.in అను వెబ్సైట్ను సందర్శిస్తే నోటిఫికేషన్ పూర్తి వివరాలు, దరఖాస్తు పారంను పొందవచ్చని తెలిపారు.

## ప్రతి ఉద్యోగి మీ ప్రమాణం యాప్‌లో నమోదు కావాలి

**-కలెక్టర్ భవేశ్ మిశ్రా**



**నిర్మల్ ప్రతినిధి, (సింగిడి):** జిల్లాలోని ప్రభుత్వ శాఖల్లో పనిచేసే ప్రతి ఉద్యోగి మీ ప్రమాణం ముఖ గుర్తింపు హాజరు యాప్ లో నమోదు కావాలని జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా అధికారులను ఆదేశించారు. సోమవారం సాయంత్రం ఆయన మీ ప్రమాణం యాప్ నమోదు, జిల్లా సెన్సస్ హ్యాండ్ బుక్ రూపకల్పన అంశాలపై సంబంధిత అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, జిల్లాలోని అన్ని ప్రభుత్వ శాఖల్లో పనిచేసే ప్రతి స్థాయి రెగ్యులర్, కాంట్రాక్ట్, ఔట్ సోర్సింగ్ ఉద్యోగులు మీ ప్రమాణం యాప్ ద్వారానే హాజరు నమోదు చేసుకోవాలన్నారు. ఇప్పటివరకు నమోదు కాని శాఖలు వెంటనే నమోదు చేసుకోవాలని ఆదేశించారు. మీ ప్రమాణం హాజరు నమోదులో నిర్లక్ష్యం వహిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. శాఖాధిపతులు తప్పనిసరిగా ఎప్పటికప్పుడు సిబ్బంది హాజరు వివరాలు పర్యవేక్షిస్తూ ఉండాలని సూచించారు. అలాగే జిల్లా సెన్సస్ హ్యాండ్ బుక్ రూపకల్పన కోరకు, సంబంధిత శాఖల అధికారులు నిర్దేశిత సమాచారం అందించాలని ఆదేశించారు. శాఖల వారిగా అందించే ప్రతి సమాచారం పక్కాగా ఉండాలన్నారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్లు బి. వెంకటేశ్వర్లు, కిషోర్ కుమార్, డిఆర్ఓ రాథోడ్ రమేష్, ఇతర అధికారులు పాల్గొన్నారు.

## భక్తిశ్రద్ధలతో నాగుల పంచమి వేడుకలు

- పుట్టల వద్ద మహిళల ప్రత్యేక పూజలు..
- పాలాభిషేకాలతో నాగదేవతకు మొక్కులు



**కమాన్‌పూర్, (సింగిడి):** శ్రావణ శుక్ల పంచమిని పురస్కరించుకుని కమాన్‌పూర్ మండలంలో నాగుల పంచమి వేడుకలు భక్తిశ్రద్ధలతో ఘనంగా నిర్వహించారు. తెల్లవారుజాము నుంచే మహిళలు సంప్రదాయ దుస్తుల్లో పుట్టల వద్దకు చేరుకుని నాగదేవతకు ప్రత్యేక పూజలు చేశారు. మండలంలోని గుండారం, జూలపల్లి, పేరాపల్లి, రొంపికుంట, నాగారం, పెంచికలపేట తదితర గ్రామాల్లో పుట్టలకు పసుపు, కుంకుమ, పూలతో అలంకరించి, పాలతో అభిషేకం చేశారు. నాగదేవతను పూజిస్తే కుటుంబానికి శుభం కలుగుతుందని విశ్వసిస్తూ మహిళలు భక్తితో మొక్కులు చెల్లించుకున్నారు. సంతాన ప్రాప్తి, సర్పదోషం, రాహు--కేతు దోషాల నివారణతో పాటు కుటుంబంలో సుఖసంతోషాలు వెల్లివిరియాలని, పాడిపంటలు సమృద్ధిగా పండాలని కోరుకుంటూ ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. మండల కేంద్రంలోని శ్రీ ఆదివార స్వామి ఆలయం వద్ద ఉన్న నాగసర్పం వద్ద కూడా పెద్ద సంఖ్యలో మహిళలు తరలివచ్చి ప్రత్యేక పూజలు చేశారు. పాలు, పసుపు, కుంకుమ, పూలతో నాగదేవతను భక్తిశ్రద్ధలతో పూజించి తమ మొక్కులు తీర్చుకున్నారు. నాగుల పంచమి సందర్భంగా మండలవ్యాప్తంగా ఆలయాలు, పుట్టల వద్ద భక్తుల సందడి నెలకొంది. మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొనడంతో గ్రామాల్లో పండుగ వాతావరణం కనిపించింది.

## విద్యతో పాటు నైపుణ్యాలపై దృష్టి పెట్టాలి





- పెద్దపల్లి కలెక్టర్ కోయ శ్రీహర్ష
- బాలికల డిగ్రీ కళాశాలను పరిశీలించిన కలెక్టర్

**సుల్తానాబాద్, (సింగిడి):** విద్యార్థులకు నాణ్యమైన విద్యతో పాటు ఉపాధి అవకాశాలకు అవసరమైన నైపుణ్యాలను అభివృద్ధి చేయడంపై ప్రత్యేక దృష్టి సారించాలని జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష సూచించారు. సోమవారం సుల్తానాబాద్ మండల కేంద్రంలోని ఎం.జె.పి. టి.బి. సి.డబ్ల్యూ. ఆర్.ఐ.ఈ.ఎస్ బాలికల డిగ్రీ కళాశాల ను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా చాంబర్ ఆఫ్ డ్రీమ్స్‌ను ప్రారంభించి, డార్మిటరీ, వంట గది, తరగతి గదులను పరిశీలించారు. విద్యార్థులతో మాట్లాడి వారి విద్యాభ్యాసం, భవిష్యత్ లక్ష్యాలు, కెరీర్ అవకాశాలను తెలుసుకున్నారు. విద్యార్థులకు వారి ఆసక్తి, సామర్థ్యాలకు అనుగుణంగా కెరీర్ గైడెన్స్, ఉన్నత విద్య, వివిధ కోర్సులు, ఉద్యోగ అవకాశాలపై అవగాహన కల్పించాలని సూచించారు. అకడమిక్స్‌తోపాటుసాఫ్ట్ స్కిల్స్, కమ్యూనికేషన్ స్కిల్స్‌ను అభివృద్ధి చేసుకోవాలని కలెక్టర్ తెలిపారు. ౫ూౠఖ, ఎ-నబఎ ద్వారా అందిస్తున్న శిక్షణా కార్యక్రమాలను విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కళాశాల లో మౌలిక వసతులు, విద్యా సదుపాయాల మెరుగుదలకు అవసరమైన ప్రతిపాదనలు సమర్పించాలని అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో డీసీఓ మణిదీప్తి, కళాశాల ప్రిన్సిపాల్ వనజ, అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

# రూ.24.18 కోట్ల ధాన్యం దారి మళ్లింపు

- ఇద్దరు అరెస్ట్
- 5,020 మెట్రిక్ టన్నుల సీఎంఆర్ బకాయి
- మిల్లు మేనేజింగ్ పార్టనర్, పార్టనర్ పై కేసు
- పెద్దపల్లి డీసీపీ రామ్ రెడ్డి



**సుల్తానాబాద్,(సింగిడి):** ప్రభుత్వ ధాన్యాన్ని కస్టమ్ మిల్లింగ్ కోసం తీసుకుని సీఎంఆర్ బియ్యాన్ని ప్రభుత్వానికి అందించకుండా దారి మళ్లించిన వ్యవహారంలో ఇద్దరిని సుల్తానాబాద్ పోలీసులు అరెస్ట్ చేశారు. డీసీపీ రామ్‌రెడ్డి వెల్లడించిన వివరాల ప్రకారం.. కేఎంఎస్ 2023-24లో సుగ్లాంపల్లి లక్ష్మీ ఇండస్ట్రీస్‌కు 10, 015.636 మెట్రిక్ టన్నుల ప్రభుత్వ ధాన్యం అప్పగించగా, 6,662.880 మెట్రిక్ టన్నుల సీఎంఆర్ బియ్యం ప్రభుత్వానికి అందించాల్సి ఉంది. అయితే కేవలం 1,577.289 మెట్రిక్ టన్నుల బియ్యమే అందించి, 5,020.719 మెట్రిక్ టన్నుల సీఎంఆర్‌ను బకాయిగా ఉంచారు. దీంతో డిఫాల్ట్ ధాన్యం విలువను అధికారులు రూ. 24.18 కోట్లుగా గుర్తించారు.

ఈ నెల 6న సివిల్ సప్లైస్ అధికారులు మిల్లును తనిఖీ చేయగా, ప్రభుత్వానికి అప్పగించిన ధాన్యానికి సంబంధించిన నిల్వలు భౌతికంగా అందుబాటులో లేకపోవడంతో దుర్వినియోగం జరిగినట్లు నిర్ధారించారు. తెలంగాణ రాష్ట్ర పౌర సరఫరాల సంస్థ పెద్దపల్లి జిల్లా మేనేజర్ ముప్పిడి శ్రీకాంత్ ఫిర్యాదు మేరకు, మిల్లు మేనేజింగ్ పార్టనర్ రేణికుంట మధు, పార్టనర్ రేణికుంట రవీందర్‌రెడ్డిని సోమవారం ఉదయం పోలీసులు అరెస్ట్ చేశారు. నిందితులపై బీఎన్ఎస్ 316(2), 316(5), 318(3), 3(5) సెక్షన్లతో పాటు అత్యవసర సరుకుల చట్టం-1955లోని సెక్షన్ 7, తెలంగాణ రైస్ కస్టమ్ మిల్లింగ్ ఆర్డర్-2015లోని సెక్షన్ 7 కింద కేసులు నమోదు చేసి దర్యాప్తు కొనసాగిస్తున్నట్లు డీసీపీ తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏసీపీ గజ్జి కృష్ణ, సుల్తానాబాద్ సీఐ పొన్నమనేని రంజిత్‌రావు, ఎస్సై చంద్రకుమార్ తదితరులు పాల్గొన్నారు. కేసును ఛేదించడంలో సమర్థంగా వ్యవహరించిన సీఐ, ఎస్సైలను డీసీపీ రామ్‌రెడ్డి ప్రత్యేకంగా అభినందించారు.

# ప్రణాళికతో చదివితే ఉత్తమ ఫలితాలు

**చదువులో వెనుకబడ్డ విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ అవసరం**
**అర్హులైన వారందరికీ పెన్షన్లు మంజూరు.**
**ఇంకుడు గుంతలు, నీటి కుంటల నిర్మాణానికి ప్రోత్సహించాలి**
**కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్**





**గద్వాల బ్యూరో (సింగిడి):** ప్రతి ఒక్కరి జీవితంలో పదవ తరగతి ఎంతో కీలకమని, విద్యార్థులు ప్రణాళికతో చదివితే ఉత్తమ ఫలితాలు వస్తాయని జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ అన్నారు. మంగళవారం కలెక్టర్ మల్దకల్ మండల కేంద్రంలోని జెడ్పిహెచ్ఎస్ ను ఆకస్మికంగా సందర్శించారు. పదో తరగతి విద్యార్థులతోని మాట్లాడుతూ గతేడాది కంటే ప్రస్తుత ఏడాదిలో టాపర్లు పెరగాలని, వంద శాతం ఉత్తీర్ణత వచ్చేలా చదవాలని సూచించారు. విద్యార్థులు క్రమం తప్పకుండా పాఠశాలకు హాజరుకావాలని, గైర్హాజరైతే వివిధ సబ్జెక్టుల తరగతులను కోల్పోవాల్సి వస్తుందని తెలిపారు. చదువులో వెనుకబడ్డ విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని ఉపాధ్యాయులను ఆదేశించారు. విద్యార్థులు ప్రత్యేక తరగతులను సద్వినియోగం చేసుకోవాలని, పాఠ్యాంశాలను పునఃశ్చరణ చేసుకుంటే ఎక్కువ రోజులు గుర్తుంటాయన్నారు. అనంతరం కలెక్టర్ ఎఫ్ఏ1 ప్రోగ్రెస్ ను పరిశీలించి తగు సూచనలు చేశారు. వంటగదిని సందర్శించి విద్యార్థులకు మెనూ ప్రకారం రుచికరమైన భోజనాన్ని వడ్డించాలని ఆదేశించారు. వండిన పదార్థాలను పరిశీలించి, గుడ్లను కూడా తప్పనిసరిగా విద్యార్థులకు వడ్డించాలన్నారు. ఈ సందర్భంగా పాఠశాల పూర్వ విద్యార్థుల సహకారంతో చేపట్టిన వివిధ అభివృద్ధి పనుల గురించి ఉపాధ్యాయులు కలెక్టర్ కు తెలియజేశారు. అనంతరం మల్దకల్ గ్రామ పంచాయతీ కార్యాలయాన్ని కలెక్టర్ సందర్శించారు. ప్రభుత్వం అర్హులైన వారందరికీ కొత్తగా పెన్షన్లు ఇస్తుండడంతో వచ్చిన దరఖాస్తులపై ఆరా తీశారు. అర్హులైన ప్రతి ఒక్కరూ చేయూత పెన్షన్లు పొందేలా సంబంధిత అధికారులు పెద్ద ఎత్తున ప్రచారం చేసి వచ్చిన దరఖాస్తులను ఎప్పటికప్పుడు పరిశీలించాలన్నారు. గ్రామంలో ఉపాధి హామీ పథకం కూలీల వివరాలను అడిగి చేపట్టిన పనుల గురించి తెలుసుకున్నారు. జలసిరిలో భాగంగా ఇంకుడు గుంతలు, నీటి కుంటల నిర్మాణాలను పెద్ద ఎత్తున చేపట్టాలని ఆదేశించారు. వ్యక్తిగత, సామూహిక మరుగుదొడ్ల నిర్మాణాన్ని వేగవంతం చేయాలని, అభివృద్ధి పనులన్నింటినీ సకాలంలో పూర్తి చేయాలని సూచించారు. గ్రామపంచాయతీ స్థలాల్లో ఎవరైనా అనధికారికంగా డబ్బాలు ఏర్పాటు చేస్తే తగు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. అనుమతులు తీసుకున్న వారు సక్రమంగా నిర్దేశిత అద్దెలు చెల్లించడం వలన పంచాయితీకి ఆదాయ వనరులు పెరుగుతాయన్నారు. గ్రామంలో పనిచేస్తున్న మల్టీపర్పస్ కార్మికుల వివరాలను తెలుసుకొని వారికి సకాలంలో జీతాలను చెల్లించాలని ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ ఆదేశించారు. ఈ పర్యటనలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు నరేష్, పంచాయతీ కార్యదర్శి అర్జున్, ఉపాధ్యాయులు, తదితరులున్నారు.

# ఆడబిడ్డల ఆర్థిక భరోసా ఆత్మగౌరవాన్ని నిలిపింది కేసీఆర్

**కళ్యాణ లక్ష్మి, షాధిముబారక్ ఆపే కుట్రచేస్తే అంతు తెలుస్తాం**
**తులం బంగారం ఎగ్గొటెందుకు కళ్యాణ లక్ష్మి షాధిముబారక్ పథకాలకు ఎసరు..?**
**మాజీ మంత్రి సింగిరెడ్డి నిరంజన్ రెడ్డి మండిపాటు**



**వనపర్తి ప్రతినిధి, (సింగిడి):** ఆడబిడ్డల ఆర్థిక భరోసా, ఆత్మగౌరవాన్ని నిలిపే కళ్యాణ లక్ష్మి, షాధిముబారక్ పథకాలు ఆపే కుట్ర చేస్తే కాంగ్రెస్ ప్రభుత్వ అంతు తెలుస్తామని రాష్ట్ర మాజీ వ్యవసాయ శాఖ మంత్రి సింగిరెడ్డి నిరంజన్ రెడ్డి నిప్పులు చెరిగారు. కాంగ్రెస్ కుట్రలపై బీఆర్ఎస్ కదనభేరి పేరుతో మంగళవారం వనపర్తి జిల్లా కేంద్రంలోని రాజీవ్ చౌరస్తాలో నిరసన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమానికి మాజీ మంత్రి సింగిరెడ్డి నిరంజన్ రెడ్డి ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. ఈ సందర్భంగా నిరంజన్ రెడ్డి మాట్లాడుతూ తమ హక్కులు కాపాడుకోవడానికి, కేసీఆర్ ఇచ్చిన సంక్షేమ పథకా లను రద్దు చేయడాన్ని నిరసిస్తూ ఉప్పెనల తరలివచ్చిన మహి ళలను అభినందిస్తున్నానని చెప్పారు. అనాడు ఆడపిల్లల ఆత్మగౌరాన్ని, ఆర్థిక భరోసా నిలబెట్టడానికి కేసీఆర్ కళ్యాణ లక్ష్మి, షాధిముబారక్ పథకాలు ప్రారంభించారని కానీ నేటి రేవంత్ రెడ్డి తను ఇచ్చిన హామీ తులం బంగారంపై మహిళల నుండి వస్తున్న నిరసనను తట్టుకోలేక హైకోర్టులో వేసిన పిటిషన్ లకు కౌంటర్ దాఖలు చేయ కుండా నిర్లక్ష్యం చేసి కళ్యాణ లక్ష్మి, షాధిముబారక్ పథకాల రద్దుకు కుట్ర చేస్తుందని ఆయన ఆరోపించారు. బాల్య వివాహాలు నిరోధించ డానికి, పేదప్రజల పేగు బంధాన్ని కాపాడడా నికి 2014 అక్టోబర్ 14 న రూ. 50,116 రూపాయలతో ప్రారంభించి రూ. 1,00116 రూపాయలకు పెంచి కళ్యాణ లక్ష్మి, షాధిముబారక్ పథకాలు కొనసాగించారని అన్నారు. 2014 నుండి 2023 వరకు 13లక్షల 50వేల మందికి రూ. 14వేల కోట్లు కేసీఆర్ ఇచ్చారని గుర్తు చేశారు. కరోనా కాలంలో కూడా కేసీఆర్ కళ్యాణ లక్ష్మి, షాధిముబారక్ పథకాలతో పాటు లక్షలాది మంది మహిళలకు కేసీఆర్ కిట్టు అందించారని కొనియాడారు. 30 రోజులలో స్టే పై కౌంటర్ దాఖలు చేయడానికి సమయం ఉన్నా ఉద్దేశ్యపూర్వ కంగా ప్రభుతం నిరక్ష్యం చేసిందని నిరంజన్ రెడ్డి ఆరోపించారు. దశల వారీగా పథకాన్ని రద్దు చేయడానికి కాంగ్రెస్ పార్టీ 2024 నుండి 2025 వరకు 1లక్షా 58వేల మందికి, 2025 నుండి 2026 వరకూ కేవలం 86 వేల మందికి మాత్రమే కళ్యాణ లక్ష్మి, షాధిముబారక్ పథకాలు అందించిందని ఆయన దుయ్యబట్టారు. కళ్యాణ లక్ష్మి, షాధిముబారక్ పథకాలు కొనసాగిస్తూ కేసీఆర్ కిట్టు, రైతు బీమా పథకాలు పునరుద్ధరించాలని నిరంజన్ రెడ్డి డిమాండ్ చేశారు.

**పెంచుతామన్న ఆసరా పింఛన్ల జాడ ఏది?**

అధికారంలోకి వచ్చిన వెంటనే ఆసరా పింఛన్లు రూ. 4000, దివ్యాంగులకు రూ. 6000, ప్రతి మహిళకు రూ. 2500 ఇస్తామని రేవంత్ మోసం చేశారని, మోసం చేసిన రేవంత్ రెడ్డినీ మహిళలు గల్లా పట్టి నిలదీయాలని నిరంజన్ రెడ్డి పిలుపునిచ్చారు. ఒకవేళ ఎన్నికల ముందు ఇస్తామని ముందుకు వస్తే బకాయి పడ్డ మొత్తం చెల్లించాలని డిమాండ్ చేశారు.

**రేవంత్ రెడ్డి సర్కార్ సంక్షేమ పథకాల అమలులో విఫలం**

కేసీఆర్ పాలనలో సంక్షేమ పథకాలు అమలు చేశారని, రేవంత్ పాలనలో విధ్వంసం జరుగుతున్నదని చెప్పారు. అన్ని రంగాలను అగ్రభాగంలో కేసీఆర్ నిలిపారని, చంద్రబాబు హయాంలో రూ. 75 రూపాయల పింఛన్, ఒకరు చనిపోతే ఒకరికి పించన్లు ఇచ్చేవారని, వై.ఎస్. ఆర్ హయాంలో రూ. 200 పింఛన్ ఇచ్చారన్నారు. తెలంగాణ తోనే అభివృద్ధి సాధ్యమని కేసీఆర్ నమ్మి రాష్ట్రాన్ని సాధించారని, అధికారంలోకి వచ్చిన కేసీఆర్ రూ. 200 నుండి రూ. 2000 లకు పింఛన్లు పెంచారన్నారు. వృద్ధులకు, దివ్యాంగులందరికి 44 లక్షల మందికి పింఛన్లు అందించారని నిరంజన్ రెడ్డి చెప్పారు. దివ్యాంగులకు రూ. 4000, ఒంటరి మహిళలకు రూ. 2000 కేసీఆర్ ఇచ్చారని, అలవికాని అబద్ధాలతో రేవంత్ రెడ్డి అధికారంలోకి వచ్చి ప్రజలను ముంచారని ఆయన మండిపడ్డారు. ఏలినో పేరిట సాగు నీళ్లు అందించకుండా రైతులను మోసం చేస్తుందని. శ్రీశైలం ప్రాజెక్టులో చివరి నీటి బొట్టు కూడా వాడుకునే సౌకర్యం ఉన్నా రేవంత్ నిర్లక్ష్యంతో 5 టి.ఎం.సి లు ఆంధ్రా దోచుకెళుతుందని, 200 రోజులు మోటర్లు నడిపితే మన భూములు సస్యశ్యామలం అవుతాయని వివరించారు. మంత్రులు, ఎమ్మెల్యేలు బీఆర్ఎస్ పార్టీనీ తిట్టడం తప్పితే ప్రజల ప్రయోజనాలు పట్టవని, పోతిరెడ్డిపాడు సందర్శనను ఆంధ్రా పోలీసులు అడ్డుకున్నారని ఆయన మండిపడ్డారు. తెలంగాణ హక్కులు కాపాడడానికి వెళితే అక్రమంగా అడ్డుకున్నారని, సగం వర్షాకాలం ముగిసిన వ్యవసాయానికి కి నీళ్లు ఇవ్వలేని అసమర్థ ప్రభుత్వం రేవంత్ రెడ్డి దని చెప్పారు. ఆదిత్యా దాసు అనే ఆంధ్రా అధికారిని రేవంత్ తన దగ్గర పెట్టుకొని తెలంగాణ హక్కులకు భంగం కలిగిస్తున్నారని, అధికారులు ప్రజల పక్షాన పని చేయాలని, ప్రభుత్వానికి వంతపాడే అధికారుల అంతు తెలుస్తామని చెప్పారు. పాలమూరు రంగారెడ్డి ప్రాజెక్టు పడావ్ పెట్టడం సహించ మని, దీనిపై పోరాటం చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షులు గట్టు యాదవ్, వాకిటి శ్రీధర్, నందిమల్ల అశోక్, గంధం పరంజ్యోతి, కె. మాణిక్యం, మహిళా సర్పంచులు శోభా, పద్మ, రాజమ్మ, నందిమల్ల శారద, నాగమ్మ, షెమీం, కౌన్సిలర్స్ భారతి ప్రేమ్ నాథ్ రెడ్డి, మురళీ సాగర్, శ్రీకర్ గౌడ్, స్వాతి హరిబాబు, శిరీష రమేష్ గౌడ్, ఏర్వ అరుణ శ్రీనివాసులు, శంకరమ్మ బాబు నాయక్, విజయ్ కుమార్, రఘువర్ధన్ రెడ్డి, దేవర్ల నరసింహ, మాధవ్ రెడ్డి, మహేశ్వర్ రెడ్డి, మాజీ కౌన్సిలర్స్ లక్ష్మీనారాయణ, ఉంగ్లం తిరుమల్, నాగన్న యాదవ్, గులాం ఖాదర్ ఖాన్, జోహెబ్ హుస్సేన్ పాల్గొన్నారు.

# మైనర్ బాలికపై లైంగిక దాడి..

**నిందితుడికి 20 ఏళ్ల కఠిన కారాగార శిక్ష**
**భూపాలపల్లి జిల్లా ప్రధాన న్యాయమూర్తి జే. జీవన్ కుమార్ తీర్పు**



**జయశంకర్ భూపాలపల్లి బ్యూరో(సింగిడి):** మైనర్ బాలికపై లైంగిక దాడికి పాల్పడిన కేసులో నిందితుడికి 20 ఏళ్ల కఠిన కారాగార శిక్ష విధిస్తూ భూపాల పల్లి జిల్లా ప్రధాన న్యాయమూర్తి జే. జీవన్ కుమార్ మంగళవారం తీర్పు వెలువరిం చారు. కాటారం పోలీస్ స్టేషన్‌లో నమోదైన కేసులో ములుగు జిల్లా మల్లూరు శివారు మొట్లగూడెం గ్రామానికి చెందిన ఎలగొండ నవీన్‌పై నేరం రుజువు కావడంతో కోర్టు ఈ శిక్ష విధించింది. మల్హర్‌రావు మండలానికి చెందిన మైనర్ బాలిక హనుమకొండలో ఇంటర్ చదువుతున్న సమయంలో నవీన్‌కు ఇన్‌స్టాగ్రామ్ ద్వారా పరిచయమైంది. ప్రేమిస్తున్నానని నమ్మించి, పెళ్లి చేసుకుందామని చెప్పి 2021 ఏప్రిల్ 3న బాలికను ఇంటి నుంచి పిలిపించాడు. కాటారం మండలం బస్వాపూర్‌కు చేరుకున్న బాలికను ములుగు జిల్లా పస్రా మీదుగా బర్లగూడెంలోని తన స్నేహితుడి ఇంటికి తీసుకెళ్లి మూడు రోజుల పాటు నిర్బంధించి లైంగిక దాడికి పాల్పడ్డాడు. అనంతరం తన స్వగ్రామమైన మొట్లగూడెంకు తీసుకెళ్లి మరో రెండు రోజుల పాటు అదే విధంగా దాడికి పాల్పడ్డాడు.

**పటిష్ట ఆధారాలతో చార్జ్‌షీట్**

కుమార్తె కనిపించకపోవడంతో బాధితురాలి తండ్రి కాటారం పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా, అప్పటి కాటారం ఎస్ఐ సాంబమూర్తి కేసు నమోదు చేశారు. అప్పటి కాటారం డీఎస్పీ బోనాల కిషన్ దర్యాప్తు చేపట్టి నిందితుడిని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. అనంతరం పటిష్టమైన సాక్ష్యాధారాలతో చార్జ్‌షీట్ దాఖలు చేశారు. కోర్టు విచారణలో లైజన్ ఆఫీసర్ జి. వెంకన్న ఆధ్వర్యంలో కోర్టు డ్యూటీ ఆఫీసర్ కె. రమేష్ సాక్షులను హాజరుపరిచారు. స్పెషల్ పబ్లిక్ ప్రాసిక్యూటర్లు ఎన్. విష్ణువర్ధన్ రావు, వెంకట్రామ్ సమర్థవంతంగా వాదనలు వినిపించారు. సాక్ష్యాధారాలను పరిశీలించిన న్యాయస్థానం నిందితుడిపై నేరం రుజువైనట్లు నిర్ధారించి 20 ఏళ్ల కఠిన కారాగార శిక్ష విధించింది.

**పోలీసు అధికారులకు ఎస్పీ అభినందనలు**

కేసులో నిందితుడికి శిక్ష పడేలా సమర్థవంతంగా పనిచేసిన ప్రస్తుత కాటారం డీఎస్పీ సూర్యనారాయణ, సీఐ నాగార్జునరావు, ఎస్ఐ శ్రీనివాస్, కోర్టు మానిటరింగ్ ఆఫీసర్ పీసీఆర్ ఇన్‌స్పెక్టర్ రాజు, లైజన్ ఆఫీసర్ జి. వెంకన్న, కోర్టు డ్యూటీ ఆఫీసర్ కె. రమేష్, లీగల్ సపోర్ట్ ఆఫీసర్ జి. రజితతో పాటు అప్పటి దర్యాప్తు అధికారులను జిల్లా ఎస్పీ సిరిశెట్టి సంకీర్త్, ఐపీఎస్ ప్రత్యేకంగా అభినందించారు.

## నల్లగొండ మున్సిపల్ కార్పొరేషన్‌ను
# అన్ని రంగాలలో అభివృద్ధి చేస్తా

**రు 23.84 కోట్ల అభివృద్ధి పనులకు శంకుస్థాపన**
**రాష్ట్ర రోడ్లు, భవనాలు, సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి**




**నల్లగొండ ప్రతినిధి (సింగిడి):** నల్గొండ పట్టణంలో సిసి రోడ్లు, డ్రైన్లు, సెంట్రల్ లైటింగ్, తాగునీరు, విద్యుత్, పార్కులు అన్ని సదుపాయాలను కల్పించి సమస్యలు లేని పట్టణంగా, తెలంగాణలోనే నంబర్ వన్ మున్సిపల్ కార్పొరేషన్ గా తీర్చిదిద్దుతానని రాష్ట్ర రోడ్లు, భవనాలు, సినిమాటోగ్రఫీ శాఖల మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి తెలిపారు. మంగళవారం నల్గొండ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో వివిధ డివిజన్లో 23 కోట్ల 85 లక్షల రూపాయల వ్యయంతో చేపట్టనున్న అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు, భూమి పూజ చేశారు. 3 వ డివిజన్లో షెడ్యూల్ తెగల సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో ఎస్టీ కాలనీ నుండి శేషమ్మ గూడెం మీదుగా, అద్దంకి రహదారి వం-కు 9 కోట్ల 40 లక్షల రూపాయల వ్యయంతో నిర్మించనున్న హై లెవెల్ బ్రిడ్జి, రోడ్డు పనులకు శంకుస్థాపన చేశారు. మాట్లాడుతూ నల్గొండ పట్టణ అభివృద్ధికి అన్ని రకాల చర్యలు తీసుకుంటున్నామని, పట్టణానికి బయట 900 కోట్ల రూపాయలతో ఔటర్ రింగ్ రోడ్డును చేపట్టడం జరిగిందని, పట్టణంలో 500 కోట్లతో చేపట్టిన సిసి రహదారులు, డ్రైన్ల పనులు పురోగతిలో ఉన్నాయని, మారుమూల శివారు ప్రాంతాలను కలుపుకొని నల్గొండ మున్సిపల్ కార్పొరేషన్ అభివృద్ధికి చర్యలు తీసుకుంటున్నట్లు మంత్రి తెలిపారు. పట్టణంలో రహదారుల ఏర్పాటుతోపాటు, సైడ్ డ్రైన్లు, సెంట్రల్ లైటింగ్ ,విద్యుత్, త్రాగునీటి సౌకర్యాలని కల్పిస్తున్నామని, పట్టణానికి 24 గంటలు తాగునీరు అందించేలా ఇటీవల రాష్ట్ర ముఖ్యమంత్రి ఏ. రేవంత్ రెడ్డి 83 కోట్ల రూపాయలతో వాటర్ ప్లాంట్ కు శంకుస్థాపన చేయగా, నెల రోజుల్లో ఆ వాటర్ ప్లాంట్ ద్వారా తాగునీరు అందించే పనులు శరవేగంగా నడుస్తున్నాయని, పట్టణానికి తాగినీటి కై ముఖ్యమంత్రిని ఒప్పించి మరో 300 కోట్ల రూపాయలు తీసుకొచ్చినట్లు తెలిపారు. ఇదివరకే పట్టణంలో 125 కోట్ల రూపాయలతో 12 తాగునీటి ట్యాంకులు చేపట్టగా, అందులో ఒకటి పూర్తి అయిందని, డిసెంబర్ నాటికి తక్కిన 11 వాటర్ ట్యాంకుల నిర్మాణాలు పూర్తయితాయని వెల్లడించారు. పట్టణంలో విద్యుత్ సమస్య లేకుండా ప్రధాన కాలనీలతో పాటు, శివారు గ్రామాలలో కూడా ఒక్కొక్కటి 3 కోట్ల రూపాయలు వెచ్చించి సబ్ స్టేషన్లు మంజూరు చేయడం జరిగిందని తెలిపారు. పట్టణంలో పార్కులను అభివృద్ధి చేస్తున్నామని, అవసరమున్న చోట స్మశాన వాటికలు, దేవాలయాలు, చర్చిలు మసీదులను కట్టిస్తున్నామని, పట్టణానికి మొదటి విడత 700 ఇందిరమ్మ ఇండ్లు మంజూరు చేసామని, అవసరమైతే మరిన్ని ఇండ్లు మంజూరు చేసేందుకు సిద్ధంగా ఉన్నామని, ఈ నెల 15న గొల్లగూడ సమీపంలో నిర్మించిన 552 డబుల్ బెడ్ రూమ్ ఇండ్లను నిష్పక్షపాతంగా, పార్టీలకతీతంగా లబ్ధిదారులకు అందించామని, నల్గొండ ను సమస్యలు లేని పట్టణంగా తీర్చిదిద్దాలన్నదే తన ధ్యేయమని చెప్పారు. పట్టణంలో లతీఫ్ సాబ్ గుట్ట, శివాలయం గుట్టలకు 150 కోట్ల రూపాయలతో రహదారులను మంజూరు చేయగా పనులు పురోగతిలో ఉన్నాయని, అంతేకాక రోప్ వే కూడా ఏర్పాటు చేస్తున్నామని, పట్టణంలో ప్రఖ్యాతిగాంచిన ఛాయా సోమేశ్వర దేవాలయాన్ని పర్యాటకంగా అభివృద్ధి చేసేందుకు 150 కోట్ల రూపాయల ప్రతిపాదనలను ప్రభుత్వానికి సమర్పించామని, పట్టణంలోని శ్రీనివాస్ నగర్ కాలనీ సమస్యలు తీరుస్తామని, పట్టణానికి నడిబొడ్డున ఉన్న నాగార్జున కళాశాల బ్లాక్ ను అభివృద్ధి చేసేందుకు ప్రణాళిక రూపొందిస్తున్నామని, తెలంగాణలోనే మొదటి కళాశాలగా పేరుపొందిన ఎన్జీ కళాశాలను మోడల్ కళాశాలగా తీర్చిదిద్దేందుకు ప్రతీక్ ఫౌండేషన్ ద్వారా చర్యలు తీసుకుంటున్నట్లు వెల్లడించారు. జిల్లా కలెక్టర్ బి. చంద్రశేఖర్ మాట్లాడుతూ పట్టణంలో రహదారులు, మౌలిక సదుపాయాల కల్పన వల్ల పట్టణం మరింత అభివృద్ధి చెందేందుకు అవకాశం ఉందని అన్నారు. నల్గొండ మేయర్ బుర్రి చైతన్య శ్రీనివాసరెడ్డి . మాజీ మున్సిపల్ చైర్ పర్సన్, కార్పొరేటర్ బొడ్డుపల్లి లక్ష్మీ శ్రీనివాస్, కార్పొరేటర్లు యమ కవిత, కేసాని వేణు గోపాల్ రెడ్డి, మల్లీశ్వరి, డిప్యూటీ మేయర్ ఆమీర్ అలీ, మున్సిపల్ కమిషనర్ వంశీ, ఆర్ అండ్ బి ఎస్ ఈ పున్నమోహన్, ఈ ఈ శ్రీధర్ రెడ్డి, డి ఈ గణేష్, ఆర్ డి ఓ అశోక్ రెడ్డి, మార్కెట్ కమిటీ చైర్మన్ జూకూరీ రమేష్, తహసిల్దార్ పరశురాం, మాజీ జెడ్పిటిసి గుమ్ముల మోహన్ రెడ్డి, డిటిడిఓ, ఏసీఎస్ డైరెక్టర్ ఆలకుంట్ల నాగరత్నం రాజు, కార్పొరేటర్లు స్వాతి, పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు ఎడ్ల శ్రీనివాస్ యాదవ్, 3వ వార్డు ఇంచార్జ్, యూత్ కాంగ్రెస్ పట్టణ అధ్యక్షుడు గాలి నాగరాజు, జాతీయ రహదారి అధికారులు, తదితరులు ఉన్నారు.

## అంగుళం సుద్దముక్కపై
# నేతాజీ ప్రతిమ

**సూక్ష్మ కళతో స్వాతంత్ర్య సమరయోధుడికి నివాళి**

**కోదాడ, (సింగిడి):** కోదాడకు చెందిన సూక్ష్మ కళాకారుడు నరేష్‌చారి తన కళా నైపుణ్యాన్ని చాటుకున్నారు. అంగుళం పరిమాణం గల సుద్ద ముక్కపై స్వాతంత్ర్య సమరయోధుడు నేతాజీ సుభాష్‌చంద్రబోస్ ప్రతిమను అత్యంత సూక్ష్మంగా చెక్కి ఆకట్టుకున్నారు. మంగళవారం నేతాజీ వర్ధంతిని పురస్కరించుకుని ఆయన స్వాతంత్ర్య ఉద్య మంలో చేసిన పోరాటాలు, దేశానికి చేసిన సేవలను స్మరించుకుంటూ ఈ కళాఖండాన్ని రూపొందించినట్లు నరేష్‌చారి తెలిపారు. దేశ స్వాతంత్ర్యం కోసం నేతాజీ చేసిన త్యాగాలు, ధైర్యసాహసాలు నేటి తరానికి స్ఫూర్తిదాయకమని పేర్కొన్నారు. చిన్నపాటి సుద్దముక్కపై నేతాజీ ముఖ కవళికలను ప్రతిబింబించేలా ప్రతిమను చెక్కడం ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. సూక్ష్మ కళ ద్వారా స్వాతంత్ర్య సమరయోధుడికి వినూత్నంగా నివాళులర్పించిన నరేష్‌చారి ప్రతిభను పలువురు అభినందించారు.



# విద్యార్థులను తీర్చిదిద్దే బాధ్యత అందరి పైన ఉంది

**కలెక్టర్ బి చంద్రశేఖర్**



**నల్గొండ ప్రతినిధి (సింగిడి):** పీఎం శ్రీ పాఠశాలల నుండి వచ్చే విద్యార్థులను అన్ని రంగాలలో సామర్థ్యం కలిగి ఉండేలా తీర్చిదిద్దాల్సిన అవసరం ఉందని జిల్లా కలెక్టర్ బి. చంద్రశేఖర్ అన్నారు. మంగళవారం కలెక్టర్ కార్యాలయ సమావేశ మందిరంలో పీఎం శ్రీ పాఠశాలలపై ఏర్పాటు చేసిన సమీక్షా సమావేశంలో మాట్లాడుతూ విద్యార్థులను అన్ని అంశాలలో ప్రతిభావంతు లుగా తీర్చిదిద్దేందుకు వారిలో ఉన్న సృజనాత్మకతను బయటికి తీయాలని, పిఎం శ్రీ పాఠశాలల ప్రిన్సిపాల్స్, హెడ్మాస్టర్లను ఆదేశించారు. చదువుతోపాటు, విద్యార్థి అన్ని అంశాలలో మూర్తిమత్వం అభి వృద్ధి చెందేలా పీఎం శ్రీ పాఠశాలల విద్యార్థులను తయారు చేయాలన్నారు. ఇందుకు ప్రభుత్వం ద్వారా వచ్చే అన్ని రకాల సౌకర్యాలను సద్వినియోగం చేసుకోవాలని, వివిధ అంశాలలో ప్రతి విద్యార్థిని ప్రత్యేకంగా విశ్లేషించి వారి అభివృద్ధికి, మెరుగైన విద్యను అందించే చర్యలు తీసుకోవాల న్నారు. ప్రత్యేకించి తరగతి గదిలో వెనుకబడిన విద్యార్థులను గుర్తించి వారిని చదువుతోపాటు, ఇతర అంశాలలో రాణించే విధంగా శిక్షణ ఇవ్వాలన్నారు. ప్రస్తుతం పి ఎం శ్రీ పాఠశాలలో ఉన్న ప్రతి విద్యార్థి మూల్యాంకన పద్ధతులను మార్చాలని ,వారి ఆంగ్ల భాషా నైపుణ్యాభివృద్ధికి స్పెల్ బి పోటీ లను ఏర్పాటు చేయాలని, బాలికలలో నాయకత్వ లక్షణాలు పెంపొందించేందుకు సమాజంలో రోల్ మోడల్స్ గా ఉన్న మహిళల, ద్వారా చైతన్యం చేసే విధంగా చర్యలు తీసుకోవాల న్నారు. పిఎం శ్రీ పాఠశాలల్లో రొటీన్ కు భిన్నంగా చదువు ఉండాలని, చదువుతోపాటు, అన్ని అంశాలలో అభివృద్ధి కనిపించాలని, ప్రత్యేకించి బాలికలు పురుషులతో పాటు సమానంగా ముందుకు రావాల్సిన అవసరం ఉందని, బాలికలకు ఇచ్చే స్వీయ రక్షణ అంశంలో ఏవైనా లోటుపాట్లు ఉంటే సరిదిద్దుకో వాలని చెప్పారు. వచ్చే బాలల దినోత్సవం నాటికి 8, 9, 10 తరగతి విద్యార్థులకు టైపింగ్ లో ప్రావీణ్యం పొందేలా శిక్షణ ఇచ్చి ఉత్తమ విద్యార్థులను సన్మానించే విధంగా చర్యలు తీసుకో వాలని చెప్పారు. విద్యార్థులలో అవగాహన కోసం క్షేత్రస్థాయి పర్యటనకు ముందు నుండే ప్రణాళిక రూపొందించుకో వాలని అన్నారు. స్థానిక సంస్థల ఇంచార్జ్ అదనపు కలెక్టర్ ప్రేమ్ కరణ్ రెడ్డి, శిక్షణ సహాయ కలెక్టర్ శ్రీకాంత్ రెడ్డి, డిఇఓ సుసింధర్ రావు, ఎంఈఓ లు, పిఎం శ్రీ పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, తదితరులు ఈ సమావేశానికి హాజరయ్యారు.

# చట్టం ముందు ఎవరైనా ఒక్కరే.. శాంతిభద్రతల విషయంలో రాజీ లేదు..!!

**పోలీసింగ్‌లో అలసత్వానికి తావులేదు.. ప్రతి కేసును నిష్పక్షపాతంగా దర్యాప్తు చేయాలి**
**రౌడీ, హిస్టరీ షీటర్ల కదలికలపై నిరంతర నిఘా**
**రామగుండం సీపీ**






**గోదావరిఖని, (సింగిడి):** శాంతిభద్రతల పరిరక్షణ, చట్టాల అమలులో ఎట్టి పరిస్థితుల్లోనూ రాజీపడేది లేదని రామగుండం పోలీస్ కమిషనర్ అంబర్ కిశోర్ ఝా స్పష్టం చేశారు. ప్రజలకు మెరుగైన పోలీసింగ్ అందించడమే లక్ష్యంగా అధికారులు నిరంతరం అప్రమత్తంగా పనిచేయాలని సూచించారు. చట్టవిరుద్ధ కార్యకలా పాలకు పాల్పడే వారిపై కఠినంగా వ్యవహరిం చాలని ఆదేశించారు. వార్షిక తనిఖీల్లో భాగంగా మంగళ వారం గోదావరిఖని ఏసీపీ కార్యాలయాన్ని సీపీ అంబర్ కిశోర్ ఝా తనిఖీ చేశారు. కార్యాలయానికి చేరుకున్న సీపీకి పెద్దపల్లి డీసీపీ బి. రామ్ రెడ్డి, గోదావరిఖని ఏసీపీ ఎం. రమేష్ పుష్పగుచ్ఛం అందజేసి స్వాగతం పలికారు. అనంతరం సాయుధ పోలీసులు గౌరవ వందనం సమర్పించారు. కేసుల దర్యాప్తుపై ప్రత్యేక సమీక్ష,ఏసీపీ కార్యాలయంలోని వివిధ రికార్డులను సీపీ క్షుణ్ణంగా పరిశీలించారు. గోదావరిఖని సబ్ డివిజన్ పరిధిలో దర్యాప్తులో ఉన్న కేసులు, వాటి పురోగతి, నిందితుల అరెస్టులు, ఎస్సీ/ఎస్టీ అట్రాసిటీ చట్టం కింద నమోదైన కేసుల స్థితిగతులు, పెండింగ్ కేసులపై అధికా రులతో సమీక్ష నిర్వహించారు. కేసుల దర్యాప్తులో జాప్యం జరుగుతున్న కారణాలను ఏసీపీ ఎం. రమేష్‌ను అడిగి తెలుసుకున్నారు. రౌడీ, హిస్టరీ షీటర్లపై నిఘా ముమ్మరం, రౌడీషీటర్లు, హిస్టరీ షీటర్లపై ప్రత్యేక నిఘా కొనసాగిం చాలని సీపీ ఆదేశించారు. వారి కదలికలను నిరంతరం పర్య వేక్షిస్తూ, శాంతిభద్రతలకు విఘాతం కలిగించే అవకాశం ఉన్న వ్యక్తులపై ముందస్తు నిఘా ఉంచాలని సూచించారు. చట్టవిరుద్ధ కార్యకలాపాల కు పాల్పడే వారిపై ఎలాంటి ఉపేక్ష లేకుండా చట్టప్రకారం కఠిన చర్యలు తీసుకోవాలని స్పష్టం చేశారు.

**సివిల్, భూవివాదాల్లో పోలీసుల జోక్యం వద్దు**

సివిల్, భూవివాదాల విషయంలో పోలీసులు అనవసరంగా జోక్యం చేసుకోరాదని సీపీ స్పష్టం చేశారు. చట్టపరమైన నిబంధనలకు అనుగుణంగా మాత్రమే వ్యవహరించాలని అధికారులకు సూచించారు. పోలీస్ స్టేషన్‌కు వచ్చే ప్రతి ఫిర్యాదును బాధ్యతగా స్వీకరించి, నిబంధనల ప్రకారం విచారణ చేపట్టాలని ఆదేశించారు. బాధితులకు సత్వర న్యాయం అందించాలి. ప్రతి కేసును నిష్పక్షపాతంగా దర్యాప్తు చేసి బాధితులకు న్యాయం జరిగేలా చర్యలు తీసుకోవాలని సీపీ సూచించారు. ప్రజలతో మర్యాదగా వ్యవహరిస్తూ, వారి సమస్యలను త్వరితగతిన పరిష్కరించేలా పోలీసింగ్‌ను మరింత ప్రజలకు చేరువ చేయాలని అన్నారు. శాంతిభద్రతల పరిరక్షణలో అధికారులు, సిబ్బంది సమన్వయంతో పనిచేయాలని సూచించారు. పచ్చదనానికి పెద్దపీట తనిఖీ అనంతరం సీపీ అంబర్ కిశోర్ ఝా పోలీసు అధికారులతో కలిసి ఏసీపీ కార్యాలయ ఆవరణలో మొక్కలు నాటారు. పర్యావరణ పరిరక్షణలో భాగంగా ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి వాటి సంరక్షణకు బాధ్యత తీసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో పెద్దపల్లి డీసీపీ బి. రామ్ రెడ్డి, గోదావరిఖని ఏసీపీ ఎం. రమేష్, సబ్ డివిజన్ పరిధిలోని సీఐలు, ఎస్ఐలు, ఇతర పోలీసు అధికారులు పాల్గొన్నారు.

## రోడ్డు ప్రమాదంలో గాయపడిన కౌన్సిలర్‌ను
# పరామర్శించిన మంత్రి జూపల్లి కృష్ణారావు



**కాగజ్ నగర్ (సింగిడి):** ప్రమాదానికి గురైన కాంగ్రెస్ నాయకురాలు కాగజ్ నగర్ మున్సిపల్ కౌన్సిలర్ ఏమ్మాజీ శారద ను నేరుగా వారి నివాసానికి వెళ్ళి పరామర్శించిన రాష్ట్ర మంత్రి ప్రముఖ ప్రజాప్రతినిధుల బృందం గత కొన్ని రోజుల క్రితం చోటుచేసుకున్న తీవ్ర రోడ్డు ప్రమాదంలో గాయపడిన కౌన్సిలర్ ఏమ్మా జీ శారద సంతోష్ ని రాష్ట్ర పర్యాటక, ఎక్సైజ్ శాఖ మంత్రి వర్యులు జూపల్లి కృష్ణారావు పరామర్శించారు. శారద సంతోష్ నివాసానికి స్వయంగా విచ్చేసిన మంత్రి, వారి ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకు న్నారు బాధితురాలు త్వరగా కోలుకోవా లని, భవిష్యత్తులో మరింత ఉన్నత పద వులు అధిరోహించి ప్రజలకు నిరంత రం సేవ చేసే శక్తి సామర్థ్యాలు ప్రాప్తించా లని ఆకాంక్షించారు ఈ కార్యక్రమంలో మంత్రి జూపల్లి కృష్ణారావు తో పాటు ప్రజాప్రతిని ధులు ముఖ్య నాయకులు పాల్గొని సంఘీ భావం తెలిపారు దండే విఠల్ ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా ఎమ్మెల్సీ ఆత్రం సుగుణ జిల్లా అధ్యక్షురాలు , అనిల్ గ్రంథాలయ కమిటీ చైర్మన్ షాహిన్ సుల్తానా మున్సిపల్ చైర్మన్ దస్తగిరి మాజీ మున్సిపల్ చైర్మన్ విశ్వ ప్రసాద్, మంగ మరియు స్థానిక నా యకులు ఈ కార్యక్రమంలో స్థానిక మున్సి పల్ కౌన్సిలర్లు, కాంగ్రెస్ పార్టీ సీని యర్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# పాపన్న గౌడ్ ఆశయాలే గౌడ సమాజానికి మార్గ దర్శకం

**పెద్దపల్లి గ్రంథాలయ సంస్థ చైర్మన్ అంతటి అన్నయ్య గౌడ్**
**ఘనంగా సర్వాయి పాపన్న జయంతి వేడుకలు**




**సుల్తానాబాద్, (సింగిడి):** సామాజిక సమానత్వం, ఆత్మగౌరవం కోసం పోరా డిన సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ ఆశయాలను నేటి తరానికి అం దించా ల్సిన బాధ్యత మనంద రిపై ఉందని పెద్దపల్లి గ్రంథాల య సంస్థ చైర్మన్ అంతటి అన్నయ్య గౌడ్ అన్నారు. సుల్తానాబాద్ మండల కేంద్రంలో గౌడ సంఘం ఆధ్వర్యంలో స ర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ 376వ జయంతి వే డుకల ను ఘనంగా నిర్వహించారు. కార్యక్ర మా నికి ముఖ్య అతిథిగా హాజరైన అన్నయ్య గౌడ్ పా పన్న గౌడ్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళు లర్పించారు. అనం తరం కేక్ కట్ చేసి స్వీట్లు పం పిణీ చేశారు. ఈ సందర్భంగా అన్నయ్య గౌడ్ మా ట్లాడుతూ.. పాపన్న గౌడ్ చూపిన ధైర్యం, పోరా ట స్ఫూర్తి, సామాజిక చైతన్యం నేటి యువతకు ఆద ర్శమన్నారు. గౌడ సమాజం ఐక్యంగా ముందుకు సాగుతూ విద్య, ఉపాధి, సామాజిక అభివృద్ధికి ప్రాధాన్యత ఇవ్వాలని పిలుపు నిచ్చారు. పాపన్న గౌడ్ చరిత్రను భావితరాలకు తెలియజేసేలా జ యంతి వేడుకలను ఘనంగా నిర్వహించడం అభి నందనీయమన్నారు. ఈ కార్యక్రమంలో మున్సి పల్ వైస్ చైర్‌పర్సన్ అంత టి పుష్పలత, మున్సి పల్ కమిషనర్ తిప్పరాజు రమేష్, 14వ వార్డు కౌ న్సిలర్ వేగోళం పద్మ అబ్బయ్య గౌడ్,మాజీ మున్సి పల్ చైర్‌పర్సన్ ముత్యం సునీత, పెద్దపల్లి బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు తాళ్లపల్లి మనోజ్‌తో పాటు గౌడ సంఘ అడక్ కమిటీ అధ్యక్షుడు పొ న్నం తిరుపతి గౌడ్ ,ఉపాధ్యక్షుడు కొయ్యడ శ్రీని వాస్ గౌడ్, గడ్డం సత్యనారాయణ గౌడ్, అంతటి లచ్చయ్య గౌడ్, పోడేటి వెంకటేష్ గౌడ్, గోదావరి అర్బన్ బ్యాంక్ మేనేజర్ అంతటి చిరంజీవి గౌడ్, అంతటి సాగర్ గౌడ్, బత్తిని కృష్ణ గౌడ్, చేపూరి ర వీందర్ గౌడ్, మంద శివ గౌడ్, బండి సంపత్ గౌడ్, మంద కిషన్ గౌడ్, పెరమండ్ల రమేష్ గౌడ్, వీర య్య గౌడ్, గౌడ సభ్యులు, అభిమానులు పాల్గొ న్నారు.

# మంత్రి సీతకను కలసిన ఎమ్మెల్యే

**మంజూరైన రోడ్ల పనులు ప్రారంభించేలా చర్యలు చేపట్టాలని వినతి**
**బాసరలో బంజారా సంఘానికి ఒక ఎకరం స్థలం ఇవ్వాలని విన్నపం**



**నిర్మల్ ప్రతినిధి, (సింగిడి):** పంచాయతీరాజ్ శాఖ మంత్రి సీతక్కను మంగళవారం ఎమ్మెల్యే పవార్ రామరావ్ పటేల్ కలిసి పలు సమస్యలను విన్నవించారు. హమ్ పథకంలో మంజూరైన రోడ్ల పనులు త్వరితగతిన ప్రారంభించేలా చర్యలు చేపట్టాలని విన్నవించారు. నియోజకవ ర్గంలో ని గ్రామీణ ప్రాంతాల్లో రోడ్లు పెద్ద మొత్తంలో దెబ్బతిన్నాయని, గత ప్రభు త్వం, పాలకుల నిర్లక్ష్య వైఖరి మూలంగా ప్రజలు ఇబ్బందులు పడ్డారని, ఇకనైనా రోడ్ల నిర్మాణాలు చేపట్టి రవాణా మార్గాన్ని మెరుగుపరచాల్సిందిగా కోరారు. కొన్నిచోట్ల డబుల్ లైన్ రోడ్లు వేయాల్సిందిగా వినతి పత్రంలో పేర్కొన్నారు. నియోజకవర్గంలోని రోడ్ల దుస్థితిపై, పంచాయతీరాజ్ శాఖ ఆధ్వర్యంలో చేపట్టే అభివృద్ధిపై వారిద్దరి మధ్య చర్చ జరిగింది. అదేవిధంగా బాసర జ్ఞాన సరస్వతి అమ్మవారి సన్నిధిలో బంజారాల కోసం ఒక ఎకరం స్థలాన్ని ఇవ్వాలని కోరారు. దేశంలోనే ప్రముఖ పుణ్యక్షేత్రమైన బాసరకు దేశ నలుమూలల నుండి గిరిజనులు వస్తారని, వారి సౌకర్యార్థం సేవాలాల్ మహారాజ్ సంఘ భవనం నిర్మించాల్సిన అవసరం ఉందన్నారు. దీనికి మంత్రి సానుకూలంగా స్పందించారని చెప్పారు. అయన వెంట నాయకులు సాంప్లీ రమేష్ తో పాటు పలువురు ఉన్నారు.

# అంకుశపూర్-తట్టుగూడెం మధ్య హై లెవెల్ వంతెనకు శంకుస్థాపన



**కొమురం భీం (సింగిడి):** గ్రామీణ ప్రాంతాల కు మెరుగైన రవాణా సౌకర్యాలు కల్పించి, ప్రధాన రహదారుల తో అనుసం ధానం చేసేందుకు ప్రభుత్వం అభివృద్ధి కార్యక్రమాలను చేపడుతోందని రాష్ట్ర ఆబ్కారీ, మద్యనిషేధ, పర్యాటక, సాంస్కృతిక, పురావస్తు శాఖ మంత్రి, జిల్లా ఇన్‌చార్జి మంత్రి జూపల్లి కృష్ణారావు తెలిపారు. కొమురం భీం ఆసిఫాబాద్ జిల్లా కాగజ్‌నగర్ మండలం అంకుశపూర్-తట్టుగూడెం మధ్య రూ. 8.50 కోట్ల అంచనా వ్యయంతో నిర్మించనున్న హై లెవెల్ వంతెనకు మంగళవారం మంత్రి జూపల్లి కృష్ణారావు ఎమ్మెల్సీ దండే విఠల్, సిర్పూర్ ఎమ్మెల్యే డాక్టర్ పాల్వాయి హరీష్ బాబు, జిల్లా కలెక్టర్ కె.హరిత, అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) యువరాజ్ మర్మాట్, కాగజ్‌నగర్ ఆర్డీవో చెన్నూరి కిష్టయ్య, ఆర్అండ్‌బీ శాఖ అధికారులతో కలిసి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ వర్షాకాలంలో వాగులు, వంకలు పొంగిపొర్లడంతో ప్రజలు ఎదుర్కొంటున్న రవాణా ఇబ్బందులకు హై లెవెల్ వంతెన శాశ్వత పరిష్కారం చూపుతుందని అన్నారు. వంతెన పూర్తయితే కాగజ్‌నగర్-వాంకిడి ప్రాంతాల మధ్య రవాణా అనుసంధానం మెరుగుపడుతుం దని తెలిపారు. గ్రామీణ ప్రాంతాల ప్రజలు సమీప పట్టణాలు, మార్కెట్లు, విద్యాసంస్థలు, ఆసుపత్రుల కు సులభంగా చేరుకునే అవకాశం కలుగుతుందని పేర్కొన్నారు. వరదల సమయంలోనూ ప్రజలకు సురక్షితమైన రాకపోకలు సాగించేందుకు వంతెన ఎంతో దోహదపడుతుందని మంత్రి అన్నారు. పనులను నాణ్యతా ప్రమాణాలకు అనుగుణంగా, నిర్దేశిత అంచనాలు, సాంకేతిక ప్రమాణాల మేరకు చేపట్టి త్వరితగతిన పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో వివిధ శాఖల అధికారులు, ప్రజాప్రతినిధులు, స్థానిక నాయ కులు, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

# పాపన్న గౌడ్ జీవితం.. పోరాట స్ఫూర్తికి ప్రతీక

**కలెక్టర్ కుమార్ దీపక్**



**మంచిర్యాల, (సింగిడి):** సమాజంలో ఎలాంటి ప్రతికూల పరిస్థితులు ఎదురైనా ఆత్మవి శ్వాసంతో ముందుకు సాగితే లక్ష్యాలను సాధించ వచ్చని సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ జీవితం చాటి చెబుతుందని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. పాపన్న గౌడ్ జీవితం కేవలం ఒక చారిత్రక ఘట్టం కాదని.. కష్టాలను ఎదుర్కొంటూ సమాజ ప్రగతి కోసం పోరాడే ప్రతి ఒక్కరికీ స్ఫూర్తినిచ్చే ఆదర్శమని పేర్కొన్నారు.

**సమష్టి కృషితోనే ప్రగతి**

సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ జయంతిని పురస్కరిం చుకొని మంగళవారం నస్పూర్‌లోని సమీకృత జిల్లా కార్యాలయాల భవన సమావేశ మందిరంలో జిల్లా వెనుకబడిన తరగతుల సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో వేడుకలు నిర్వహించారు. కార్యక్రమానికి జిల్లా అదనపు కలెక్టర్లు పి. చంద్రయ్య, వి. రాములు, జిల్లా రెవెన్యూ అధికారి మోతీరామ్, ట్రైనీ డిప్యూటీ కలెక్టర్ మహమ్మద్ విలాయత్ అలీ, వెనుకబడిన తరగతుల అభివృద్ధి అధికారి రాజేశ్వరి, కలెక్టరేట్ పరిపాలన అధికారి శ్రీనివాసరావు దేశ్‌పాండే తదితరులతో కలిసి కలెక్టర్ హాజరయ్యారు. ముందుగా పాపన్న గౌడ్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. అనంతరం జ్యోతి ప్రజ్వలన చేసి, కొబ్బరికాయ కొట్టి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జీవితంలో ఎదురయ్యే సమస్యలను చూసి వెనుకడుగు వేయ కుండా ఒక్కో చిన్న లక్ష్యాన్ని సాధిస్తూ ముందుకు సాగితే పెద్ద లక్ష్యాలను సైతం చేరుకోవచ్చన్నారు. సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ జీవితం నుంచి ఇదే ప్రధాన సందేశాన్ని ప్రతి ఒక్కరూ గ్రహించాల్సిన అవసరం ఉందన్నారు. ఆత్మవిశ్వాసంతో పాటు సమష్టి కృషి ఉంటే ఆశించిన ఫలితాలను సాధించవ చ్చని తెలిపారు. వ్యక్తిగత అభివృద్ధితో పాటు సమాజ అభివృద్ధికి ప్రతి ఒక్కరూ తమ వంతు బాధ్యతగా కృషి చేయాలని సూచించారు.

**ఆశయాలను భావితరాలకు చేర్చాలి**

మహనీయుల జీవిత చరిత్రలు, వారి ఆశయాలు, ఆచరణాత్మక విధానాలు భావితరాలకు తెలియజేయడం ఎంతో అవసరమని పేర్కొన్నారు. ప్రభుత్వం మహనీయుల జయంతి, వర్ధంతి కార్యక్ర మాలను అధికారికంగా నిర్వహించడం అభినందనీ యమన్నారు. సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ ఆశయాలను స్ఫూర్తిగా తీసుకొని సమాజంలో ఐక్యతను పెంపొందిస్తూ అభివృద్ధి వైపు ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. పాల్గొన్నవారు.. కార్యక్ర మంలో వివిధ శాఖల జిల్లా అధికారులు, వెనుక బడిన తరగతుల సంక్షేమ శాఖ అధికారులు, గౌడ సంఘాల ప్రతినిధులు, సంబంధిత శాఖల సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# విద్యార్థులు సాంకేతిక నైపుణ్యాలను పెంపొందించుకోవాలి

**కలెక్టర్ భవేశ్ మిశ్రా**




**నిర్మల్ ప్రతినిధి, (సింగిడి):** విద్యార్థులు సాంకేతిక నైపుణ్యాలు పెంపొందించు కుంటూ, వచ్చిన అవకాశాలను అందిపుచ్చుకోవాల ని జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా అన్నారు. మంగళవారం జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా, బాసర ఐఐఐటీలోని సమావేశ మందిరంలో నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఎలక్ట్రానిక్స్ అండ్ ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ (ఎన్ఐఈఎల్ఐటి) హైదరాబాద్ భాగస్వామ్యంతో నిర్వహిం చిన సెమికండక్టర్ డిజైన్ లపై ఐదు రోజుల ప్రత్యేక వర్క్‌షాప్ ప్రారంభోత్సవ కార్యక్రమంలో కలెక్టర్ పాల్గొన్నారు. ఈ కార్యక్రమాన్ని కలెక్టర్ జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ప్రస్తుత డిజిటల్ యుగంలో సెమికండక్టర్ తయారీ, డిజైనింగ్ లకు ఎంతో డిమాండ్ ఉందని, ఈ రంగాలు అత్యంత కీలకమె నవని అన్నారు. ఐఐఐటీ విద్యార్థులకు ఇటువంటి శిక్షణ లభించడం ఎంతో గొప్ప విషయం అని తెలిపారు. విద్యార్థులు తమ కోర్ సబ్జెక్టులపై పట్టు సాధించాలని చెప్పారు. లభించిన ఈ అవకాశాన్ని పూర్తిగా వినియోగించుకుని శాస్త్ర సాంకేతిక రంగా ల్లో గొప్పగా ఎదగాలని కాంక్షించారు. విద్యార్థుల్లో ప్రాక్టికల్ నాలెడ్జ్ పెంచేలా విద్యా బోధన సాగాలని సూచించారు. విద్యార్థులు అవసరమైన జ్ఞానాన్ని సంపాదించుకునేందుకు అన్ని వనరులను సమకూ రుస్తున్నామని పేర్కొన్నారు. విద్య పూర్తికాకముందే ఉద్యోగ ఉపాధి అవకాశాలు పొందేలా తగిన అవకా శాలు కల్పిస్తున్నట్లు వివరించారు. విద్యార్థు లకు బయట సమాజంలో ఉన్న అవకాశాలను వివరించి, వారిలో స్ఫూర్తిని నింపారు. ఏ విషయమైనా కూడా అధ్యాపకులను అడిగి విషయావగాహన పెంచుకో వాలని సూచించారు. ప్రతి విషయాన్ని లోతుగా విశ్లేషించుకొని, క్షుణ్ణంగా అర్థం చేసుకున్నప్పుడు అంశాలపై పట్టు సాధించవచ్చునని తెలిపారు. ఈ కార్యక్రమంలో భైంసా సబ్ కలెక్టర్ అజ్మీరా సంకేత్ కుమార్, వర్సిటీ ఉపకులపతి గోవర్ధన్, ఎన్ఐఈఎల్ ఐటి హైదరాబాద్ ఇన్చార్జ్ డైరెక్టర్ డాక్టర్ లక్ష్మణ్ కోర్ర, ఓఎస్డి మురళీ దర్శన్, ఐడెక్స్ మాజీ డైరెక్టర్ కల్నల్ (రిటైర్డ్) ఎ.కె. సింగ్, వీర టాక్టికల్ డైనమిక్స్ సీఈఓ సాయి తేజ, క్వాక్ట్రెర్వాయన్స్ క్వాంటం ల్యాబ్స్ వి.పి. సేల్స్ శ్రీనివాస్, అధ్యాపకులు, విద్యార్థులు, అధికారులు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

# లక్ష్యం లక్ష టన్నుల గోదాంలు..

**రూ.280 కోట్ల అభివృద్ధికి శ్రీకారం**
**రైతు సంక్షేమమే కాంగ్రెస్ ప్రభుత్వ ధ్యేయం**
**ప్రభుత్వ విప్, పెద్దపల్లి ఎమ్మెల్యే చింతకుంట విజయ రమణారావు**




**సుల్తానాబాద్, (సింగిడి):** రైతుల సంక్షేమమే లక్ష్యంగా కాంగ్రెస్ ప్రభుత్వం ముందుకు సాగుతోందని ప్రభుత్వ విప్, పెద్దపల్లి ఎమ్మెల్యే చింతకుంట విజయరమణారావు అ న్నారు. సుల్తానాబాద్ మండల కేంద్రంలోని ప్రభు త్వ జూనియర్ కళాశాల మైదానం, పూసాల, మం డలంలోని గర్రెపల్లి గ్రామాల్లో బుధవారం జరగను న్న మంత్రుల పర్యటన ఏర్పాట్లను మంగళవారం అధికారులు, కాంగ్రెస్ నాయకులతో కలిసి పరిశీ లించారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వం పదేళ్లలో కేవ లం 8 వేల మెట్రిక్ టన్నుల గోదాంలు నిర్మించగా, కాంగ్రెస్ ప్రభుత్వం ఇప్పటివరకు 55 వేల మెట్రిక్ టన్నుల గోదాంలకు మంజూరు పొందిందన్నారు. భవిష్యత్‌లో 1 లక్ష టన్నుల గోదాంల నిర్మాణమే లక్ష్యంగా ముందుకు సాగుతున్నామని తెలిపారు. పెద్దపల్లి జిల్లా కేంద్రంలో రైతుల కోసం కోల్డ్‌స్టోరేజీ గోదాంల నిర్మాణానికి చర్యలు తీసుకుంటున్నట్లు వెల్లడించారు. గర్రెపల్లి--పెగడపల్లి మధ్య రూ. 100 కోట్లతో నిర్మించనున్న బీటీ రోడ్డు నియోజకవర్గ అ భివృద్ధిలో మైలురాయి గా నిలుస్తుందని పేర్కొ న్నారు. సుల్తానాబాద్--పెద్దాపూర్‌తో పాటు వివిధ ప్రాంతాల్లో చేపట్టనున్న రహదారి పనులకు మం త్రుల చేత శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు జ రుగుతాయని చెప్పారు. మొత్తం రూ. 280 కోట్ల అభివృద్ధి పనులకు శ్రీకారం చుట్టనున్నట్లు తెలిపా రు. మంత్రుల పర్యటనను విజయవంతం చేయా లని ప్రజలకు, కాంగ్రెస్ శ్రేణులకు విజయరమణా రావు పిలుపునిచ్చారు. కార్యక్రమంలో జిల్లా గ్రం థాలయ సంస్థ చైర్మన్ అంతటి అన్నయ్య గౌడ్, మున్సిపల్ చైర్మన్ బిరుదు రాధాకృష్ణ, ఆర్డీవో గంగయ్య, మున్సిపల్ కమిషనర్ తిప్పరాజు రమేష్, కౌన్సిలర్లు, సర్పంచులు, అధికారులు, కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# భరోసా కేంద్రంలో బాధితులకు అండగా నిలవాలి

**డీసీపీ భాస్కర్**



**మంచిర్యాల, (సింగిడి)::** బాధితులకు అందుతున్న సేవల్లో ఎలాంటి లోపాలు లేకుండా చూడాలని మంచిర్యాల జోన్ డీసీపీ ఎ. భాస్కర్ అధికారులను ఆదేశించారు. మంగళవారం సీసీసీ నస్పూర్‌లోని భరోసా కేంద్రాన్ని ఆయన ఆకస్మికంగా సందర్శించారు. కేంద్రంలో మహిళలు, చిన్నారులు, ఇతర బాధితులకు అందుతున్న సేవలను స్వయంగా పరిశీలించి.. అక్కడి సిబ్బందితో సమీక్ష నిర్వహించారు.

**బాధితుడి మనసు తెలుసుకోవాలి..**

భరోసా కేంద్రానికి వచ్చే ప్రతి బాధితుడిని సానుభూతితో, గౌరవంగా స్వాగ తించాలని సూచించారు. బాధితుల సమస్యను కేవలం కేసుగా కాకుండా.. వారి జీవితంతో ముడిపడిన అంశంగా పరిగణించి పూర్తిస్థాయిలో తెలుసు కోవాలని చెప్పారు. బాధితుల గోప్యతకు అత్యంత ప్రాధాన్యం ఇవ్వాలని స్పష్టం చేశారు. కేంద్రంలో అందుతున్న కౌన్సెలింగ్, న్యాయ సహాయం, వైద్య సేవలు, మానసిక పరామర్శ, పునరావాసం తదితర అంశాలపై సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. అవసరమైన సేవలను సమస్య పరిష్కారంలో ఎక్కడైనా జాప్యం జరుగుతోందా? అనే అంశాలపై వివరాలు సేకరించారు. బాధితులకు సత్వర న్యాయం అందించేందుకు పోలీసులతోపాటు సంబం ధిత శాఖలు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. ప్రతి కేసును వేగంగా, నాణ్యతతో పరిష్కరించేందుకు అవసరమైన చర్యలు తీసు కోవాలని అధికారులను ఆదేశించారు. ముఖ్యంగా మహిళలు, చిన్నారులకు అవసం మైన సహాయాన్ని ఎలాంటి జాప్యం లేకుండా అందించాలని పేర్కొన్నారు.

**పరిసరాల పరిశుభ్రతపై సూచనలు**

భరోసా కేంద్రం పరిసరాలను పరిశీలించారు. కేంద్రాన్ని ఎల్లప్పుడూ పరిశు భ్రంగా, బాధితులకు అనుకూలమైన వాతావరణంలో ఉంచాలని సిబ్బందికి సూచించారు. బాధితులు తమ సమస్యలను భయపడకుండా చెప్పుకునేలా ఆహ్లాదకరమైన, నమ్మకమైన వాతావరణం కల్పించాల్సిన అవసరం ఉందని సూచించారు. నేరం లేదా వేధింపులకు గురైన బాధితులకు పోలీసు చర్యలతో పాటు మానసిక, వైద్య, న్యాయ సహాయం కూడా అవసరమవుతుంది. భరోసా కేంద్రం అందించే బహుముఖ సేవలు కీలకంగా మారుతున్నాయి. బాధితుడికి కేసు నమోదు నుంచి పునరావాసం వరకు అవసరమైన సహకారం అందేలా వ్యవస్థ పనిచేయాలని సూచించారు.

ఈ కార్యక్రమంలో మంచిర్యాల ఏసీపీ ఆర్. ప్రకాష్, మహిళా పోలీస్ స్టేషన్ ఇన్‌స్పెక్టర్ సత్యనారాయణ, మంచిర్యాల రూరల్ సీఐ రవీందర్, షీ టీమ్ ఎస్ఐ హైమా, సిబ్బంది పాల్గొన్నారు.

# గీత కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

**పాపన్న ఆశయాలే స్ఫూర్తి..**
**గొల్లపల్లి మాజీ ఎంపీటీసీ మొల్గూరి అంజయ్య గౌడ్**



**సుల్తానాబాద్, (సింగిడి):** సుల్తానాబాద్ మండలం గొల్లపల్లి, నారాయణ రా వు పల్లి గీత పారిశ్రామిక సహకార సంఘం ఆధ్వ ర్యంలో సర్దార్ సర్వాయి పాపన్న 369వ జయం తి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ముఖ్యఅ తిథిగా హాజరైన గొల్లపల్లి మాజీ ఎంపీటీసీ మొలు గూరి అంజయ్య గౌడ్ మాట్లాడుతూ.. అణగారిన వర్గాల అభ్యున్నతి కోసం అన్ని కులాలను ఏకం చేసి గోల్కొండ సామ్రాజ్యాన్ని జయించిన మహనీ యుడు పాపన్న అని కొనియాడారు. ఆయన ఆ శయాలను కొనసాగించాలని పిలుపునిచ్చారు. గీత కార్మికులకు రావాల్సిన ఎక్స్‌గ్రేషియా వెంటనే అందించాలని, ప్రభుత్వం ప్రకటించిన వాహనాల ను గీత పారిశ్రామిక సహకార సంఘాల ద్వారా పంపిణీ చేయాలని కోరారు. గీత కార్మికులకు కా ర్పొరేషన్ ద్వారా రుణాలు మంజూరు చేయడం తో పాటు వైన్స్‌లో 25 శాతం వాటా కల్పించాలని డిమాండ్ చేశారు. ప్రతి జిల్లా కలెక్టర్ కార్యాలయం లో సర్దార్ సర్వాయి పాపన్న విగ్రహాన్ని ఏర్పాటు చేయాలని ప్రభుత్వాన్ని కోరారు. ఈకార్యక్రమంలో వడ్లకొండ రాములు, గుర్రం మల్లేశం, వార్డు సభ్య లు మొలుగూరి ప్రశాంత్, మొలుగూరి శ్రీనివాస్, సత్తయ్య, నాగపూర్ కొమురయ్య, ఇల్లందుల సం పత్ గౌడ్, బాలసాని అనిల్, మొలుగూరి స్వర్ణకు మార్, సాయిదీప్, ఇల్లందుల సాయి, గుర్రం సాయి తదితరులు పాల్గొన్నారు

# ప్రజల చెంతకే వైద్యం.. విజయవంతమైన మెగా వైద్య శిబిరం

**వ్యాధిని ముందే గుర్తిద్దాం.. ఆరోగ్యాన్ని కాపాడుకుందాం**



**మంచిర్యాల, (సింగిడి):** అనారోగ్య సమస్యలు వచ్చినప్పుడు దూర ప్రాంతాలకు వెళ్లాల్సిన అవసరం లేకుండా ప్రజలకు స్థానికం గానే వైద్య సేవలు అందించడమే లక్ష్యమని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి నరేందర్ రాథోడ్ అన్నారు. మంచిర్యాల కార్పొరేషన్ పరిధిలోని 4వ డివిజన్‌లో నిర్వహించిన మెగా వైద్య శిబి రాన్ని ఆయన పర్యవేక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పేదలు, వృద్ధులు, మహి ళలు, కూలీలు వైద్యం కోసం పనులు మానుకుని దూర ప్రాంతాలకు వెళ్లాల్సిన పరిస్థితి లేకుండా వారి నివాస ప్రాంతాలకు చేరువగా వైద్య సేవలు అందిస్తున్నామని తెలిపారు. ఆరోగ్య సమస్యలను ప్రారంభ దశలోనే గుర్తించి చికిత్స తీసుకుంటే అనేక అనారోగ్య సమస్యలను నియంత్రించవచ్చ న్నారు. శిబిరానికి ఉదయాన్నే పెద్ద సంఖ్యలో ప్రజలు తరలివచ్చి వైద్య పరీక్షలు చేయించు కున్నారు. వృద్ధులు, మహిళలు, కూలీలు తదిత రులు తమ ఆరోగ్య సమస్యలను వైద్యులకు వివరించి అవసరమైన సలహాలు, సూచనలు పొందారు. అవసరమైన వారికి మందులు అందజేశారు.

**ప్రజారోగ్యంపై ప్రత్యేక దృష్టి**

ప్రజలు తమ ఆరోగ్యాన్ని నిర్లక్ష్యం చేయకుండా క్రమం తప్పకుండా వైద్య పరీక్షలు చేయించుకో వాలని సూచించారు. ముఖ్యంగా రక్తపోటు, మధుమేహం వంటి సమస్యలను ఎప్పటికప్పుడు పరీక్షించుకోవాలని తెలిపారు. అనుమానిత లక్షణాలు కనిపిస్తే వెంటనే వైద్యులను సంప్రదిం చాలని సూచించారు. డివిజన్‌లోనే వైద్య శిబిరం ఏర్పాటు చేయడం వల్ల ప్రజలకు సమయం, డబ్బు ఆదా కావడంతో పాటు వైద్య సేవలు సుల భంగా అందుబాటులోకి వచ్చాయని తెలిపారు. ఇలాంటి శిబిరాల ద్వారా ప్రజలకు వైద్య సేవలు మరింత చేరువ చేయడానికి చర్యలు కొనసాగి స్తామని పేర్కొన్నారు. పెద్ద సంఖ్యలో ప్రజలు శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవడం పట్ల సంతృప్తి వ్యక్తం చేశారు.

**పేదల ఆరోగ్యానికి అండగా**

ఒక ఆరోగ్య పరీక్షతో వ్యాధిని ముందుగానే గుర్తిం చవచ్చని, సమయానికి చికిత్స అందితే కుటుం బంపై పడే ఆర్థిక భారం కూడా తగ్గుతుందని పేర్కొన్నారు. ప్రజలకు వైద్యం అందుబాటులో ఉండేలా స్థానిక స్థాయిలో నిర్వహించే వైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలని ఆయ న కోరారు. ఈ కార్యక్రమంలో నస్పూర్ మెడికల్ ఆఫీసర్ వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

## ఉత్తమ ఉద్యోగి నార మనోహర్‌కు ఘన సన్మానం

**వ్యవసాయ మార్కెట్ చైర్మన్ మినుపాల ప్రకాష్ రావు**



**సుల్తానాబాద్, (సింగిడి):** వ్యవసాయ మార్కె టింగ్ శాఖలో ఉత్తమ సేవలం దించిన ప్రత్యేక శ్రేణి కార్యదర్శి నార మనోహర్ సే వలు అభినం దనీ యమని మార్కెట్ కమిటీ చైర్మన్ మిను పాల ప్రకాష్‌రావు అన్నారు. స్వాతంత్ర్య ది నోత్సవం సందర్భంగా పెద్దపల్లి కలెక్టరేట్ లో ప్రభు త్వ విప్, ఎమ్మెల్యే చింతకుంట విజయ రమణా రావు చేతుల మీదుగా మనోహర్ ఉత్తమ ఉద్యోగి ప్రశంసా పత్రం అందుకున్నారు. ఈ సందర్భంగా మంగళవారం మార్కెట్ కమిటీ ఆధ్వర్యంలో డై రెక్టర్లు, రైస్ మిల్లర్లు, ట్రేడర్లు, సిబ్బంది, అకౌంటెం ట్లు, హమాలీలు, రైతులు మనోహర్‌ను పుష్పగు చ్ఛాలు, శాలువాలతో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ప్రకాష్రావు మాట్లాడుతూ వృ త్తిపట్ల నిబద్ధత తో పనిచేస్తూ రైతులకు సేవ చేయడంతో పాటు మార్కెట్ కమిటీ ఆదాయం పెంపులో మనోహర్ కీల కంగా కృషి చేశారని ప్రశంసించారు. తనకు లభించిన ప్రశంసా పత్రం పట్ల మనోహర్ కృతజ్ఞతలు తెలిపారు. ఈ కా ర్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ బిరుదు రాధా కృష్ణ, మార్కెట్ వైస్ చైర్మన్ ఉస్తేం గణేష్, రైస్ మిల్లర్ల సంఘం ప్రధాన కార్యదర్శి జైపాల్ రెడ్డి, డైరెక్టర్లు, మాజీ ఎంపిటిసి పన్నాల రాములు, మేట్టు శ్రీనివాస్ రెడ్డి, ట్రేడర్లు, సిబ్బంది, హమాలీ లు, రైతులు పాల్గొన్నారు.

## సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ జయంతి సందర్భంగా నివాళులర్పించిన బిజెపి నాయకులు



**నిర్మల్ ప్రతినిధి, (సింగిడి)::** సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ గారి జయంతి సందర్భం గా ఈరోజు నిర్మల్ జిల్లా కేంద్రంలోని ఎమ్మెల్యే క్యాంప్ కార్యాల యంలో వారి చిత్రపటానికి పూల మాల వేసి బీజేపీ నాయకులు ఘనంగా నివాళు లర్పించారు. ఈ సందర్భంగా బీజేపీ సీనియర్ నాయకులు రావుల రాంనాథ్ మాట్లాడుతూ బహుజన యోధుడు, కుల వివక్షకు వ్యతిరేకంగా పోరాడి, పేదల కోసం సొంత రాజ్యాన్ని స్థాపించిన మహనీయుడు సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ అని కొనియాడారు. మొఘల్ పాలకుల ఆధిపత్యాన్ని ఎదిరించి, గోల్కొండ కోటను సైతం జయించిన గొప్ప వీరుడు పాపన్న గౌడ్ అని తెలిపారు. ఆయన చూపిన ధైర్య సాహసాలు, సమ సమాజ స్థాపన కోసం చేసిన కృషి నేటి యువతకు స్ఫూర్తిదాయకం అన్నారు. ఈ కార్యక్రమంలో సీనియర్ నాయకులు డి ముత్యం రెడ్డి, కౌన్సిలర్ కూన శశాంక్, మాజీ కౌన్సిలర్ నరేందర్, బీజేపీ నాయకులు కందుల హరీష్, పుదరి రంజిత్, సంతోష్, ఉదయ్ గౌడ్, తో పాటు తదితరులు పాల్గొన్నారు.

# వీఐపీ భద్రతలో రాజీకి తావులేదు..

**ప్రతి క్షణం అప్రమత్తతే ఆయుధం!**
**పీఎస్ఓలకు ప్రత్యేక శిక్షణ.. ఆరోగ్యం, క్రమశిక్షణ, వృత్తి నైపుణ్యంపై సీపీ అంబర్ కిషోర్ ఝా దిశానిర్దేశం**



**గోదావరిఖని, (సింగిడి):** వీఐపీ భద్రతా విధుల్లో అప్రమత్తత, క్రమశిక్షణ, సమన్వయం అత్యంత కీలకమని రామగుండం పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝా అన్నారు. వీఐపీ భద్రతలో విధులు నిర్వహించే పర్సనల్ సెక్యూరిటీ ఆఫీసర్లు (పీఎస్ఓలు) ప్రతి పరిస్థితిని ముందుగానే అంచనా వేసే సామర్థ్యంతో, వృత్తి నైపుణ్యంతో పనిచేయాలని సూచించారు. సీపీ ఆదేశాల మేరకు మంగళవారం రామగుండం పోలీస్ కమిషనరేట్‌లో పీఎస్ఓలకు వీఐపీ భద్రతా విధులపై సంక్షిప్త శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. భద్రతా ప్రమా ణాలు, సమాచార మార్పిడి, సమన్వయం, అత్యవసర పరిస్థితుల్లో స్పందన, సమాచార గోప్యత తదితర అంశాలపై వారికి అవగాహన కల్పించారు. శారీరక దారుఢ్యమే విధి నిర్వహణకు పునాది, ఈ సందర్భంగా సీపీ అంబర్ కిషోర్ ఝా మాట్లాడుతూ.. భద్రతా విధుల్లో ఉన్న సిబ్బందికి శారీరక, మానసిక దృఢత్వం ఎంతో అవసరమన్నారు. విధులు ఎంత బిజీగా ఉన్నప్పటికీ ప్రతిరోజూ వ్యాయా మం చేస్తూ ఆరోగ్యాన్ని కాపాడుకోవాలని సూచించారు. మంచి అలవాట్లు, క్రమశిక్షణ, నిజాయితీ, విశ్వసనీయతను అలవర్చుకుని పోలీస్ శాఖకు మంచి పేరు తీసుకురావాలన్నారు.

**అవినీతికి దూరంగా.. విశ్వసనీయతకు దగ్గరగా**

ప్రజలతో నేరుగా సంబంధం కలిగిన పీఎస్ఓలు ఎట్టి పరిస్థితుల్లోనూ అవినీతి, అక్రమ ప్రయోజనాలకు పాల్పడకూడదని సీపీ స్పష్టం చేశారు. వ్యక్తిగత ప్రయోజనాల కోసం డబ్బులు తీసుకోవడం పూర్తిగా తప్పని హెచ్చరించారు. ప్రజలు, అధికారులు, ప్రజాప్రతినిధుల దృష్టిలో పోలీస్ శాఖపై నమ్మకం మరిం త పెరిగేలా బాధ్యతాయుతంగా వ్యవహరించాలని సూచించారు. అనూహ్య పరిస్థితులకు ఎల్లప్పుడూ సిద్ధంగా ఉండాలి, వీఐపీ భద్రతలో ఎప్పుడు ఎలాంటి అనూహ్య పరిస్థితి ఎదురవుతుందో ముందుగా చెప్పలేమని సీపీ పేర్కొన్నారు. అందువల్ల పీఎస్ఓలు నిరంతరం అప్రమత్తంగా ఉండాలని అన్నారు. విధుల్లో భాగంగా పరిసరాలను నిశితంగా పరిశీలించడం, పరిస్థితులను వేగంగా అంచనా వేయడం, అవసరమైన సమయంలో తక్షణ నిర్ణయం తీసుకోవడం వంటి నైపుణ్యాలను పెంపొందించుకోవాలని సూచించారు.

**నిరంతర శిక్షణతో నైపుణ్యాల పదును**

పోలీస్ శాఖలో పొందిన శిక్షణ, అనుభవం పీఎస్ఓలకు ప్రధాన బలమని సీపీ అన్నారు. కవాతు సాధన, మాక్ డ్రిల్స్, నిరంతర శిక్షణ ద్వారా భద్రతా విధుల్లో తమ సామర్థ్యాన్ని మరింత పెంచుకోవాలని సూచించారు. విధి నిర్వహణ సమయంలో అనుమానాస్పద వ్యక్తులు, కదలికలు లేదా వస్తువులు గుర్తించిన వెంటనే ఉన్నతాధికారులకు సమాచారం అందించాలని తెలిపారు. సున్నితమైన

**సమాచారం.. అత్యంత గోప్యం**

వీఐపీ భద్రతకు సంబంధించిన సున్నితమైన సమాచారాన్ని అత్యంత గోప్యంగా ఉంచాలని సీపీ ఆదేశించారు. భద్రతా విధులకు సంబంధించిన వివరాలను సామాజిక మాధ్యమాల్లో అనధికారికంగా పంచుకోరాదని స్పష్టం చేశారు. అత్యవసర పరిస్థితుల్లో శాఖా నియమావళిని పాటిస్తూ ప్రశాంతంగా, వేగంగా స్పందించాలని సూచించారు. "ప్రతి క్షణం అప్రమత్తత.. ప్రతి చర్యలో క్రమశిక్షణ"వీఐపీ భద్రతలో ప్రతి క్షణం అప్రమత్తత, ప్రతి చర్యలో క్రమశిక్షణ, ప్రతి నిర్ణయంలో బాధ్యత ఉండాలి" అని సీపీ అంబర్ కిషోర్ ఝా స్పష్టం చేశారు. ఈ శిక్షణలో భద్రతా విధులు, శారీరక దారుఢ్యం, అప్రమత్తత, సమాచార మార్పిడి, సమన్వయం, అత్యవసర పరిస్థితుల్లో స్పందన, సమాచార గోప్యత, వృత్తి నైపుణ్యం తదితర అంశాలపై పీఎస్ఓలకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఏఆర్ ఏసీపీలు ప్రతాప్, రమేష్, ఆర్ఐలు శేఖర్, దామోదర్, రమేష్, మల్లేశం, సీసీ సందీప్ తదితరులు పాల్గొన్నారు.

# దుబాయి ప్రమాద బాధితులకు రూ.2.60 కోట్ల సాయం

**బుర్జీల్ ప్రతినిధులను కలిసిన ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం. డా. షంషీర్ వయలిల్‌కు కృతజ్ఞతలు**



**కరీంనగర్, (సింగిడి):** దుబాయిలో ఇటీవల జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన ఏడుగురు కార్మికుల కుటుంబాలు, గాయపడిన తొమ్మిది మందికి మొత్తం 10 లక్షల దిర్హాలు (సుమారు రూ.2.60 కోట్లు) మానవతా సహాయ ప్యాకేజీ ప్రకటించిన బుర్జీల్ హోల్డింగ్స్ చైర్మన్ డా. షంషీర్ వయలిల్‌కు చొప్పదండి ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం కృతజ్ఞతలు తెలిపారు. డా. షంషీర్ వయలిల్ అందుబాటులో లేకపోవడంతో, ఆయన సంస్థ ప్రతినిధులు ఎ. విజయ్ కుమార్, అహ్మద్ బిన్ సులేమాన్, ఎం. ఉన్ని కృష్ణన్, డా. పంకజ్‌కుమార్ భట్‌లను శుక్రవారం దుబాయిలో కలిసి ధన్యవాదాలు తెలిపారు. ఈ సందర్భంగా డా. షంషీర్ వయలిల్‌తో పాటు బుర్జీల్ ప్రతినిధులను హైదరాబాద్‌కు ఆహ్వానించి, ముఖ్యమంత్రి ఏ. రేవంత్ రెడ్డి సమక్షంలో బాధిత కుటుంబాలకు ఆర్థిక సాయం చెక్కులు అందజేయాలని ప్రతిపాదించారు. ప్రమాదంలో మృతి చెందిన ఏడుగురిలో ముగ్గురు జగిత్యాల జిల్లాకు చెందినవారు కాగా, ప్రతి కుటుంబానికి లక్ష దిర్హాలు (సుమారు రూ.26 లక్షలు) చొప్పున అందించనున్నారు. గాయపడిన వారికి వైద్య చికిత్స, పునరావాసం, అలాగే ప్రభావిత కుటుంబాల పిల్లల విద్యకు కూడా సహాయం అందించనున్నట్లు తెలిపారు. అంతకుముందు ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం దుబాయిలోని భారత రాయబార కార్యాలయ అధికారులను కలిసి మృతదేహాల తరలింపు ప్రక్రియను వేగవంతం చేయాలని కోరారు. అనంతరం రాషిద్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న బాధితులను పరామర్శించారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ ప్రభుత్వ ప్రవాస భారతీయుల సలహా కమిటీ సభ్యుడు కొట్టాల సత్యం గౌడ్‌తో పాటు పలువురు తెలంగాణ సామాజిక కార్యకర్తలు పాల్గొన్నారు.

# స్వచ్ఛ పాఠశాల కోసం గ్రామస్తులతో టిఫిన్ సమావేశం

**ప్రభుత్వ పాఠశాలల పరిశుభ్రత, మౌలిక వసతుల మెరుగుదలకు సహాయం ప్రకటించిన కేంద్ర మంత్రి**

**సిరిసిల్ల టౌన్ లోని ఉన్నత పాఠశాలను 'క్లీన్' చేయనున్న కేంద్ర మంత్రి బండి సంజయ్**



**కరీంనగర్, (సింగిడి):** కంద్రంలో నరేంద్ర మోదీ ప్రభుత్వం 12 సంవత్సరాల పాలన పూర్తి చేసుకున్న సందర్భంగా కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ కరీంనగర్ జిల్లా హుస్నాబాద్ నియోజకవర్గంలోని చిగురుమామిడి మండలం రేకొండ గ్రామ ఉన్నత పాఠశాలను సందర్శించారు. "స్వచ్ఛ పాఠశాల" కార్యక్రమంలో భాగంగా గ్రామస్తులు, కార్యకర్తలతో కలిసి పాఠశాల ఆవరణలో టిఫిన్ సమావేశంలో పాల్గొన్నారు. అందరూ తమ ఇళ్ల నుంచి తెచ్చుకున్న అల్పాహారాన్ని కలిసి భుజిస్తూ పాఠశాల పరిశుభ్రత, అభివృద్ధిపై చర్చించారు. ఈ సందర్భంగా ప్రభుత్వ పాఠశాలలను పరిశుభ్రంగా ఉంచడం ప్రతి ఒక్కరి బాధ్యత అని బండి సంజయ్ పేర్కొన్నారు. రాజకీయాలకు అతీతంగా ప్రజలందరూ "స్వచ్ఛ పాఠశాల" కార్యక్రమంలో భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. ఈ నెల 16న ప్రతి గ్రామంలో విద్యార్థుల బడి ప్రవేశోత్సవ ర్యాలీలు నిర్వహించాలని సూచించారు. పాఠశాలలో విద్యార్థులకు భోజనశాల సౌకర్యం లేదని, సమీప ప్రాథమిక పాఠశాలలో తరగతి గదుల కొరత ఉందని ఉపాధ్యాయులు వివరించగా, ఉన్నత పాఠశాలలో భోజనశాల ఏర్పాటుకు రూ.5 లక్షలు, ప్రాథమిక పాఠశాలలో తరగతి గదుల నిర్మాణంతో పాటు కుల సంఘాల భవనాల కోసం రూ.20 లక్షల సహాయం అందిస్తానని హామీ ఇచ్చారు. తొలి విడతగా రూ.10 లక్షలు విడుదల చేస్తానని తెలిపారు. అనంతరం పాఠశాల తరగతి గదులు, భోజనశాలను పరిశీలించిన బండి సంజయ్ విద్యార్థులతో ముచ్చటించారు. పదో తరగతిలో అత్యుత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులను అభినందించారు. ఈ ఏడాది కూడా ప్రభుత్వ పాఠశాలల్లో పదో తరగతి చదివే విద్యార్థులందరికీ ఉచిత సైకిళ్లు అందజేస్తామని ప్రకటించారు. మరోవైపు ఆయన పిలుపు మేరకు కరీంనగర్ పార్లమెంట్ పరిధిలోని అనేక గ్రామాల్లో భారతీయ జనతా పార్టీ కార్యకర్తలు, స్థానిక ప్రజలు, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు పాఠశాలల్లో టిఫిన్ సమావేశాలు నిర్వహించారు. పాఠశాలల పరిస్థితిని పరిశీలించి, వాటి పరిశుభ్రత కోసం కార్యాచరణ రూపొందించారు. శనివారం ఉదయం ఆయా గ్రామాల్లోని పాఠశాలలను స్వయంగా శుభ్రపరిచేందుకు సిద్ధమయ్యారు. ఇక "స్వచ్ఛ పాఠశాల" కార్యక్రమంలో భాగంగా బండి సంజయ్ సిరిసిల్ల పట్టణంలోని కుసుమ రామయ్య జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో కూడా పరిశుభ్రత కార్యక్రమంలో పాల్గొననున్నారు. అనంతరం మోదీ ప్రభుత్వ 12 ఏళ్ల పాలనా విజయాలను వివరిస్తూ ప్రముఖ వ్యక్తులకు పుస్తకాలను అందజేయనున్నారు.

# శివాలయంలో మహిళల ప్రత్యేక పూజలు



**జమ్మికుంట, (సింగిడి):** జమ్మికుంటలో అతి పురాతనమైన శ్రీ విశ్వేశ్వర స్వామి దేవాలయంలో అధిక జ్యేష్ఠమాస, పురుషోత్తమ మాసం సందర్భంగా గత నెల రోజులుగా అన్నపూర్ణ సేవా సమితి భవాని భజన మండలి ఆధ్వర్యంలో ప్రతి నిత్యం ప్రదోషకాలంలో అమ్మవార్లకు లలితా సహస్ర పారాయణము, విష్ణు సహస్ర పారాయణము కుంకుమ పూజలు నిర్వహిస్తున్నారు. కార్యక్రమంలో ఈ ఈనెల 15న సోమవతి అమావాస్య సందర్భంగా మహిళల చేత అమ్మవారికి లక్ష కనకాంబరం పూలతో అర్చన, లలిత సంపుటి పారాయణం విష్ణు సహస్ర పారాయణము ప్రధాన అర్చలు వేణుగోపాల్ శర్మ ఆధ్వర్యంలో నిర్వహించబడును. కావున భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కమిటీ సభ్యులు కోరారు.

## మనబడి, మనబాధ్యత..
# స్వచ్ఛ పాఠశాల' ఏర్పాట్ల పరిశీలన

**భగత్‌నగర్ ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో**

**పరిశుభ్రత, పారిశుధ్య ఏర్పాట్లపై సమీక్ష**

**బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధి, డిప్యూటీ మేయర్ యాదగిరి సునీల్‌రావు**



**కరీంనగర్, (సింగిడి):** కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ పిలుపు మేరకు శనివారం నిర్వహించనున్న 'మన బడి – మన బాధ్యత, స్వచ్ఛ పాఠశాల' కార్యక్రమానికి సంబంధించిన ఏర్పాట్లను బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధి, నగరపాలక సంస్థ డిప్యూటీ మేయర్ యాదగిరి సునీల్ రావు శుక్రవారం పరిశీలించారు. కరీంనగర్ 42వ డివిజన్ భగత్‌నగర్ పోలీసు క్వార్టర్స్‌లో ఉన్న ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో నాయకులు, కార్యకర్తలతో కలిసి పాఠశాల ఆవరణతో పాటు పరిసర ప్రాంతాలను సందర్శించి పరిశుభ్రత, పారిశుధ్య ఏర్పాట్లను సమీక్షించారు. ఈ సందర్భంగా సునీల్ రావు మాట్లాడుతూ, పాఠశాలల పరిశుభ్రత విద్యార్థుల ఆరోగ్యం, విద్యాభివృద్ధికి ఎంతో కీలకమని పేర్కొన్నారు. కార్యక్రమాన్ని విజయవంతం చేసేందుకు ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. అనంతరం నాయకులు, కార్యకర్తలతో కలిసి అల్పాహారం చేసి, స్థానిక సమస్యలు, డివిజన్ అభివృద్ధి అంశాలపై చర్చించారు. ఈ కార్యక్రమంలో కన్నమల్ల శ్రీనివాస్, భీమరి సత్యం, రాజ్ ప్రభాకర్, రమేశ్ గౌడ్, డోలి ఉపేందర్, వర్దినేని వెంకట్‌రావు, అనుదీప్, కుంభం అనిల్‌కుమార్, గీకురు ఆంజనేయులు, దాసరి రమేశ్ తదితరులు పాల్గొన్నారు.

# హుజూరాబాద్‌లో వర్షాకాల సన్నాహక చర్యలువేగవంతం





**హుజూరాబాద్, (సింగిడి):** రాబోయే వర్షాకాలాన్ని దృష్టిలో ఉంచుకుని హుజూరాబాద్ మున్సిపాలిటీ పరిధిలో చేపట్టాల్సిన అభివృద్ధి, పారిశుధ్య కార్యక్రమాలపై మున్సిపాలిటీ కమిషనర్ బి. కిషన్ ప్రత్యేక దృష్టి సారించారు. శుక్రవారం పట్టణంలోని కే.సీ క్యాంపు, ఇప్పల్ నర్సింగాపూర్ ప్రాంతాల్లో ఉన్న మున్సిపాలిటీ నర్సరీలను ఆయన పరిశీలించారు. వర్షాకాలంలో పట్టణ వ్యాప్తంగా విస్తృతంగా మొక్కలు నాటేందుకు అవసరమైన ఏర్పాట్లు చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. అనంతరం ఇప్పల్ నర్సింగా పూర్‌లో స్వచ్ఛ భారత్ మిషన్ (ఎస్‌బీఎం 2.0) నిధులతో నిర్మాణ దశలో ఉన్న వే–బ్రిడ్జి పనులను పరిశీలించారు. పనులను నాణ్యతా ప్రమాణాలకు అనుగుణంగా వేగవంతంగా పూర్తి చేయాలని కాంట్రాక్టర్‌కు సూచించారు. అలాగే స్థానిక అవంతి బార్ అండ్ రెస్టారెంట్ సమీపంలోని వరద నీటి కాలువను పరిశీ లించి, కాలువను శుభ్రపరచడంతో పాటు వరద నీటి ప్రవాహాన్ని చిలుకవాగులోకి మళ్లిం చేలా తగిన చర్యలు చేపట్టాలని సంబంధిత సిబ్బందిని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ బి. కిషన్, టౌన్ ప్లానింగ్ ఆఫీసర్ జి. అభినవ్, టౌన్ ప్లానింగ్ సూపర్వైజర్ శ్రీకాంత్, ఎన్విరాన్‌మెంటల్ ఇంజనీర్ పి. వినయ్, శానిటరీ జవాన్ ప్రతాప్ రాజు తదితర అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

## ముక్దంపూర్‌లో గొర్రెలు, మేకలకు గాలి టీకాల కార్యక్రమం

**పశుసంవర్ధక శాఖ సేవలను సద్వినియోగం చేసుకోవాలని కాపరులు, రైతులకు పిలుపు**




**కరీంనగర్, (సింగిడి):** కరీంనగర్ రూరల్ మండలంలోని ముక్దంపూర్ గ్రామంలో గొర్ల కాపరుల సహకార సంఘం అధ్యక్షుడు బండి మల్లయ్య యాదవ్ ఆధ్వర్యంలో శుక్రవారం గొర్రెలు, మేకలకు గాలి టీకాలు వేశారు. ఈ సందర్భంగా కరీంనగర్ జిల్లా వ్యాప్తంగా గొర్ల కాపరులు, రైతులు పశు సంవర్ధక శాఖ అందిస్తున్న టీకా కార్యక్రమాలను సద్వినియోగం చేసుకోవాలని యాదవ సంఘం అధ్యక్షులు బండి మల్లయ్య యాదవు కోరారు. ఈ కార్యక్రమంలో పశువైద్య అధికారి డాక్టర్ భారతి, పశుసంవర్ధక విస్తరణ అధికారి పి. రజిత, గ్రామ గొర్ల కాపరుల ప్రధాన కార్యదర్శి దాడి పెద్ద లచ్చయ్య యాదవ్, చిన్న లచ్చయ్యతో పాటు గొర్ల కాపరులు, రైతులు పాల్గొన్నారు.

# నీట్, ఐఐటీ పరీక్షల అవకతవకలు దేశ ప్రతిష్ఠకు మచ్చ

**ఐఐటి, నీట్ పరీక్షల్లో అవకతవకలపై భారీ నిరసన**

**కేంద్ర విద్యాశాఖ మంత్రిని తొలగించాలి: నీట్, ఐఐటి పేపర్ లీకేజీలపై నరేందర్ రెడ్డి డిమాండ్**

**కేంద్ర విద్యాశాఖ మంత్రిని తొలగించి విద్యార్థులకు న్యాయం చేయాలి: అల్ఫోర్స్" నరేందర్ రెడ్డి ఫైర్**



**కరీంనగర్, (సింగిడి):** ప్రతిష్ఠాత్మక నీట్, ఐఐటీ ప్రవేశ పరీక్షల్లో చోటుచేసుకుంటున్న అవకతవకలు దేశ ప్రతిష్ఠకు భంగం కలిగిస్తున్నాయని కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు, వివిఎస్ఆర్ ఫౌండేషన్ వ్యవస్థాపకుడు డా. వి. నరేందర్ రెడ్డి అన్నారు. నీట్, ఐఐటీ పరీక్షల నిర్వహణలో జరిగిన లోపాలను నిరసిస్తూ కరీంనగర్ తెలంగాణ చౌక్‌లో ఎన్ఎస్‌యూఐ ఆధ్వర్యంలో నిర్వహించిన ఆందోళన కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, జాతీయ స్థాయి పరీక్షల నిర్వహణలో నిర్లక్ష్యం, సాంకేతిక లోపాలు, పర్యవేక్షణ కొరత విద్యా వ్యవస్థ విశ్వసనీయతను దెబ్బతీస్తున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. నీట్ పరీక్షను రద్దు చేసి మళ్లీ నిర్వహించాల్సిన పరిస్థితి రావడం అత్యంత అవమానకరమని పేర్కొన్నారు. ఐఐటీ అడ్వాన్స్‌డ్ పరీక్షలో ప్రశ్నపత్రం లీక్ కావడం, ప్రశ్నల్లో పొరపాట్లు వెలుగులోకి రావడం చరిత్రలోనే తొలిసారని, దీనివల్ల భారత విద్యా వ్యవస్థ ప్రతిష్ఠ దెబ్బతిందని అన్నారు. భవిష్యత్తులో ఇటువంటి ఘటనలు పునరావృతం కాకుండా కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. సీబీఎస్ఈ పదో, ఇంటర్మీడియట్ సమాన తరగతుల ఫలితాల ప్రక్రియలోనూ లోపాలు ఉన్నాయని ఆరోపించారు. విద్యా వ్యవస్థలో పెరుగుతున్న నిర్లక్ష్యం దేశ అభివృద్ధిపైనా ప్రభావం చూపుతుందని ఆందోళన వ్యక్తం చేశారు. కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్‌ను వెంటనే పదవి నుంచి తొలగించి విద్యార్థులకు న్యాయం చేయాలని కేంద్ర ప్రభుత్వాన్ని డా. నరేందర్ రెడ్డి డిమాండ్ చేశారు. జాతీయ స్థాయి పరీక్షలను పారదర్శకంగా, సమర్థవంతంగా నిర్వహించాలని కోరారు. ఈ కార్యక్రమంలో కార్పొరేషన్ కాంగ్రెస్ అధ్యక్షుడు వైద్యుల అంజన్ కుమార్, ఎన్ఎస్‌యూఐ నాయకుడు ఎం.డి. ఇమ్రాన్, కాంగ్రెస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కోమటిరెడ్డి పద్మాకర్ రెడ్డి, ఎస్టీ సెల్ అధ్యక్షులు శ్రావణ్ నాయక్, జిల్లా కాంగ్రెస్ బీసీ సెల్ అధ్యక్షులు పులి ఆంజనేయులు గౌడ్, సిటీ మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు రజిత రెడ్డి, చింతల శ్రీనివాస్ రెడ్డి, జిల్లా యువజన కాంగ్రెస్ ఉపాధ్యక్షులు కిమ్ ఫహద్, గుర్రం వాసు గౌడ్, రెహమాన్, రమేష్, విక్రమ్, ఎండి అయాన్, సిహెచ్ చేతన్ రెడ్డి, సోఫియాన్, అన్సారీ, అనిల్, రేవంత్ తదితరులు పాల్గొన్నారు.

## క్యాన్సర్‌కు చికిత్సతో పాటు
# రోగి మనోధైర్యం కీలకం

**యశోద ఆసుపత్రిలో దేశంలోనే తొలిసారిగా అత్యాధునిక 'హైపర్‌సైట్' సాంకేతికతతో చికిత్స**

**ప్రముఖ క్యాన్సర్ వైద్య నిపుణుడు డాక్టర్ రామకృష్ణ ప్రసాద్**



**కరీంనగర్(సింగిడి):** క్యాన్సర్‌ను జయించడంలో వైద్య చికిత్సతో పాటు రోగిలో ఉండే మనోధైర్యం అత్యంత కీలకమని సికింద్రాబాద్ యశోద ఆసుపత్రి ప్రముఖ క్యాన్సర్ వైద్య నిపుణుడు డాక్టర్ రామకృష్ణ ప్రసాద్ అన్నారు. కరీంనగర్‌లో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన ఈ సందర్భంగా మాట్లాడుతూ, యశోద ఆసుపత్రి రేడి యేషన్ ఆంకాలజీ విభాగంలో దేశంలోనే తొలిసారిగా అత్యాధునిక 'హైపర్‌సైట్' సాంకేతికతను అందుబాటు లోకి తీసుకువచ్చినట్లు తెలిపారు. ప్రస్తుతం ఈ సదుపాయం సికింద్రాబాద్ యశోద ఆసుపత్రిలో మాత్రమే అందుబాటులో ఉందని పేర్కొన్నారు. ఈ సాంకేతికత ద్వారా క్యాన్సర్ కణాలు ఉన్న ప్రాంతాన్ని అత్యంత ఖచ్చితంగా గుర్తించి, ఆ భాగానికే కిరణ చికిత్స అందించడంతో ఆరోగ్యకరమైన అవయవాలపై దుష్ప్రభావాలు చాలా తక్కువగా ఉంటాయని వివరించారు. క్యాన్సర్‌ను ప్రారంభ దశలోనే గుర్తిస్తే పూర్తిస్థాయిలో నయం చేసే అవకాశాలు ఎక్కువగా ఉంటాయనీ, ప్రజల్లో అవగాహన పెంచేందుకు ఆసుపత్రి తరఫున ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహిస్తు న్నట్లు చెప్పారు. హైపర్‌సైట్ సాంకేతికతతో ఇప్పటికే పలువురు రోగులకు విజయవంతంగా చికిత్స అందించామని తెలిపారు. కరీంనగర్‌తో పాటు, పరిసర ప్రాంతాల ప్రజలు ఈ ఆధునిక వైద్య సదుపాయాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు. ఈ విలేకరుల సమావేశం లో యశోద ఆసుపత్రి ప్రతినిధులు శ్రీకాంత్, మహేందర్ తదితరులు పాల్గొన్నారు.

# ప్రైవేటు బడి వద్దు సర్కారు బడి ముద్దు..

**బడిబాట కార్యక్రమంలో సర్పంచ్ మధుసూదన్**



**జమ్మికుంట, (సింగిడి):** ప్రైవేటు పాఠశాల వద్దు ప్రభుత్వ పాఠశాల ముద్దు అనే నినాదంతో కోరపల్లి జడ్పీహెచ్ఎస్ పాఠశాల ఉపాధ్యాయ బృందం కోరపల్లి సర్పంచ్ మధుసూదన్ ఆధ్వర్యంలో బడిబాట కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా సర్పంచ్ మధుసూదన్ మాట్లాడుతూ, ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులకు మెరుగైన విద్యతోపాటు నాణ్యమైన భోజనాన్ని రాష్ట్ర ప్రభుత్వం అందిస్తుందని ప్రైవేట్ పాఠశాలలకు దీటుగా ప్రభుత్వ పాఠశాలలో మంచి విద్యాబోధన లభిస్తుందని గ్రామ ప్రజలతో పాటు చుట్టుపక్కల పరిసర ప్రాంతాల ప్రజలు కూడా తమ పిల్లలను ప్రభుత్వ పాఠశాలకు పంపించాలని సూచించారు. ప్రభుత్వ పాఠశాలలో పౌష్టిక ఆహారం ప్రతిరోజు గుడ్లు, రాగి జావా తో పాటు నాణ్యమైన భోజనాన్ని అందిస్తున్నారని ఇవే విద్యార్థులకు నోటు పుస్తకాలు ప్రభుత్వం అందిస్తుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు కేతిరి శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో అమ్మాయిల కోసం ప్రత్యేకంగా కరాటే శిక్షణ అందించడం జరుగుతుందని ఐఎఫ్ఎస్సి కోడ్ సహాయంతో కంప్యూటర్ విద్యను అందించడం జరుగుతుందని ప్రభుత్వ పాఠశాలలో చదివిన విద్యార్థులకు ప్రభుత్వం ప్రత్యేక గుర్తింపు అందిస్తుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు రాజయ్య పెండెం శ్రీనివాస్ కుమారస్వామి విజేందర్‌రెడ్డి క్రాఫ్ట్ టీచర్ శ్రీమాన్ సిఆర్పి గుర్రప్ప తదితరులు పాల్గొన్నారు.

# రాష్ట్రస్థాయి బాక్సింగ్ పోటీలకు పారమిత విద్యార్థుల ఎంపిక


**జిల్లా స్థాయిలో ప్రతిభ చాటిన విశిష్ట, నిహారికకు రాష్ట్ర స్థాయిలో పోటీ చేసే అవకాశం**



**కరీంనగర్, (సింగిడి):** స్థానిక పారమిత ఉన్నత పాఠశాలకు చెందిన విద్యార్థులు కె. విశిష్ట, ఎ. నిహారిక రాష్ట్ర స్థాయి సబ్‌జూనియర్ బాలబాలికల బాక్సింగ్ ఛాంపియన్‌షిప్ పోటీలకు ఎంపికయ్యారు. ఇటీవల కరీంనగర్‌లోని అంబేద్కర్ స్టేడియంలో జిల్లా బాక్సింగ్ క్రీడా సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన ఉమ్మడి జిల్లా స్థాయి సబ్‌జూనియర్ బాక్సింగ్ పోటీలలో 9వ తరగతి విద్యార్థి కె. విశిష్ట (64--67 కిలోల విభాగం), 8వ తరగతి విద్యార్థిని ఎ. నిహారిక (46--49 కిలోల విభాగం) విశేష ప్రతిభ కనబరిచారు. దీంతో వీరు జూన్ 13న హైదరాబాద్‌లోని ఆలే నరేంద్ర క్రీడా సముదాయంలో తెలంగాణ బాక్సింగ్ సంఘం ఆధ్వర్యంలో జరిగే 5వ రాష్ట్ర స్థాయి సబ్‌జూనియర్ బాక్సింగ్ ఛాంపియన్‌షిప్ పోటీలలో పాల్గొననున్నారు. ఈ సందర్భంగా పాఠశాల చైర్మన్ డా. ఇనుగంటి ప్రసాదరావు, రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైన విద్యార్థులతో పాటు బాక్సింగ్ శిక్షకుడు ఎ. రామకృష్ణను అభినందించారు. పాఠశాల డైరెక్టర్లు ప్రసూన, రాకేష్, రశ్మిత, అనుకర్‌రావు, వినోదరావు, వి.యు.ఎం. ప్రసాదరావు, హనుమంతరావు, ప్రధానోపాధ్యాయులు ప్రశాంత్, బాలాజీ, కవిత ప్రసాద్ సమన్వయకర్త శ్రీనాథ్ శుభాకాంక్షలు తెలిపారు.

# మన బడి, మన బాధ్యత కార్యక్రమానికి ముమ్మర ఏర్పాట్లు

**ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో ఏర్పాట్లను పరిశీలించిన మేయర్ కొలగాని శ్రీనివాస్**




**కరీంనగర్, (సింగిడి):** కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ పిలుపు మేరకు శనివారం నిర్వహించనున్న "మన బడి--మన బాధ్యత, స్వచ్ఛ పాఠశాల" కార్యక్రమానికి సంబంధించి కరీంనగర్ నగరపాలక సంస్థ 2వ డివిజన్ తీగలగుట్టపల్లిలోని ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో జరుగుతున్న ఏర్పాట్లను నగర మేయర్ కొలగాని శ్రీనివాస్ పరిశీలించారు. ఈ సందర్భంగా నిర్వహించిన సమావేశంలో డివిజన్ నాయకులు, కార్యకర్తలతో కలిసి పాఠశాల ఆవరణతో పాటు పరిసర ప్రాంతాలను సందర్శించిన మేయర్ పరిశుభ్రత, పారిశుధ్య ఏర్పాట్లను సమీక్షించారు. పాఠశాలలు పరిశుభ్రంగా ఉండటం విద్యార్థుల ఆరోగ్యం, ద్యాభివృద్ధికి ఎంతో అవసరమని ఆయన పేర్కొన్నారు. శనివారం రోజున జరగనున్న కార్యక్రమాన్ని విజయవంతం చేయడానికి ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. అనంతరం నాయకులు, కార్యకర్తలతో కలిసి అల్పాహారం చేసిన మేయర్, స్థానిక సమస్యలు, డివిజన్ అభివృద్ధి అంశాలపై చర్చించారు. ఈ కార్యక్రమంలో డివిజన్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# స్వచ్ఛ పాఠశాల కార్యక్రమాన్ని విజయవంతం చేయాలి

**జిల్లా ప్రధాన కార్యదర్శి మాడ వెంకట్ రెడ్డి**





**హుజురాబాద్, (సింగిడి):** కేంద్రహోంశాఖసహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ ఆదేశాల మేరకు భారతీయ జనతా పార్టీ హుజురాబాద్ పట్టణ శాఖ ఆధ్వర్యంలో శుక్రవారం స్థానిక హైస్కూల్ గ్రౌండ్‌లో టిఫిన్ బైఠక్ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి మాడ వెంకట్ రెడ్డి హాజరై పార్టీ నాయకులు, కార్యకర్తలకు దిశానిర్దేశం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, జూన్ 13న నిర్వహించనున్న "స్వచ్ఛ పాఠశాల" కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. పాఠశాలల పరిశుభ్రతకు ప్రతి ఒక్కరూ బాధ్యత వహించాలని, విద్యార్థులకు స్వచ్ఛమైన, ఆరోగ్యకరమైన విద్యా వాతావరణం కల్పించడం సమాజ బాధ్యత అని పేర్కొన్నారు. స్థానిక ప్రజలను కూడా ఈ కార్యక్రమంలో భాగస్వాములను చేసి, పాఠశాలల పరిశుభ్రత మరియు అభివృద్ధి కోసం స్వచ్ఛందంగా ముందుకు రావాలని కోరారు. సమాజంలోని ప్రతి వ్యక్తి పాఠశాలల పట్ల బాధ్యతతో వ్యవహరిస్తే భావితరాలకు మెరుగైన విద్యా వాతావరణం అందించగలమని అన్నారు. కార్యక్రమంలో పట్టణ అధ్యక్షుడు తూర్పాటి రాజు, టిఫిన్ బైఠక్ కన్వీనర్ తిప్పబత్తిని రాజు, జిల్లా కార్యవర్గ సభ్యులు గంగిశెట్టి ప్రభాకర్, తూముల శ్రీనివాస్, జిల్లా కౌన్సిల్ సభ్యుడు రావుల వేణు, మాజీ కౌన్సిలర్ నల్ల సుమన్, సీనియర్ నాయకులు సబ్బని రమేష్, కొలిపాక శ్రీనివాస్, నారాల రాజశేఖర్, అంకటి వాసు, బోరగాల సారయ్య, కొడిమ్యాల పవన్, మోటపోతుల రాకేష్, కొలుగూరి అనిల్, కొలిపాక వెంకటేష్, క్యాస్ వెంకటేష్, నీలం రవీందర్, గంధం సంతోష్, పర్దం విజయ్, అనంతుల విక్రం తదితరులు పాల్గొన్నారు.

## బీఆర్ఎస్ సభ్యత్వ నమోదును బహిష్కరించండి..

**నియోజకవర్గ అభివృద్ధి కోసం ఎమ్మెల్యే ఏం చేశాడో నిలదీయండి**

**కాంగ్రెస్ నేత తిప్పారపు సంపత్**



**జమ్మికుంట, (సింగిడి):** హుజురాబాద్ నియోజకవర్గంలో టిఆర్ఎస్ సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని ప్రజలు బహిష్కరించాలని కాంగ్రెస్ పార్టీ నేత తిప్పారపు సంపత్ పిలుపునిచ్చారు. శుక్రవారం ఆయన మాట్లాడుతూ, ట్రిబుల్ షూటర్ గా చెప్పుకునే మాజీ మంత్రి తన్నీరు హరీష్ రావు శుక్రవారం జమ్మికుంట పట్టణంలో టిఆర్ఎస్ ఏర్పాటు చేసిన సభ్యత్వ నమోదు కార్యక్రమంలో మాట్లాడుతూ, రాష్ట్రంలో రాబోయేది టిఆర్ఎస్ ప్రభుత్వమే అని చెప్పడం హాస్యాస్పదంగా ఉందని అన్నారు. గత ఎన్నికల్లో గెలిచిన ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డి నియోజకవర్గ అభివృద్ధికి ఎన్ని నిధులు తీసుకువచ్చాడో ఏం అభివృద్ధి చేశారో ప్రజలు నిలదీయాలని కోరారు. మోసపూరితమైన మాటలు మాట్లాడి కుటుంబాన్ని అడ్డం పెట్టుకొని గెలిచిన వ్యక్తి కౌశిక్ రెడ్డి అని అన్నారు. సొంత పార్టీ నేతలే మీటింగులు పెట్టి కౌశిక్ రెడ్డికి వ్యతిరేకంగా నిర్ణయాలు తీసుకున్నారని అలాంటి వ్యక్తిని హుజురాబాద్ నియోజకవర్గ ప్రజలు మళ్లీ గెలిపిస్తారని ప్రశ్నించారు. నియోజకవర్గం అభివృద్ధిని గాలికి వదిలేసి సోషల్ మీడియాలో హీరోలాగా ఫీల్ అవుతున్నాడని ఇలాంటి నాయకుడు ఏ నియోజకవరానికి ఉండొద్దని ప్రజలు తమ ఆవేదనను వ్యక్తపరుస్తున్నారని సంపత్ తెలిపారు. హరీష్ రావు ఎక్కడికి వెళ్తే అక్కడ ఆ పార్టీ ఓటమిపాలవుతుందని గతంలో అతను వెళ్ళిన దుబ్బాక ఉప ఎన్నిక పంపితే అక్కడ రఘునందన్ రావు ఎలా గెలిచాడో మంత్రి హరీష్ రావు తెలపాలని ఉన్నారు. హుజురాబాద్ ఉప ఎన్నిక సమయంలో కూడా హరీష్ రావును ఇన్చార్జిగా నియమిస్తే ఇక్కడ ఈటెల రాజేందర్ గెలిచారని వచ్చే ఎన్నికల్లో కూడా కౌశిక్ రెడ్డికి ఓటమి తప్పదని ఆయన జోష్యం చెప్పారు. కౌశిక్ రెడ్డి అరాచక పాలనను నియోజకవర్గ ప్రజలు తిరస్కరిస్తున్నారని రాబోయే రోజుల్లో టిఆర్ఎస్ పార్టీకి డిపాజిట్ కూడా రాదని ఆయన పేర్కొన్నారు.

## బాల కార్మిక వ్యతిరేక దినోత్సవ వాల్ పోస్టర్ ఆవిష్కరణ



**నిజామాబాద్ ప్రతినిధి, (సింగిడి):** బాల కార్మిక వ్యతిరేక దినోత్సవాన్ని పురస్కరించుకుని శుక్రవారం సాధన సంస్థ ఆధ్వర్యంలో జిల్లా అడిషనల్ కలెక్టర్ కిరణ్ కుమార్ ఆధ్వర్యంలో బాల కార్మిక వ్యతిరేక దినోత్సవ వాల్ పోస్టర్ ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా అడిషనల్ కలెక్టర్ మాట్లాడుతూ బాల కార్మిక వ్యతిరేక దినోత్సవ వాల్ పోస్టర్ విడుదల చేయడం సంతోషకరమని, ఈ పోస్టర్ ఎందరికో అవగాహన కలిగించాలని కోరారు. ఈ కార్యక్రమంలో సాధన సంస్థ సిబ్బంది మధుసూదన్, వినేష్ కుమార్, నిరీక్షణ తదితరులు పాల్గొన్నారు.

# బాల కార్మికులను ప్రోత్సహించకూడదు..

**డీఎల్ఎస్ఏ సుబేధర్ రాజ్‌కుమార్**




**నిజామాబాద్ ప్రతినిధి, (సింగిడి):** బాల కార్మికులను ప్రోత్సహించకూడదని, బాలలను పనిలో పెట్టుకుంటే యజమానులపై కఠిన చర్యలు తీసుకుంటామని డీఎల్ఎస్ఏ సుబేదర్ రాజ్ కుమార్ తెలిపారు. అంతర్జాతీయ బాల కార్మికుల వ్యతిరేఖ దినోత్సవ సందర్భంగా సాధన సంస్థ ఆధ్వర్యంలో శుక్రవారం గాంధీ చౌక్ లేబర్ అడ్డా ప్రాంతంలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో డీఎల్ఎస్ఏ సుబేధర్ రాజ్ కుమార్, మాణిక్యం పాల్గొని బాలలను వివిధ పనిలో పెట్టుకునే యజమానులపై ప్రభుత్వం విధించే శిక్షల గురించి తెలియజేసారు. ఈ కార్యక్రమంలో సాధన సిబ్బంది మధుసూదన్, వినేష్ కుమార్, నిరీక్షణ, డీఎల్ఎస్ఏ సిబ్బంది, 250 పైగా లేబర్స్ పాల్గొన్నారు.

singidinews@gmail.com



# విమర్శలు నన్నేం చేయవు..

నటుడు ధ్రువ్ విక్రమ్ తన వ్యక్తిగత జీవితంపై జరుగుతోన్న ప్రచారం, ఎదురవుతోన్న విమర్శలపై స్పందించారు. నటి అనుపమ పరమేశ్వరన్ ఇటీవల చేసిన వ్యాఖ్యల అనంతరం తనపై వస్తున్న వార్తల గురించి ఓ ఇంటర్వ్యూలో ఆయన మాట్లాడారు.

**వాళ్లే నాకు కొండంత బలం..**

నటి పేరు ప్రస్తావించనప్పటికీ.. బ్రేకప్ గురించి ధ్రువ్ విక్రమ్ మాట్లాడారు. “నా బ్రేకప్ తర్వాత ఎదురైన కష్టకాలం నన్ను వ్యక్తిగతంగా ఎంతో ప్రభావితం చేసింది. కానీ, నా కుటుంబం, అభిమానులు అందించిన కొండంత ధైర్యం వల్లే నేను దాని నుంచి బయటకు రాగలిగాను. సినీ పరిశ్రమలోకి వచ్చేటప్పుడే నా వ్యక్తిగత జీవితంపై అందరూ దృష్టి పెడతారని తెలుసు. ఆ సమయంలో మా అమ్మ నాకు ఎప్పటికప్పుడు ధైర్యాన్నిచ్చింది” అని తెలిపారు.

**విమర్శలు నన్నేం చేయవు..**

“నిజం చెప్పాలంటే, ఈ ప్రచారం నన్ను అస్సలు ప్రభావితం చేయలేదని నేను చెప్పలేను. కానీ, ఇలాంటి సమయంలో మనల్ని మనం ఎక్కువ అర్థం చేసుకోవడం చాలా ముఖ్యం. మనమేమిటో, దేనికోసం నిలబడ్డామో తెలుసుకోవాలి. మనకు నచ్చిన వారిని, మన ప్రాణంగా భావించే ప్రతి విషయాన్ని కాపాడుకోవాలి. మన ప్రవర్తన నిజాయతీగా ఉన్నప్పుడు, ఈ విమర్శలు మనల్ని ఏం చేయలేవు” అని అన్నారు.

**సోషల్ మీడియాలో అందుకే..**

తాను సోషల్ మీడియాలో తక్కువ సమయం గడుపుతానని ధ్రువ్ తెలిపారు. “నాకు ఎడిటింగ్ చేయడం, వీడియోలు తీయడం అంటే చాలా ఇష్టం. వీడియోలను షూట్ చేసి మ్యూజిక్‌కి తగ్గట్టుగా కట్ చేస్తుంటాను. వాటిని సోషల్ మీడియాలో పంచుకోను కానీ, అది నాకు చాలా ఇష్టమైన పని. సినిమాలు విడుదలయ్యేటప్పుడు ప్రమోషన్స్ ఉన్నప్పుడు మాత్రమే సోషల్ మీడియాలో యాక్టివ్‌గా ఉంటాను. మిగిలిన సమయాల్లో పుస్తకాలు చదవడం, సంగీతం వినడంలో మునిగిపోతాను” అని చెప్పారు.

ఇక అనుపమ పరమేశ్వరన్ ఇటీవల ఓ ఇంటర్వ్యూలో తన రిలేషన్ గురించి చెప్పిన మాటలు వైరలైన విషయం తెలిసిందే. గతంలో రెండేళ్ల పాటు ఒక వ్యక్తితో రిలేషన్‌షిప్‌లో ఉన్నప్పుడు నరకం అనుభవించినట్లు చెప్పారు. మానసిక వేధింపులకు గురయ్యానని, శారీరకంగా తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నానని తెలిపారు. ఆ వ్యక్తి ఎవరనేది మాత్రం ఆమె గోప్యంగా ఉంచినప్పటికీ గతంలో ఆమె సోషల్ మీడియాలో పెట్టిన కొన్ని ఫొటోలతో ధ్రువ్ పేరు బయటకు వచ్చింది. వీరిద్దరూ రిలేషన్‌లో ఉన్నట్లు వార్తలు కూడా ప్రచారమయ్యాయి. వీరిద్దరూ కలిసి ‘బైసన్’ సినిమాలో నటించిన సమయంలో ఈ రూమర్స్ వచ్చాయి.

సినిమా సింగిడి
Cinma Singidi

బుధవారం
19-8-2026



‘సిగ్మా’.. కొత్త విడుదల

# తేదీ ఖరారు..

కోలీవుడ్ అగ్రకథానాయకుడు, తమిళనాడు సీఎం విజయ్ కుమారుడు జాసన్ సంజయ్ దర్శకుడిగా

పరిచయమవుతున్న సినిమా ‘సిగ్మా’ (ాఅస్త్రఘ్). సందీప్ కిషన్ హీరోగా రూపొందిన ఈ మూవీ విడుదల తేదీ ఖరారైంది. గాంధీ జయంతి సందర్భంగా అక్టోబర్ 2న దీన్ని విడుదల చేయనున్నట్లు చిత్రబృందం తాజాగా ప్రకటించింది (ాఅస్త్రఘ్ చీవష =వశ్రీఘంవ ఇఖ్వ). మొదట ఈ సినిమాను జులై 31న విడుదల చేయాలని భావించారు. అయితే, ఈ తేదీకి వారం ముందు విజయ్ నటించిన ‘జన నాయగన్’ విడుదల కావడంతో దీన్ని వాయిదా వేశారు. తాజాగా కొత్త విడుదల తేదీని ప్రకటిస్తూ పోస్టర్‌ను పంచుకున్నారు. ఈ సినిమాలో ఫరియా అబ్దుల్లా కథానాయికగా నటించగా.. రాజు సుందరం, సంపత్ రాజ్ తదితరులు కీలక పాత్రలు పోషించారు. దీనికి తమన్ సంగీతమందించారు. ఇక జాసన్ సంజయ్ త్వరలోనే హీరోగానూ పరిచయం కానున్నట్లు ఇటీవల వార్తలు వచ్చాయి. ప్రముఖ నిర్మాత జీకేఎమ్ తమిళ్ కుమరన్ తన సొంత బ్యానర్‌పై సంజయ్‌ను హీరోగా పరిచయం చేయనున్నట్లు కోలీవుడ్ వర్గాల్లో బలంగా వినిపించింది. విజయ్ (ఎఅయిఖఎ) సినిమాల నుంచి వైదొలగిన నేపథ్యంలో ఆయన కుమారుడు వెండితెరకు పరిచయం కానున్నట్లు వార్తలు రావడం ప్రాధాన్యత సంతరించుకుంది

## బుల్లెట్ల మోతే కాదు..
# మనసుని దోచే కథతో!

వైవిధ్యమైన పాత్రల్లో భాషలతో సంబంధం లేకుండా నటిస్తూ సినీప్రియుల్ని ఆకట్టుకుంటుంది కథానాయిక జెనీలియా. ఇటీవలే ‘రాజా శివాజీ’తో ప్రేక్షకుల్ని పలకరించిన ఆమె మరో చిత్రంతో థియేటర్లలో సందడి చేయడానికి సిద్ధమవుతోంది. ఆమె.. బాలీవుడ్ హీరో ఇమ్రాన్ హష్మీ జంటగా నటిస్తున్న చిత్రం ‘గన్‌మాస్టర్ జీ9’. అపర్శక్తి ఖురానా కీలకపాత్రలో నటిస్తున్నారు. ఆదిత్య దత్ దర్శకత్వం వహిస్తున్న ఈ చిత్రాన్ని దీపక్ ముకుత్, హునార్ ముకుత్, సంగీత అహిర్ సంయుక్తంగా నిర్మిస్తున్నారు. తాజాగా ఈ సినిమా విడుదల తేదీని వీడియోతో సామాజిక మాధ్యమాల వేదికగా పంచుకుంది జెనీలియా. “ఈసారి బుల్లెట్ల మోత మాత్రమే కాదు.. మీ హృదయాన్ని గెలుచుకునేందుకు యాక్షన్, రొమాన్స్, సంగీతంతో రాబోతున్నామ’నే వ్యాఖ్యల్ని జోడించింది. నవంబరు 27న ఈ చిత్రం విడుదల కానుంది. ఈ సందర్భంగా చిత్రబృందం బలమైన సంగీత నేపథ్యంతో రొమాంటిక్ యాక్షన్ డ్రామాగా ఈ సినిమాని తీర్చిదిద్దుతున్నట్లు తెలిపింది.

“కుటుంబ సమేతంగా చూడదగ్గ చిత్రం ‘అమీర్ లోగ్’. ఇందులో ప్రతి పాత్రా ప్రధాన పాత్రలాగే ఉంటుంది” అన్నారు దర్శకుడు రమణా రెడ్డి సోమ. ఆయన తెరకెక్కించిన ఈ సినిమాలో ఎంసీ హరి, మనోజ్, శశిధర్ ప్రధాన పాత్రలు పోషించారు. ఈ చిత్రం రానా దగ్గుబాటి స్పిరిట్ మీడియా ద్వారా ఈనెల 21న థియేటర్లలోకి రానుంది. ఈ నేపథ్యంలోనే సోమవారం హైదరాబాద్‌లో విలేకర్లతో చిత్ర విశేషాలు పంచుకు న్నారు దర్శకుడు రమణా రెడ్డి. “హైదరాబాద్ బస్తీని అందంగా చూపించాలని చేసిన సినిమా ఇది. ఇది ఓ బస్తీలోని ముగ్గురు కుర్రాళ్ల కథ. రెండేళ్ల క్రితం ఈ స్క్రిప్ట్‌ని పూర్తి చేశా. దీన్ని డెమో షూటింగ్‌లా చేసి చాలా మందికి చూపించాం. అది అందరికీ నచ్చడంతో పూర్తి సినిమాగా మలిచాం. డెమోతో కలిపి దీని షూట్ పూర్తి చేయడానికి 43రోజులు పట్టింది. దీంట్లో నటీనటులు ఎంతో సహజంగా నటించారు. పూర్తిగా సింక్ సౌండ్‌లో రూపొందించాం. ఇందులోని ప్రతి పాత్ర కోణంలో నుంచి ఈ కథ ముందుకు సాగుతుంది. ఇప్పటికే ఈ సినిమాని కొంతమంది దర్శకులు, నటులకు చూపించా. వీఎన్ ఆదిత్య దీన్ని చూసి ఎంతో మెచ్చుకున్నారు. అమితాబ్ బచ్చన్ ‘ఝుండ్’, రణ్‌వీర్ సింగ్ ‘గల్లీబాయ్’ చిత్రాలతో పోల్చారు. ఈ సినిమా కచ్చితంగా అన్ని వర్గాల ప్రేక్షకులకు నచ్చుతుంది”.

## ‘ఝుండ్’...‘గల్లీబాయ్’ చిత్రాలతో పోల్చారు

Printed,published & Owned by P. Sunitha Reddy on behalf of Flamingo Media Networks, Printed at Sree Seshasai Enterprises Plot no.98/1, Co-operative Industrial Estate, Gandhi Nagar, Near Balanagar, Medchel Malkajgiri Dist.Hyderabad Telangana 500037.and Published from PLOT NO 74 A/D, KAMAKSHI NILAYAM, ESHWARIPURI COLONY, SAINIKPURI, MEDCHAL MALKAJGIRI, TELANGANA - 500094.
Editor : Dussa Shivaprasad, PRGI.NO. TGTEL/26/A4370. Cell 8179799090